

రాష్ట్ర బడ్జెట్‌పై ప్రత్యేక కథనాలు లోపలిపేజీల్లో

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

శుక్రవారం FRIDAY 26.7.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 | సంచిక (Issue): 51 | వెల (Price) రూ.6.50 | షష్ఠి

శుక్రవారం, సూర్యోదయం: 5-59, సూర్యాస్తమయం: 6-51. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం గ్రీష్మ ఋతువు ఆషాఢ మాసం కృష్ణ పక్షం తిథి: షష్ఠి రాత్రి 11-31 వరకు. నక్షత్రం: ఉత్తరాభాద్ర పగలు 2-31 వరకు. వర్జ్యం: రాత్రి 1-45 నుంచి రాత్రి 3-15 వరకు. రాహుకాలం: ఉదయం 10-45 నుంచి పగలు 12-22 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-29 నుంచి ఉదయం 9-21 వరకు, పునర్ దుర్ముహూర్తం పగలు 12-48 నుంచి పగలు 1-40 వరకు. అమృతకాలం: ఉదయం 10-09 నుంచి ఉదయం 11-32 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

పోటీ పరీక్షలు, అకడమిక్‌కు సంబంధించిన మెటీరియల్ నేటి 'నిపుణ' ఈ పేపర్‌లో..

కోత.. కొట్టివేత.. ఎగవేత!

ప్రజా సంక్షేమానికి బడ్జెట్‌లో భారీ కత్తెర.. 4 వేల కోట్లు తగ్గించిన రాష్ట్ర సర్కార్

కేసీఆర్ కిట్ సహా పలు పాత పథకాలు కట్.. కాంగ్రెస్ గ్యారెంటీలకూ గండి

కొత్త పాలసీ లేని పద్దు.. ప్రాధాన్య రంగాలు పూచికపుల్లలే!

- అసెంబ్లీలో 2024-25 బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన భట్టి విక్రమార్క
- రైతు సంక్షేమానికి అరకొర! కోతలు తప్పవంటూ సంకేతాలు!
- దళితబంధుకు రాం రాం.. రూపాయైనా ఇవ్వని ప్రభుత్వం
- గొర్రెల పంపిణీకి గుండుసున్నా.. చేపల పంపిణీకి ఏదీవంతే!
- ఆటోకార్మికులకు మొండిచెయ్యి.. ఏదీ నిరుద్యోగ భృతి?
- నేతన్నకు నో భరోసా.. బడ్జెట్‌కు పట్టని బతుకమ్మ చీర
- తులం బంగారం తరుగు.. కల్యాణలక్ష్మికి కటకటే!
- పింఛన్ల పెంపు, మహిళలకు 2500 ప్రస్తావనేది?
- ఉద్యోగాల భర్తీకి నిధులేవి? ఊసే లేని పీఆర్సీ!
- ఇందిరమ్మ ఇండ్లకు తిప్పి తిప్పి ఇచ్చింది 9 వేల కోట్లే
- లక్నవర కొట్ల మూసీ ప్రాజెక్టుకు ఇచ్చింది 1500కోట్లు
- 24 వేల కోట్ల మెట్రో విస్తరణకు కేటాయించింది 5 శాతమే
- బడ్జెట్లో చోటుదక్కని హైదరాబాద్ ఎలివేటెడ్ కారిడార్లు
- నిరుటి కన్నా ఎక్కువ అప్పు.. ఈ ఏడాది 57,112 కోట్లు!
- ఏపీ రుణం మాఫ్.. అంతర్రాష్ట్ర సర్దుబాట్లు 'సున్నా'నేసట!

పథకాల గాంభీర్యానికి తక్కువ లేదు. పదే పదే రాహుల్ భజనకూ లోటు లేదు. పరనింద ఆపలేదు. కానీ, పద్దు లెక్కల్లోనే తేడా కొట్టింది! సంక్షేమానికి కోతపెట్టింది! ఎన్నికల ముందటి హామీలు.. భట్టి పద్దులో వట్టి కోతలుగా, గట్టి వాతలుగా మిగిలినయ్. ప్రజాసంక్షేమానికి కేటాయింపులను కత్తిరించిన సర్కార్.. ఏపీ అప్పులను మాత్రం అడగకపోయినా మాఫీ చేయడం ఓ విచిత్రం. ఓ వైపరీత్యం!

› 2

కొత్త పథకం లేదు. కొత్త పాలసీ లేదు. మరోవైపు తెలంగాణకు ఖ్యాతి తెచ్చిన పథకాలకు మంగళం! దళితుల పైసలకు దండి కొట్టారు! రైతుల సంక్షేమానికి గండికొట్టారు! పోనీ తాము గ్యారెంటీ ఇచ్చిన పథకాలకైనా నిధులిచ్చారా.. అంటే అదీ లేదు. కేంద్రం నుంచి రావాల్సిన మిషన్ కాకతీయ, భగీరథ గ్రాంట్ నిధుల క్లెయిమ్‌కు మంగళం పాడారు. అభివృద్ధికి మూలమైన క్యాపిటల్ వ్యయంలో భారీ కోతలు పెట్టారు. ఇరిగేషన్, పరిశ్రమలు, గృహనిర్మాణం, ప్లానింగ్, రోడ్ల అభివృద్ధి నిధులకు కత్తెర. మహిళలకు మొండిచెయ్యి. ఉద్యోగులకు 4 విడతల డీఏ, పీఆర్సీ ఊసేలేదు. నిరుద్యోగులకు భృతి లేదు. కొత్త ఉద్యోగాల కల్పనకు పైసా ఇవ్వలేదు. దళితబంధును బంద్ పెట్టి, చేనేతకు 'చెయ్యి'చ్చారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల ఆర్తిందనలు బడ్జెట్ లేఖలు చెవిన పడలేదు. ఘనంగా కాలు బద్ధలయ్యేంత ప్రచారం చేసిన ఇందిరమ్మ ఇండ్లకు అరకొర నిధులు. ఆర్టీసీ విలీనం ఊసులేదు. కౌలురైతు గురించి స్వయంగా భట్టిగారే చెప్పిన కథను కాలెత్తిక్కింది. 31వేల కోట్లు అవసరమైన రుణమాఫీకి ఇచ్చింది 26వేల కోట్లు! రైతుబంధుకు 23వేల కోట్లను గాను కేటాయించింది మూడోవంతు! ఎన్నికల ముందు కూతలిచ్చిన హామీలన్నీ బడ్జెట్‌లో కోతలైపోయాయి. భట్టి పద్దు ప్రజలకు వట్టి ముచ్చటగానే మిగిలింది!!



అంకెలు తప్పిన 'లంకె బిందెల' బడ్జెట్!

4+2=0

మ్యానిఫెస్టో హామీలు ఫోర్‌ట్వంటీ!

నిధులకు బడ్జెట్‌లో నో గ్యారెంటీ!

2.91 లక్షల కోట్ల బడ్జెట్

- మూలధన వ్యయం: 33,487 కోట్లు
- పన్ను ఆదాయం: 1,38,181 కోట్లు
- పన్నేతర ఆదాయం: 35,208 కోట్లు
- ఈ ఏడాది అప్పు ప్రతిపాదన: 57,112 కోట్లు

పదేండ్ల ప్రగతికి అద్దంపట్టిన ఆర్థిక సర్వే

- తలసరి, జీఎస్డీపీలో రాకెట్ వేగంతో తెలంగాణ
- 2023-24లో రాష్ట్ర తలసరి రూ.3,47,299
- దేశ తలసరి కంటే మన తలసరి 90% ఎక్కువ
- జాతీయ సగటు మించి మన 30 జిల్లాల తలసరి
- వృద్ధిరేటులో కొత్త శిఖరాలకు చేరిన తెలంగాణ
- పదేండ్లలో 9.59 లక్షల కోట్లు పెరిగిన జీఎస్డీపీ
- రికార్డుస్థాయిలో సాగు విస్తీర్ణం, ధాన్యం దిగుబడి
- సామాజిక, ఆర్థిక నివేదిక -2024లో సుస్పష్టం

› 3

ప్రసంగమంతా పరనింద

- భట్టి బడ్జెట్ స్పీచ్‌లో గతంపైనే ఎక్కువ ఫోకస్
- సూక్తులతో ప్రసంగం.. తర్వాతంతా ఆత్మస్తుతి
- మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టిన శ్రీధర్‌బాబు › 2

తగ్గిన మూలధన వ్యయం

- రెవెన్యూ వ్యయంలో ఏటేటా పెంపు మాత్రమే › 3
- నిరుటితో పోల్చితే రూ.10వేల కోట్లు తగ్గుదల
- ఈ నిధులతో అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా?



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద రాష్ట్ర బడ్జెట్‌పై మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో ఎమ్మెల్యేలు వివేకానంద, కొత్త ప్రభాకర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి

విఫల సర్కారును చీల్చి చెండాడుతం

బడ్జెట్ అంతా గ్యాస్, ట్రాష్: కేసీఆర్

"ఇది పేదల బడ్జెట్ కాదు. రైతుల బడ్జెట్ కాదు. అంతా గ్యాస్, ట్రాష్ తప్ప ఇందులో ఏమీలేదు. మీ వ్యవసాయ పాలసీ, పారిశ్రామిక పాలసీ, ఐటీ పాలసీ ఏమిటనే దానిపై స్పష్టత ఉన్నదా? ఈ ఏడాది మా లక్ష్యం ఇదీ అని ఎక్కడైనా చెప్పిందా?" -కేసీఆర్

- రాష్ట్ర బడ్జెట్‌లో రైతుభరోసా ప్రస్తావనేది?
- విధానమంటూ లేని కాంగ్రెస్ ప్రభుత్వమిది
- దళిత సమాజం పట్ల వారిది ఫ్యూడల్ పాలసీ
- నిధులివ్వక అట్టడుగు వర్గాల గొంతుకోశారు
- ఇది రైతు వ్యతిరేక ప్రభుత్వమని తేటతెల్లం
- బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఆగ్రహం

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నిప్పులు చెరిగారు. కాంగ్రెస్‌ను చీల్చి చెండాడుతామని హెచ్చరించారు. గురువారం అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క చేసిన బడ్జెట్ ప్రసంగం అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేసీఆర్ మాట్లాడారు. 'ఇది పేదల బడ్జెట్ కాదు.. రైతుల బడ్జెట్ కాదు. గ్యాస్, ట్రాష్ తప్ప.. వ్యవసాయ పాలసీ ఏమిటి? పారిశ్రామిక పాలసీ ఏమిటి? ఐటీ పాలసీ ఏమిటి? ఇంకా ఇతర అనేక పాలసీలు.. పేద వర్గాలకు సంబంధించిన పాలసీ ఏమిటి? అనే ఏ ఒక్క దానిపైనా స్పష్టత లేదని ధ్వజమెత్తారు. 'ఈ పనిని మేం ఇలా సాధిస్తాం.. మా గోల్స్, టార్గెట్స్ ఇవి అనే పద్ధతి కానీ, పద్దు కానీ లేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసాపై అనేక ఆంక్షలు విధిస్తున్నట్టు ప్రభుత్వం ప్రత్యక్షంగా చెప్పకనే రైతులను మోసం చేసింది అని కేసీఆర్ పేర్కొన్నారు. 'గత ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని, అభివృద్ధిని కాంక్షించి అనేక పథకాలు ప్రవేశపెట్టింది. యాదవ సోదరుల ఆర్థికాభివృద్ధి కోసం గొర్రెల › 2వ పేజీలో

దశ, దిశ లేని బడ్జెట్



- అంతా ఆత్మస్తుతి, పరనింద.. రాష్ట్రానికి ఇది తిరోగమనమే
- మహాలక్ష్మికి మహా నిరాశ.. ఆటో కార్మికులకు మొండి చేయి
- అప్పుల భారం.. భూముల విక్రయం.. రుణమాఫీకి నిధులేవి?
- ఆరు గ్యారెంటీలేవి.. అంకెల గారడీ : హరీశ్‌రావు

› 5

కౌలు రైతు ఆత్మహత్య



దిగుబడి రాక.. అప్పులు తీర్చలేక పురుగుల మందుతాగి బలవన్మరణం › 11

సిరిసిల్ల బంద్ సక్సెస్

- నేతన్నలకు వ్యాపారుల మద్దతు
- మానవహారంతో నిరసన
- కొనసాగుతున్న రిలే దీక్షలు

› 11



గురువారం బీఆర్‌ఎస్ బృందంతో కలిసి మానేరు డ్యాంను పరిశీలిస్తున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు గంగుల కమలాకర్, ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

రాజకీయం కోసం.. రైతులతో సర్కార్ చెలగాటం

- కుట్రలను, పది లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకుని నిలబడ్డది కాళేశ్వరం
- కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలి.. తక్షణమే రిజర్వాయర్లు నింపాలి: కేటీఆర్ › 10
- బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ఎల్‌ఎండీ సందర్శన

కాళేశ్వరమే కల్పతరువు

సమైక్యరాష్ట్రంలో సాగునీటిరంగంపై నిర్లక్ష్యం.. కేసీఆర్ సర్కార్ రీడిజైన్‌తో జలభాండాగారం



44 ఏండ్లలో ఏటా 1,709 టీఎంసీలు సముద్రం పాలు

- ప్రస్తుతం మేడిగడ్డ వద్ద నుంచి రోజుకు 70 టీఎంసీలకుపైగా సముద్రంలోకి..
- కుట్రల్ని, కట్టుకథల్ని తట్టుకున్న ప్రాజెక్టు
- కాంగ్రెస్ కండ్లు తెరిస్తే తప్పనున్న ముప్పు
- నేడు బీఆర్‌ఎస్ బృందం మేడిగడ్డ సందర్శన

కరీంనగర్, జూలై 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : "నా ప్రాణం పోయినా సరే రాబోయే ఐదేండ్లలో కోటి ఎకరాలకు సాగునీరు అందించి తీరుతా. నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నిరూపిస్తా. ఇరు నూరైనా ఎన్ని ఆటంకాలు కలిగించినా, అవరోధాలెన్ని సృష్టించినా హరిత తెలంగాణను సాధించే వరకు మా ప్రస్థానం ఆగేది కాదు. మమ్మల్నెవరూ ఆపలేరు. అపురూపమనుకుంటే అది భ్రమే. నాకు ఎల్లప్పుడు అండగా ఉంటూ దీవిస్తున్న నా ప్రజల సహకారంతో ప్రాజెక్టులు కట్టి తీరుతా. తెలంగాణ రాష్ట్రం మిషన్ ట్యాగ్ లైన్.. నిధులు, నియామకాలు, నీళ్లు. స్వరాష్ట్రంలో నిధులు, నియామకాలు సాధించాం. ఇక కావాల్సింది నీళ్ల పరిష్కారమే'.. 2016 మార్చి 31న శాసనసభా వేదికగా చేసిన ప్రాజెక్టుల రీ-డిజైనింగ్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ చెప్పిన మాటలివి. చెప్పింది చెప్పినట్టు కార్యరూపంలో పెట్టేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును అంకురార్పణ చేసి అసాధ్యాన్ని సుసాధ్యం చేసి చూపించారు.

అందుకే రీడిజైనింగ్


రాష్ట్రంలో గోదావరి పరీవాహకం 69 శాతం, కృష్ణా 68.5 శాతం ఉన్నది. మెజార్టీ పరీవాహక ప్రాంతం తెలంగాణలోనే ఉన్నా నాడు సమైక్య ఆంధ్రప్రదేశ్‌లో ఇక్కడి ప్రాజెక్టులకు అన్యాయం జరిగింది. ఈ పరిస్థితుల్లో గోదావరి, › 10వ పేజీలో



రియల్‌కు పన్నుపోటు

- ఇక స్థిరాస్తి క్రయవిక్రయాలు ఆందోళనకరం
- బడ్జెట్‌లో ఇండెక్సేషన్ బెనిఫిట్ దూరం
- పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం
- నిర్మాణ రంగానికి దెబ్బేనంటున్న నిపుణులు

› 8



వెయ్యి తగ్గిన బంగారం

- మూడు రోజుల్లో రూ.5,000 పతనం › 8
- హైదరాబాద్‌లో 70 వేల దిగువకు తులం రేటు
- బడ్జెట్‌లో సుంకం తగ్గింపుతో ఇన్వెస్టర్ల రివర్స్‌గేర్

ఐడీబీఐ ఫర్ సేల్

- ప్రభుత్వరంగ బ్యాంక్ అమ్మకానికి లైన్‌క్లియర్
- త్వరలో రిజర్వ్‌బ్యాంక్ నుంచి గ్రీన్‌సిగ్నల్
- వాటాలు కొనగలిగిన పెట్టుబడిదారులకు భద్రతాపరమైన అనుమతులిచ్చిన హోంశాఖ

› 8



రాష్ట్ర బడ్జెట్ ప్రజల ఆకాంక్షలకు దూరంగా ఉన్నది. ఇది నిర్దర్శక, నిష్ప్రయోజన బడ్జెట్. ఇంత పేలవంగా ఉంటుందని ఊహించలేదు. ఏ వర్గాన్నీ సంతృప్తిపరచలేదు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలకు నిధులు కేటాయించలేదు. కొత్త పాలసీలేమీ లేకుండానే బడ్జెట్‌ను ఉత్త అంకెల గారడీతో నింపేశారు.
- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

విద్య కోసం కేటాయించిన నిధులు **21,281 కోట్లు**

అసెంబ్లీలో కేసీఆర్ హాట్‌టాపిక్

అసెంబ్లీకి వెళ్లకున్న వార్తలు పటాపంచలు • ఇంటి నుంచి బయటకు రాగానే కోలాహలం

- 'జై తెలంగాణ', 'జై కేసీఆర్' నినాదాలు
- అసెంబ్లీ వద్ద అధినేతకు ఘన స్వాగతం
- అనూహ్యంగా మీడియా పాయింట్‌కు



అసెంబ్లీలో బడ్జెట్ ప్రతులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ మాట్లాడినా.. మాట్లాడకపోయినా వార్తే. అసెంబ్లీ సమావేశాలకు రాకపోయినా, వచ్చినా సంచలనమేనని చెప్పేందుకు గురువారం అసెంబ్లీ ప్రాంగణంలో నెలకొన్న వాతావరణమే నిదర్శనం. అసెంబ్లీ సమావేశాలకు గెజిట్ విడుదలైనప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఒకటే చర్చ. 'ఈ సమావేశాలకు కేసీఆర్ హాజరవుతారా? లేదా?' అని అన్నదానిపై ఆసక్తికరమైన చర్చ జరిగింది. మూడు రోజుల క్రితం తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష సమావేశంలో కేసీఆర్ మాట్లాడుతూ 'సమావేశాలకు నేను వస్తున్న. ప్రజల పక్షాన నిలబడి వారి సమస్యలను పరిష్కరించేదాకా ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేస్తా' అని స్పష్టమైన ప్రకటన చేశారు. అయినప్పటికీ, సమావేశాలకు కేసీఆర్ రాడనే ప్రచారం జరిగింది. దీనిని పటాపంచలు చేస్తూ గురువారం సభకు హాజరయ్యారు.

నందినగర్‌లో కోలాహలం

గురువారం నందినగర్‌లోని కేసీఆర్ నివాసం వద్ద వాన కురుస్తున్నా బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కేసీఆర్ బయటకు రాగానే బీఆర్ఎస్ శ్రేణులు, ఆయన అభిమానులు పూలు చల్లుతూ 'జై తెలంగాణ', 'జై కేసీఆర్' అంటూ నినాదాలు చేశారు. కేసీఆర్ వాహనానికి దిష్టి తీశారు. కేసీఆర్ వెంట మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కమలాకర్, లక్ష్మారెడ్డి, కౌశిక్‌రెడ్డి, గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అపూర్వ స్వాగతం

ఇంటి నుంచి కేసీఆర్ బయలుదేరారనే విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీ ప్రాంగణంలో ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన అసెంబ్లీ లాబీలోని తన చాంబర్‌లోకి వెళ్లారు. కేసీఆర్ రాకను తెలుసుకున్న అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు, దీప కరుణాకర్‌రెడ్డి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం అసెంబ్లీ సమావేశ మందిరానికి వెళ్లారు.

అనూహ్యంగా మీడియా పాయింట్‌కు

సభలో బడ్జెట్ ప్రసంగం పూర్తికాగానే సమావేశ మందిరం నుంచి కేసీఆర్ బయటకు వచ్చారు. కేసీఆర్ తన నివాసానికి వెళ్తారని అందరూ భావించారు. వాహనాన్ని సిద్ధం చేశారు. అనూహ్యంగా ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌కు వెళ్లారు. అక్కడ బడ్జెట్‌పై మీడియాతో మాట్లాడి, తిరిగి వాహనం వద్దకు వడివడిగా నడుచుకుంటూ వచ్చి అందరికీ అభివాదం చేస్తూ తన నివాసానికి బయలుదేరారు. కేసీఆర్ మీడియా పాయింట్ దగ్గరికి వెళతున్నారనిగానీ, ఆయన మాట్లాడతారని గానీ, ఆయనకు అరుదైలా ఉన్న నేతలవరకీ అక్కడికి వెళ్లేదాకా తెలియకపోవడం గమనార్హం. 'సార్ మీడియా పాయింట్‌కు వెళ్తారని అనుకోలేదు' అని ఓ మీడియా ప్రతినిధి ఆశ్చర్యం వ్యక్తం చేస్తే.. పార్టీ కీలకనేత ఒకరు 'దట్ ఈజ్ కేసీఆర్' అని పేర్కొన్నారు.

డాబూదర్పం లేని నేత కేసీఆర్

తెలంగాణ రాష్ట్ర సారథిగా, దాదాపు పదేండ్లపాటు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన కేసీఆర్ గురువారం ఒక సాధారణ సభ్యుడిలా అసెంబ్లీలో వ్యవహరించారు. దశాబ్దకాలంపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించినా డాబూదర్పం ఇసుమంతైనా లేకుండా కనిపించారు. ఎమ్మెల్యేలతో సరదాగా మాట్లాడారు. మీడియా పాయింట్ వద్ద ఆయన ఉల్లాసంగా ఉత్సాహంగా మాట్లాడారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో కేసీఆర్‌లా ఉన్నప్పుడు రాష్ట్రంలో మరే మాజీ ముఖ్యమంత్రులు మాట్లాడలేదని అసెంబ్లీ ప్రాంగణంలో చర్చించుకోవడం కనిపించింది.



అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కౌశిక్‌రెడ్డి, వివేకానంద్, లక్ష్మారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, విజయుడు తదితరులు

విఫల సర్కారును చీల్చి చెండాడుతం

> మొదటిపేజీ తరువాయి...

పంచిన పథకాన్ని ప్రవేశపెట్టింది. లబ్ధిదారులకు వారు చెల్లించిన డిపాజిట్ డబ్బులు తిరిగి ఇవ్వడం ద్వారా ఈ పథకాన్ని మూసివేసినట్టు అర్థమవుతున్నది. అట్టడుగు వర్గాల గొంతుకోసింది. దళితబంధు ప్రస్తావన లేనేలేదు. ఇది చాలా దుర్మార్గం. దళిత సమాజం పట్ల నిర్లక్ష్యానికి, ఫ్యూడల్ విధానానికి ఇది నిదర్శనం. మత్స్యకారులకు భరోసా లేదు. ఇందులో విశేషం ఏమిటంటే అంకెలు వచ్చి నప్పుడల్లా ఆర్థికమంత్రి ఒత్తిఒత్తి పలకడం తప్ప కొత్తగా ఏమీ లేదు' అని ఎద్దేవా చేశారు. మహిళల పట్ల కూడా చాలా విషయాలు స్పష్టంగా చెప్పాల్సిన అవసరం ఉండేనని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. "కొత్తగా లక్ష కోట్ల వరకు వడ్డీ లేని రుణాలు ఇస్తామని చెప్పారు. ఇవి రుణాలు, వాళ్లు ఇచ్చేది ఏముంటది? అది ఆల్రెడీ ఉన్న స్కీమే. దురదృష్టం ఏందంటే.. ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మేం కూడా కనీసం ఆరుమాసాల సమయం ఇవ్వాలనుకున్నాం. నేను కూడా పెద్దగా శాసనసభకు రాలేదు. కానీ, బడ్జెట్ చూస్తే ఏ ఒక్క పాలసీ ఫార్ములేషన్ జరగలేదు. రాష్ట్రానికి సంబంధించిన ఏ ఒక్క విషయంలో కూడా ఈ అర్భక ప్రభుత్వం ఇప్పటివరకు పాలసీ ఫార్ములేషన్ చేసినట్టుగా కనబడుత లేదు' అని విమర్శించారు.



రైతుబంధు ఎగ్గొట్టే యత్నం

'వ్యవసాయం విషయంలో మాకు స్పష్టమైన అవగాహన ఉండే. రాష్ట్రంలో వ్యవసాయ స్థిరీకరణ జరగాలని, మేం రెండు పంటలకు రైతుబంధు ఇచ్చాం. వీళ్లేమో ఎగ్గొడుతామని చెప్తున్నారు. రైతులకు ఇచ్చిన డబ్బును పాడు చేసినం, వెదజల్లినం, దుర్వినియోగం చేసినం అనే పద్ధతిలో దురదృష్టకరమైన వ్యాఖ్యలు చేస్తున్నారు' అని కేసీఆర్ మండిపడ్డారు. ఈ ప్రభుత్వం తన చర్యల ద్వారా తమది పూర్తిగా రైతు శత్రువు ప్రభుత్వం అని చెప్పున్నరు.. 'ధాన్యం కొనుగోలు చేయలేదు. విద్యుత్తు సరఫరా చేయడం లేదు. నీళ్లు సరఫరా చేయడం లేదు. రైతులను చాలా ఇబ్బందులు పెడుతున్నారు. ఇంకా రైతుబంధు, రైతుభరోసా ప్రస్తావనే లేదు. రైతుభరోసా ఎప్పుడు వేస్తారని మా ఎమ్మెల్యేలు అడిగితే కనీసం సమాధానం చెప్పడం లేదు. రైతులను ఈ ప్రభుత్వం వంచించింది. వృత్తి కార్మికులను వంచించింది' అని ఆవేదన వ్యక్తం చేశారు.

కథ చెప్పినట్టు ఉంది కానీ..

ఇండస్ట్రియల్ పాలసీ ఏమిటి? ఏం లేదు వట్టిదే గ్యాస్.. ట్రాష్. ఇదేదో స్టోరీ టెల్లింగ్‌లాగా ఉంది తప్ప బడ్జెట్ లాగా లేదని కేసీఆర్ పేర్కొన్నారు. 'రాష్ట్రంలో వ్యవసాయ పాలసీ ఏమిటి? పారిశ్రామిక పాలసీ ఏమిటి? ఐటీ పాలసీ ఏమిటి? ఇంకా ఇతర అనేక పాలసీలు.. పేద వర్గాలకు సంబంధించిన పాలసీ ఏమిటి? అనే ఏ ఒక్క దాని మీద కూడా స్పష్టత లేదు. అంత వట్టిదే గ్యాస్, ట్రాష్, చిల్లరమల్లర ప్లాట్‌ఫామ్స్ స్పీచ్‌లాగా ఉన్నది తప్ప బడ్జెట్ ప్రసంగంలా లేదు. రాజకీయ సభల్లో చెప్పినట్టుగా ఉంది తప్ప ఏ ఒక్క పాలసీని కూడా నిర్దిష్టంగా ఈ పనిని మేం ఇలా సాధిస్తాం.. మా గోల్స్, టార్గెట్స్ ఇవి అనే పద్ధతి కానీ, పద్దు కానీ లేదు. ఇది పేదల బడ్జెట్ కాదు. రైతుల బడ్జెట్ కాదు. ఎవరి బడ్జెటో విశ్లేషణలో తెలుస్తది. భవిష్యత్తులో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలి పెట్టం. చీల్చి చెండాడుతాం' అని కేసీఆర్ హెచ్చరించారు.



శాసనసభ సమావేశాలకు హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అసెంబ్లీ కార్యదర్శి నర్సింహాచార్యులు

బడ్జెట్ పద్దులో లక్కీనంబర్ 9!

- సీఎం రేవంత్ అదృష్ట సంఖ్య వచ్చేలా పద్దు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డి అదృష్ట సంఖ్య '9'ని బడ్జెట్ పద్దులో కూడా వదిలిపెట్టలేదా? అంటే అవుననే అంటున్నాయి సోషల్ మీడియా వర్గాలు. రూ.2,91,159 కోట్లతో ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఈ అంకెలన్నీ కలిపితే చివరికి 9 సంఖ్య వస్తున్నదంటూ విశ్లేషిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 9 నంబర్ వచ్చేలా జాగ్రత్త పడుతున్న సంగతి తెలిసిందే. తన కాన్వాయ్‌లో వాహనాలన్నింటికీ 9 సంఖ్యనే వాడుతున్నారు. సచివాలయంలోని తన కార్యాలయాన్ని ఆరో అంతస్తు నుంచి 9వ అంతస్తుకు మార్చేందుకు ప్రయత్నించారన్న విమర్శలు ఉన్నాయి. ఇదే తరహాలో ఇప్పుడు బడ్జెట్ పద్దును కూడా అంకెలను కలిపితే 9 వచ్చేలా జాగ్రత్త పడ్డారంటూ సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. గతంలో సీఎం కేసీఆర్ 6 నంబర్‌ను అదృష్ట సంఖ్యగా భావిస్తే మూఢనమ్మకాలంటూ విమర్శించిన కాంగ్రెస్.. ఇప్పుడు ఎలా సమర్థించుకుంటుందంటూ ప్రశ్నిస్తున్నారు.



శాఖల వారీగా బడ్జెట్ కేటాయింపులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో ఆయా శాఖలకు జరిపిన కేటాయింపులు ఈ విధంగా ఉన్నాయి..

శాఖ	బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)		
	2023-24	2024-25	తేడా
ఎస్సీ సంక్షేమం	21.072	7.638	-13.434
గిరిజన సంక్షేమం	4.365	3.969	-396
బీసీ సంక్షేమం	6.229	9.200	+2.971
మహిళా శిశు సంక్షేమం	2.131	2.736	+605
మైనార్టీ సంక్షేమం	2.200	3.003	+803
నీటిపారుదల	26.885	22.301	-4.584
గృహనిర్మాణం	13.428	9.184	-4.244
పరిశ్రమలు	4.037	2.762	-1.275
వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమం	12.161	11.468	-693
పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి	30.976	29.816	-11.60
పురపాలన, పట్టణాభివృద్ధి	11.372	15.594	+4.222
ఆర్థిక శాఖ	49.749	47.713	-2.036
ప్లానింగ్	11.495	3.783	-7.712
రెవెన్యూ	3.560	2.106	-1.454
వ్యవసాయం, సహకార	26.831	49.383	+22.552
పశుసంవర్ధక, మత్స్య	2.071	1.980	-91
ఆహార, పౌరసరఫరాలు	3.117	3.836	+719
ఇంధన రంగం	12.727	16.410	+3.683
ఉన్నత విద్య	3.001	3.350	+349
మాధ్యమిక విద్య	16.092	17.942	+1.853
హోం శాఖ	9.599	9.564	-35
రవాణా	1.644	4.206	+2.562
పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ	1.471	1.064	-407
సాధారణ పరిపాలన	1.491	1.134	-357
ఐటీ, కమ్యూనికేషన్స్	366	774	+408
న్యాయ శాఖ	1.665	2.306	+641
శాసన వ్యవహారాలు	168	220	+52
కార్మిక, ఉపాధి కల్పన	542	882	+340
రోడ్లు, భవనాలు	8.833	5.790	-3.043
యువజన సేవలు, టూరిజం	1.117	1.046	-71
మొత్తం	2.90.396	2.91.159	+763

రెండు గంటలూ పరనిందకే!

బీఆర్ఎస్‌పై విమర్శలకే భట్టి ప్రాధాన్యం

2024-25 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన మంత్రి భట్టివిక్రమార్క

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ బడ్జెట్‌లో గత పాలనను నిందించడానికే ఆర్థికమంత్రి ఎక్కువ సమయం కేటాయించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి గురువారం మ.12గంటలకు శాసనసభలో 2024-25 పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అంతకు ముందు ఆయన శాసనసభ, శాసనమండలి స్పీకర్లకు, ముఖ్యమంత్రికి బడ్జెట్ ప్రతులు అందించారు. 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి మాటలతో బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించిన మంత్రి.. గాంధీ, నెల్సన్ మండేలా, నెహ్రూ తదితరుల సూక్తులను ఉటంకించారు. సోనియాగాంధీ ఆశీస్సులతో కాంగ్రెస్ ప్రభుత్వ తొలి పూర్తి స్థాయి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు.

ప్రముఖుల వ్యాఖ్యలను ఉటంకిస్తూ

'ఏదైనా పని జరిగేవరకు అది అసాధ్యంగా గోచరిస్తుంది' అన్న నెల్సన్‌మండేలా వ్యాఖ్యలను ఉటంకిస్తూ.. ఈ మాటలు తమ ప్రభుత్వ రుణమాఫీ హామీకి అక్షరాలా వర్తిస్తాయన్నారు. 'మహిళలు సాధించిన ప్రగతి, ఆ సమాజ ప్రగతికి కొలమానంగా నేను భావిస్తాను' అని అంబేద్కర్ చెప్పిన మాటలు ప్రస్తావిస్తూ, తెలంగాణ ప్రభుత్వం 63 లక్షలమంది మహిళలను వ్యాపార, పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే ధ్యేయంతో 'ఇందిరా మహిళా శక్తి' పథకానికి రూపకల్పన చేసినట్టు తెలిపారు. 70 పేజీలున్న బడ్జెట్ ప్రసంగం సుమారు రెండు గంటలపాటు సాగింది. ఆయా శాఖల కేటాయింపులను చెప్తూ, గత ప్రభుత్వ వైఫల్యం చెందితే తాము సరిచేస్తున్నట్టు మంత్రి భట్టి పేర్కొన్నారు. దీంతో ఆయన చెప్తున్న విషయాలు అసత్యాలంటూ బీఆర్ఎస్ సభ్యులు నిరసన తెలిపారు. ఒక సందర్భంలో బీఆర్ఎస్ సభ్యులు అడ్డుపడితే, కేసీఆర్ వారివైపు చేయిచూపుతూ వారించారు. చివరగా 'మనం చేసే పనులకు, చేయగలిగే సామర్థ్యానికి ఉన్న అంతరం ప్రపంచంలోని సమస్యలన్నింటినీ పరిష్కరించడానికి సరిపోతుంది' అన్న మహాత్మాగాంధీ మాటలను ఉటంకిస్తూ, ఈ స్ఫూర్తితోనే తమ ప్రభుత్వం పనిచేస్తుందని భట్టి తన ప్రసంగాన్ని ముగించారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీలు మహేశ్‌కుమార్‌గౌడ్, బల్మూరి వెంకట్, ఫైనాన్స్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ సుల్తానియా, కృష్ణభాస్కర్, హరిత తదితరులు పాల్గొన్నారు. శాసన మండలిలో బడ్జెట్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు.



తగ్గిన చదువు లెక్క!

7.3% కేటాయింపులతోనే సరి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో విద్యాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి ఇచ్చింది. రాష్ట్ర బడ్జెట్‌లో కేవలం 7.3 శాతం నిధులే కేటాయించి నిరుత్సాహపరిచింది. రాష్ట్ర మొత్తం బడ్జెట్ 2,91,159 కోట్లు కాగా, విద్య కోసం రూ.21,281 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది. పాఠశాల విద్యకు రూ.17,930 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అందులో ప్రగతి పద్దు కోసం కేవలం రూ.3,001 కోట్లు చూపించారు. పాఠశాల విద్యాశాఖలో బోధన, బోధనేతర సిబ్బంది కోసం రూ.14,930 కోట్లు కేటాయించినట్టు పేర్కొన్నారు. మొత్తం నిధుల్లో జీతభత్యాలు రోజువారీ ఖర్చులు తదితరాల కోసం రూ.17,648 కోట్లు కేటాయించగా, స్కూళ్లు, కాలేజీలు, యూనివర్సిటీల అభివృద్ధి, మౌలిక సదుపాయాల వంటి వాటి కోసం కేవలం రూ.3,632 కోట్లు కేటాయించారు. కేసీఆర్ హయాంలో విద్య కోసం మొత్తం బడ్జెట్‌లో 10 శాతానికి పైగా నిధులు కేటాయించిన సందర్భాలు ఉన్నాయి. సాంకేతిక విద్యకు బడ్జెట్ కేటాయింపు పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. జీతభత్యాలు వంటి కోసం నిర్వహణ పద్దు కింద రూ.476 కోట్లు కేటాయించగా అభివృద్ధి కోసం నిధుల కేటాయింపులే లేవు. వివిధ అభివృద్ధి పనుల కోసం కేవలం రూ.14 కోట్లతో సరిపెట్టారు.

యూనివర్సిటీలకు అరకొర నిధులు

రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో అరకొర నిధులే కేటాయించింది. ఉస్మానియా యూనివర్సిటీకి కేవలం రూ.492 కోట్ల నిధులనే కేటాయించింది. కాకతీయ యూనివర్సిటీకి వేతనాలు, గ్రాంట్ల కోసం రూ.134 కోట్లను బడ్జెట్‌లో ప్రతిపాదించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ వర్సిటీకి రూ.17 కోట్లు, పొట్టి శ్రీరాములు వర్సిటీకి రూ.43 కోట్లు, తెలంగాణ వర్సిటీకి రూ.42 కోట్లు, మహాత్మాగాంధీ వర్సిటీకి రూ.30 కోట్లు, శాతవాహన వర్సిటీకి రూ.14 కోట్లు, పాలమూరు వర్సిటీకి రూ.11 కోట్ల చొప్పున మొత్తం రూ.787 కోట్ల నిధులను కేటాయించారు. సాంకేతిక యూనివర్సిటీలైన జేఎన్టీయూకు రూ.52 కోట్లు, ఆర్జీయూకేటీ వర్సిటీకి రూ.35 కోట్లు, జేఎన్టీయూ ఎఫ్ఏకి రూ.28.75 కోట్లు కలిపి మొత్తం రూ.133 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రతిపాదించింది.

కోతలు.. కొట్టివేతలు.. ఎగవేతలు

- రాష్ట్రానికి దిశానిర్దేశం చేయలేని విధంగా బడ్జెట్
- ప్రాధాన్య రంగాలకు నిధుల్లో భారీగా కోత
- కార్పొరేషన్లకు నిధులు అంతంత మాత్రమే
- సంక్షేమ పథకాలకు పాతరేసిన ప్రభుత్వం
- రాజకీయ కారణాలతో కేసీఆర్ పథకాలకు బ్రేక్
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు ఎగవేత
- అత్యంత కీలక హామీలను విస్మరించిన ప్రభుత్వం



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర అభివృద్ధికి బడ్జెట్ ఒక దిక్సూచి. ప్రభుత్వ లక్ష్యాలకు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు ప్రతిబింబం. కానీ, రాష్ట్ర ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ దశదిశ లేకుండా సాగింది. రూ.2,91,159 కోట్లతో ఆర్థికశాఖమంత్రి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఇది గత బడ్జెట్ కన్నా రూ.753 కోట్లు మాత్రమే ఎక్కువ. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ప్రకటించుకున్న ప్రాధాన్య రంగాలకు కూడా ఈ బడ్జెట్ దిశానిర్దేశం చేయలేకపోయింది. అత్యుక్తి, పరనిందలతో అప్రస్తుతంగా సాగిన బడ్జెట్ ప్రసంగం మాదిరిగానే, కేటాయింపులు సైతం ఉన్నాయి. అనేక రంగాలకు నిధుల్లో కోతలు విధించగా, కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు పథకాల ఊసే ఎత్తలేదు. రాజకీయ కారణాలతో దళితబంధు వంటి విప్లవాత్మక పథకాన్నే పక్కన పడేసింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా ఎగవేసింది. ఆరు గ్యారెంటీల కింద ఇచ్చిన 13 హామీలను వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఏడు నెలలు గడిచిన తర్వాత కూడా ఐదింటిని మాత్రమే అమలు చేస్తుండగా, మరో ఐదింటిని అమలు చేస్తామని హామీ ఇచ్చింది. నిరుద్యోగులకు ఇచ్చిన గ్యారెంటీని పూర్తిగా తుంగలో తొక్కింది. ఎన్నికల వేళ ఇచ్చిన 420 హామీల అమలుకు ఎగనామం పెట్టింది. ఒక్క వ్యవసాయ రంగానికి మాత్రం నిధులు ఎక్కువగా కేటాయించింది.

'సంక్షేమం'పై చిన్నచూపు

తెలంగాణ రాష్ట్రం అంటేనే సంక్షేమానికి పెట్టింది పేరు. ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించింది మొదలు వినూత్న పథకాలతో ప్రత్యేక గుర్తింపును సాధించింది. 'సంపద పెంచు.. పేదలకు పంచు' అనే నినాదాన్ని అనుసరిస్తూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పెరిగిన కొద్దీ పేదలు, బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఏటికేడు బడ్జెట్ కేటాయింపులు పెరిగింది. కానీ, తొలిసారిగా రాష్ట్ర బడ్జెట్‌లో సంక్షేమ పద్దుకు నిధులు తగ్గిపోయాయి. నిరుడు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి మొత్తంగా రూ.55,021.73 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.53,559.78 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే, రూ.1461.95 కోట్లు కోత విధించారు. బీసీలకు సంబంధించి ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు బడ్జెట్‌లో రూ.50 కోట్ల చొప్పున మాత్రమే ప్రభుత్వం కేటాయించింది. ఎస్సీ కార్పొరేషన్‌ను మాదిగ, మాల కార్పొరేషన్లుగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అయినప్పటికీ ప్రస్తుత బడ్జెట్‌లో మాల కార్పొరేషన్ ఊసెత్తలేదు.

అప్పు.. రూ.12వేల కోట్లు ఎక్కువే

'బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లలో రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది'.. ఎన్నికల వేళ, అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పదే పదే చేస్తున్న ప్రచారం ఇది. సీఎం రేవంత్‌రెడ్డి సందర్భం వచ్చిన ప్రతిసారి 'కనుపుకట్టుకొని అయినా ప్రతినెల ఒకటో తేదీన కిస్తీలు కడుతున్నాం' అంటూ ఊదరగొడుతున్నారు. డిప్యూటీ సీఎం, ఆర్థికశాఖ మంత్రి భట్టివిక్రమార్క అయితే అప్పుల భారాన్ని తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్తున్నారు. కానీ, బడ్జెట్ ప్రతిపాదనల్లో మాత్రం పూర్తి భిన్నంగా వ్యవహరించారు. నిరుటి కన్నా ఈసారి ఒక రూపాయి ఎక్కువే అప్పు చేస్తున్నట్టు స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోనే రూ.35,118 కోట్లు అప్పు చేసినట్టు స్వయంగా బడ్జెట్ ప్రసంగంలో భట్టి వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో బహిరంగ మార్కెట్ నుంచి ఏకంగా రూ.57,112 కోట్లు రుణాలు సేకరించనున్నట్టు బడ్జెట్‌లో ప్రస్తావించారు. ఇది నిరుడు తీసుకున్న అప్పుల కన్నా రూ.7,494 కోట్లు ఎక్కువ. గతంలో అన్ని రకాల మార్గాల్లో ప్రభుత్వం తీసుకున్న అప్పుల కన్నా ఈ ఏడాది ఏకంగా రూ.12,661 కోట్లు ఎక్కువగా అప్పులు చేయనున్నట్టు ప్రభుత్వం స్పష్టం చేసింది.

ముఖ్యంగా ఎస్సీ సంక్షేమానికి ఏకంగా రూ.13,434 కోట్ల కోత విధించింది. ప్లానింగ్ విభాగంలో రూ.7,712 కోట్లు కోత పెట్టగా, నీటిపారుదల, గృహనిర్మాణ రంగాలకు తలా రూ.4 వేల కోట్లకుపైగా కోతలు పెట్టారు. ఆర్‌అండ్‌బీ శాఖకు రూ.3 వేల కోట్లు తక్కువ కేటాయింపులు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అన్నీ కలుపుకొని దాదాపు 1047 గురుకులాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు, వసతుల కల్పన, భవనాల నిర్మాణాలకు మాత్రం బడ్జెట్‌లో ఆశించిన స్థాయిలో ప్రభుత్వం నిధులను కేటాయించలేదు. ప్రీ మెట్రిక్, పోస్ట్‌మెట్రిక్ సంక్షేమ హాస్టళ్లకు సైతం అదే తరహాలోనే బడ్జెట్‌లో అరకొరగా నిధులను కేటాయించింది.

కేసీఆర్ పథకాలకు బ్రేక్

కేసీఆర్ పేరుమీద తుపాకీ పెట్టి రేవంత్ సర్కార్ ప్రజాసంక్షేమాన్ని కాల్చి పారేసింది. దేశవ్యాప్తంగా తెలంగాణ ప్రతిష్ఠను పెంచిన మానవీయ పథకాలకు నిర్దాక్షిణ్యంగా నిధులు కోసిపారేసింది. కడుపులో నలుసు పడ్డప్పటి నుంచి కన్నతండ్రిలా ఆడబిడ్డలకు అండగా ఉండేందుకు కేసీఆర్ సర్కార్ అమలు 'కేసీఆర్ కిట్'ను రేవంత్ సర్కార్ ఎత్తగొట్టింది. ఆడబిడ్డ పుడితే రూ. 13వేలు, మగబిడ్డారు పుడితే రూ. 12వేలతోపాటు అందించే ఈ పథకాన్ని ప్రభుత్వం నిలిపివేసింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి కేసీఆర్ ప్రభుత్వం దాదాపు రూ. 440 కోట్లు ఈ పథకానికి కేటాయించింది. 2024-25 బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ. 165 కోట్లను ప్రతిపాదించారు. ఈ మొత్తం చెల్లించాల్సినవే తప్ప ఈ పథకానికి కేటాయించినవి కాదని బడ్జెట్ పద్దులను చూస్తే స్పష్టం అవుతున్నది.

కొండంత హామీలు.. పిడికెడు అమలు

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ హామీల వరద పారించింది. డిక్లరేషన్లు, గ్యారెంటీలు, మ్యానిఫెస్టో పేరుతో ఇలా 420 హామీలు ఇచ్చింది. ముఖ్యంగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని గప్పాలు కొట్టింది. వాటిలో మొత్తం 13 హామీలు ఇచ్చింది. కానీ ఇప్పటివరకు ఇందులో అమలు చేసింది కేవలం నాలుగింటినే. రూ. 500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ప్రతి కుటుంబానికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపును అమలు చేస్తున్నది. మిగతావాటిలో రైతు భరోసా, కూలీలకు భరోసా, వరి పంటకు బోనస్, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని అమలు చేసేందుకు నిధులు కేటాయించింది. మహిళలకు ప్రతి నెల రూ. 2500, ఉద్యమకారులకు ఇంటి స్థలం, విద్యాభరోసా కార్డు, పెన్షన్ల పెంపు వంటివాటిని విస్మరించింది. మిగతా హామీల్లో అమలయ్యే వాటి కోసం బూతద్దం వేసి వెతకాల్సిన పరిస్థితి. నిరుద్యోగులకు నిరుద్యోగభృతి, ఆటో కార్మికులకు ఏటా ఆర్థిక సాయం వంటి తక్షణ అవసరాలను కూడా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇక విదేశాల్లో విద్యనభ్యసించేందుకు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్, బీసీ ఓవర్సీస్, అంబేద్కర్ ఓవర్సీస్ పథకాల కింద రూ.20 లక్షల ఆర్థిక సాయాన్ని అందిస్తున్న విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన నిధులను పెంచుతామని, ఎక్కువ మంది విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కానీ, ప్రస్తుత బడ్జెట్‌లో గతేడాది లెక్కలనే వల్లె వేసింది. అంటే.. పెంచుతామన్న మాటను గాలికి వదిలేసింది. బడుగు బలహీనవర్గాలకు సంబంధించి పీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు సంబంధించి బడ్జెట్‌లో సరిపడా నిధులను కేటాయించలేదు. దాదాపు రూ.7 వేల కోట్ల బకాయిలు ఉండగా, అందులో సగం నిధులను కూడా బడ్జెట్‌లో పొందుపరచకపోవడం గమనార్హం. వివిధ శాఖలకు చేసిన కేటాయింపులను పరిశీలిస్తే బడ్జెట్ మొత్తం గత బడ్జెట్ పద్దులకు ఒకటి, అరా కలిపి తయారు చేసినట్టుగా కనిపిస్తున్నది తప్ప, ప్రభుత్వం ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, వాటికి అనుగుణంగా తయారుచేసినట్టుగా లేకపోవడం గమనార్హం.

రేవంత్ సర్కారు నిలిపేసిన పథకాలు

'బంధు'లు బంద్

కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు, బీసీబంధు, మైనారిటీబంధు పథకాలను నిలిపివేస్తున్నట్టు వెల్లడించకపోయినా బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు.

గొర్రెల పంపిణీ పథకం అవుట్

కేసీఆర్ కులవృత్తులకు అత్యంత ప్రోత్సాహం అందించారు. గొల్లకుర్మ సమాజానికి 75 శాతం సబ్సిడీతో గొర్రెల పెంపకం పథకాన్ని అమలు చేశారు. ఆ పథకాన్ని రేవంత్ సర్కార్ నిలిపివేసింది.

'ప్రగతి'కి బ్రేక్

పట్టణ ప్రగతి, పల్లెప్రగతి పథకాలు తెలంగాణ సర్కార్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగాయి. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి పథకాలు ప్రారంభమైనప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అవార్డులన్నీ రాష్ట్రానికే వచ్చాయి. అటువంటి పథకాలకు రేవంత్ సర్కార్ నిధులను నిలిపివేసింది.

అడవికి చీకటి

మారుమూల ప్రాంతాల్లో త్రీఫేజ్ కరెంట్ కోసం బడ్జెట్‌లో సర్కార్ నిధులకు కోత విధించింది. కేసీఆర్ సర్కార్ త్రీఫేజ్ కరెంట్ కోసం బడ్జెట్‌లో రూ. 60 కోట్లు కేటాయిస్తే రేవంత్ సర్కార్ ఇందుకోసం రూ. 12.25 కోట్లు మాత్రమే కేటాయించింది. అలాగే గిరిజన ప్రాంతాల్లో భూఅభివృద్ధి కోసం కేసీఆర్ రూ.150 కోట్లు కేటాయిస్తే రేవంత్ సర్కార్ కేటాయించింది కేవలం రూ. 37.50 కోట్లే. అలాగే తండాల్లో బీటీ రోడ్ల కోసం కేసీఆర్ సర్కార్ రూ. 252 కోట్లు కేటాయిస్తే తాజా బడ్జెట్‌లో అందుకోసం 150 కోట్లనే ప్రతిపాదించారు. గిరిజనులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో కేసీఆర్ సర్కార్ సీఎంఎస్‌టీఈఐ పథకాన్ని (చీఫ్ మినిస్టర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఎంట్రప్రెన్యూర్‌షిప్) ప్రారంభించారు. కేసీఆర్ సర్కార్ ఈ పథకానికి రూ. 50 కోట్లు కేటాయిస్తే ఈ బడ్జెట్‌లో రూ. 12.5 కోట్లను మాత్రమే కేటాయించారు. ఈ మొత్తం గత లబ్ధిదారులకు అందించాల్సిన సబ్సిడీ మాత్రమేనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



రాష్ట్ర బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొండి చేయి చూపింది. గల్ఫ్ సంక్షేమానికి నిధులు, ప్రత్యేక ప్యాకేజీని కేటాయిస్తామని మ్యానిఫెస్టోలో చెప్పి, బడ్జెట్‌లో గుండు సున్నా ఇచ్చారు. గల్ఫ్ కార్మికులను కేసీఆర్ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెబుతారు.

- ఎన్నారై బీఆర్ఎస్ శాఖ అధ్యక్షులు రాధారపు సతీశ్ కుమార్

ఐటీ శాఖకు కేటాయించిన నిధులు **750 కోట్లు**

పదేండ్ల ప్రగతి చిత్రం.. ...ఆర్థిక సర్వే లెక్కలే సాక్ష్యం!

2023-24లో రాష్ట్ర తలసరి రూ.3,47,299

దేశ తలసరి కంటే మన తలసరి 90% ఎక్కువ



జిల్లాలు: 33, మండలాలు: 620

గ్రామపంచాయతీలు: 12,769



2014-15లో తెలంగాణ జీఎస్డీపీ (ప్రస్తుత ధరల్లో) **5.05** లక్షల కోట్లు

2023-24లో జీఎస్డీపీ **14.64** లక్షల కోట్లు

జీఎస్డీపీ వృద్ధిరేటు **11.9%** (జాతీయ వృద్ధి రేటు కంటే 2.8 శాతం ఎక్కువ)

తెలంగాణ జీఎస్డీపీలో **65.7%** వాటా సర్వీసు సెక్టారుదే.



తలసరి, జీఎస్డీపీలో రాకెట్ వేగంతో తెలంగాణ

దేశ తలసరిని మించిపోయిన 30 జిల్లాల తలసరి

పదేండ్లలో 9.59 లక్షల కోట్లు పెరిగిన జీఎస్డీపీ

సామాజిక, ఆర్థిక నివేదిక - 2024లో సుస్పష్టం

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఏ దేశమైనా, రాష్ట్రమైనా అభివృద్ధి చెందిందని చెప్పేందుకు అక్కడి పౌరుల తలసరి ఆదాయాన్ని, ఉత్పాదకతను ప్రామాణికంగా తీసుకొంటారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గడిచిన పదేండ్లలో తెలంగాణ ఈ రెండు అంశాల్లో రాకెట్ వేగంతో దూసుకుపోయింది. ఒక్క తలసరి, జీఎస్డీపీలోనే కాదు.. సాగు, పారిశ్రామికీకరణ, సేవలు, సంక్షేమం.. ఇలా అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించింది. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన తెలంగాణ సామాజిక, ఆర్థిక నివేదిక (సోషియో ఎకనామిక్ ఔట్‌లుక్)-2024 వివిధ రంగాల్లో తెలంగాణ సాగించిన ప్రగతిని, తాజా పరిస్థితులను వెల్లడించింది.

తలసరిలో మేటి.. మరెవరు సాటి

తలసరి ఆదాయాన్ని, దాని వృద్ధిరేటును ఆ దేశ లేదా రాష్ట్ర అభివృద్ధి వేగానికి నిదర్శనంగా భావిస్తారు. ఈ రెండు అంశాల్లో జాతీయ తలసరి ఆదాయంతో పోల్చితే.. తెలంగాణ ఎంతో ఎత్తులో ఉన్నది. కేసీఆర్‌హయాంలో గడిచిన పదేండ్లలో చేపట్టిన సంస్కరణలే దీనికి కారణంగా చెప్పొచ్చు. తెలంగాణ ఏర్పడినప్పుడు 2014-15లో ప్రస్తుత ధరల వద్ద రాష్ట్ర తలసరి ఆదాయం రూ.1,24,105గా నమోదైంది. అప్పుడు జాతీయ తలసరి ఆదాయం రూ.86,647గా ఉండేది. ఈ లెక్కన చూసుకొంటే జాతీయ తలసరి ఆదాయం కన్నా తెలంగాణ ఆదాయం 43 శాతం ఎక్కువగా ఉన్నది. 2022-23 సంవత్సరానికి వచ్చేసరికి ఈ అంతరం మరింతగా పెరిగిపోయింది. 2023-24నాటికి తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,47,299కు చేరుకున్నది. జాతీయ తలసరి ఆదాయం మాత్రం రూ.1,83,236 కే పరిమితం అయ్యింది. అంటే రాష్ట్ర తలసరి ఆదాయం..దేశ తలసరి ఆదాయం కంటే 89.53 శాతం ఎక్కువగా నమోదైంది. అంతేకాదు.. దేశ తలసరి ఆదాయం కంటే, రాష్ట్రంలోని 30 జిల్లాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉండటం గమనార్హం. ఈ మేరకు సామాజిక ఆర్థిక సర్వే 2024 వెల్లడించింది.

జీఎస్డీపీలో దూకుడు

తెలంగాణ ఆవిర్భావం జరిగినప్పుడు 2014-15లో ప్రస్తుత ధరలను బట్టి రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్డీపీ) రూ. 5.05 లక్షల కోట్లుగా నమోదైంది. అయితే, 2023-24నాటికి తెలంగాణ జీఎస్డీపీ రూ. 14.64 లక్షల కోట్లకు చేరింది. పదేండ్ల వ్యవధిలో తెలంగాణ జీఎస్డీపీ రూ. 9.59 లక్షల కోట్ల మేర పెరిగింది. జీఎస్డీపీలో సేవారంగం 65.7 శాతంతో అగ్రస్థానంలో కొనసాగుతున్నది. మైనింగ్, తయారీ రంగం 18.5%, వ్యవసాయం, అనుబంధ రంగాలు 15.8% వాటాను కలిగి ఉన్నాయి. రాష్ట్రంలోని మొత్తం శ్రామిక శక్తిలో 47.34% మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలమీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. 2022-23లో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం 414 లక్షల మెట్రిక్ టన్నులుగా రికార్డయ్యింది. వరి, పత్తి, మొక్కజొన్న ఇందులో ప్రధాన పంటగా ఉన్నది. ఇక, రాష్ట్రం మొత్తం విస్తీర్ణంలో 24% మేర అటవీ ప్రాంతమే ఉన్నది. జాతీయ సగటు 21.34 శాతంతో పోలిస్తే, ఇది ఎక్కువ. ఈ మేరకు సామాజిక ఆర్థిక సర్వే 2024 వివరించింది.



పదేండ్ల ప్రగతి ఫలమిది..

ఎవుసం పండుగ

- మొత్తం శ్రామిక శక్తిలో 47.34 శాతం మంది వ్యవసాయం, దాని అనుబంధ రంగాలమీదనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు.
- రాష్ట్ర జీఎస్‌వీఏలో వ్యవసాయరంగం వాటా రూ. 2,11,422 కోట్లు.
- 2022-23తో పోలిస్తే ఇది 4 శాతం ఎక్కువ
- 2022-23లో వ్యవసాయ ఉత్పత్తులు మొత్తం 414 లక్షల మెట్రిక్ టన్నులుగా రికార్డయ్యింది. వరి, పత్తి, మొక్కజొన్న ఇందులో ప్రధాన పంటగా ఉన్నది.



2014-15లో తలసరి ఆదాయం **రూ. 1,24,105**

2023-24లో తలసరి ఆదాయం **రూ. 3,47,299**

జీవ వైవిధ్యానికి పెన్నిధి

- మొక్కల జాతులు – 2,939
- పక్షి జాతులు – 365
- క్షీరద జాతులు – 103
- సరీసృప జాతులు – 28

పచ్చని తెలంగాణ

- మొత్తం విస్తీర్ణంలో 24 శాతం మేర అటవీప్రాంతమే. దీని విస్తీర్ణం 26,969 చదరపు కిలోమీటర్లు.
- జాతీయ సగటు 21.34 శాతంతో పోలిస్తే, ఇది ఎక్కువ

సంక్షేమం

- 2023-24లో ఎస్సీల సంక్షేమానికి రూ.14,648.94 కోట్లు. ఎస్టీల సంక్షేమానికి రూ. 10,398.96 కోట్లు ఖర్చు.
- 2023-24లో కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ (షాదీ ముబారక్) కుటుంబాలకు రూ.1,664.82 కోట్లు సాయం.
- 2023-24లో ప్రీ-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 505.26 కోట్లు. పోస్ట్-మెట్రిక్ స్కాలర్‌షిప్స్ కోసం రూ. 1,42,785 కోట్లు ఖర్చు.



ప్రగతిని కూడా దాచాలని..

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క తలసరి, జీఎస్డీపీలో వృద్ధే కాదు... సాగు విస్తీర్ణం కూడా ఎంతో పెరిగింది. ధాన్యం దిగుబడి కొత్త రికార్డులను నమోదు చేసింది. అంతే కాదు.. విద్యుత్తు సంస్థల బలోపేతం, స్థాపిత విద్యుత్తు సామర్థ్యంలో పెరుగుదల, విద్య-వైద్య రంగాల అభివృద్ధి, రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం, వైద్య కళాశాలల ఏర్పాటు, మౌలిక వసతుల కల్పన, అన్నివర్గాల అభ్యున్నతికి 400కు పైగా చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు ఇలా చెప్పుకొంటూ పోతే ఆ జాబితా ఎంతో పెద్దది. అయితే, ఆర్థిక సర్వేలో ఆ అంశాలను, లెక్కలను ప్రస్తావించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం దాలా ప్రయాస పడింది. గతంలో జరిగిన ప్రగతిని విస్మరించి.. తాము చేపట్టబోయే పనుల గురించి మాత్రమే ఏకరువు పెట్టింది. అంతేకాదు నిజాలను కూడా దాచిపెట్టింది. దాదాపు ప్రతీ రంగంలో పదేండ్లలో తెలంగాణ సాగించిన ప్రగతిని విస్మరించడానికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. ఆర్థిక సర్వేలో అడుగడుగునా ఈ విషయం స్పష్టమైంది.

తగ్గిన మూలధన వ్యయం

- రెవెన్యూ వ్యయంలో ఏదోవంతు మాత్రమే
- నిరుటి కన్నా రూ.10 వేల కోట్లు తగ్గింపు
- ఈ నిధులతో అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా?

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మూలధన వ్యయాన్ని భారీగా తగ్గించింది. ఇందుకు బడ్జెట్‌లో రూ.33,486 కోట్లను కేటాయించింది. ఈ నిధులతో రాష్ట్ర అభివృద్ధి, ఆస్తుల కల్పన ఎలా సాధ్యమన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే సమయంలో రెవెన్యూ వ్యయం రూ.2,21,242 కోట్లుగా చూపింది. అంటే నిర్వహణకు చేస్తున్న వ్యయంతో పోల్చితే అభివృద్ధి కోసం చేస్తున్న ఖర్చు కేవలం ఏడో వంతు మాత్రమే. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లపాటు మూల ధన వ్యయంపై ప్రత్యేక దృష్టిసారించింది. ఏటా కేటాయింపులను పెంచింది. పైగా.. అదనంగా ఖర్చుచేసింది కూడా. ఉదాహరణకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మూల ధన వ్యయానికి రూ.37,524 కోట్లు కేటాయించింది. అంచనాలకు మించి రూ.44,252 కోట్లు ఖర్చు చేసింది. రూ.6,728 కోట్ల మేర అదనపు నిధులను మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆస్తుల కల్పన కోసం వెచ్చించింది. కానీ ఈసారి రాష్ట్ర ప్రభుత్వ కేటాయింపులు నిరుటి వ్యయంతో పోల్చితే సుమారు రూ.10,766 కోట్లు తక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మౌలిక సదుపాయాల అభివృద్ధి అనుకున్న స్థాయిలో జరుగక.. కుంటుపడుతుందన్న విమర్శలు మొదలయ్యాయి.

రెవెన్యూ రాబడి	
రాష్ట్ర పన్నులు	1,38,181.26 కోట్లు
కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా	26,216.38 కోట్లు
ఇతర పన్ను ఆదాయం	56,131.80 కోట్లు
మిత్తీల ద్వారా ఆదాయం	712.79 కోట్లు
రుణాలు	62,112.48 కోట్లు
లోన్ రికవరీలు	3,560 కోట్లు
పబ్లిక్ అకౌంట్ (నెట్)	4,000 కోట్లు
మొత్తం	2,90,914.71 కోట్లు

రెవెన్యూ వ్యయం	
నిర్వహణ వ్యయం	2,20,944.81 కోట్లు
మూలధన వ్యయం	33,486.50 కోట్లు
ప్రజా రుణాల చెల్లింపు	17,101.37 కోట్లు
లోన్లు, అడ్వాన్సుల చెల్లింపు	19,626.32 కోట్లు
మొత్తం	2,91,159 కోట్లు
లోటు	244.29 కోట్లు



నిరుద్యోగ భృతి అమలు హుళక్కే!

బడ్జెట్‌లో ఒక్క రూపాయి కేటాయించని సర్కారు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని నిరుద్యోగులను కాంగ్రెస్ సర్కారు దగా చేసింది. గత ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసింది. కాంగ్రెస్ ఎన్నికల హామీల్లోని ఏటా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్ ప్రకటన అమలు కోసం బడ్జెట్‌లో ఒక్క రూపాయి ప్రతిపాదించలేదు. దీంతో అసలు రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తారా? లేదా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిరుద్యోగులకు ప్రతినెలా రూ.4,000 నిరుద్యోగ భృతి హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అటకెక్కించింది. బడ్జెట్‌లో దాని ప్రస్తావనే లేకుండాపోయింది. గతంలో కేసీఆర్ హయాంలో నిరుద్యోగుల కోసం బడ్జెట్‌లో రూ.1000 కోట్లు కేటాయించారు. గ్రూప్-1, 2, 3, 4 వంటి నోటిఫికేషన్లతోపాటు టీచర్, పోలీసు, గురుకుల టీచర్ పోస్టులు, స్టాఫ్‌నర్స్ తదితర వేలాది ఉద్యోగాల భర్తీకి అనాటి ప్రభుత్వం నోటిఫికేషన్లు ఇచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం పక్షపాత ధోరణి అవలంబిస్తున్నదని నిరుద్యోగులు మండిపడుతున్నారు.

రైతు పథకాలకు అరకొర నిధులు!

- తగినన్ని నిధులు కేటాయించలేదు
- రైతు పథకాల్లో కోతలని సంకేతం



హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72 వేల కోట్లతో భారీ మొత్తంలో నిధులు కేటాయించామని ప్రభుత్వం చెప్తున్నప్పటికీ, కాంగ్రెస్ హామీ ఇచ్చిన రైతు పథకాల అమలుకు ఈ నిధులు ఏమాత్రం సరిపోవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతి పథకానికీ అవసరమైన నిధుల్లో ప్రభుత్వం కోతలు పెట్టిందని వ్యవసాయ శాఖ నిపుణులు విశ్లేషిస్తున్నారు. తద్వారా ఆయా పథకాల్లో కోతలు ఖాయమనే అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నారు. లబ్ధిదారుల సంఖ్యలో అడ్డంగా కోతలు పెడితేనే ప్రస్తుతం కేటాయించిన నిధులు సరిపోతాయని చెప్తున్నారు. లేనిపక్షంలో ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని అంటున్నారు.

రుణమాఫీ: బడ్జెట్‌లో ప్రభుత్వం రుణమాఫీకి రూ.26 వేల కోట్లు కేటాయించింది. ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ కోసం రూ.31 వేల కోట్లు అవసరమవుతాయని గతంలో ప్రభుత్వమే తెలిపింది. కానీ, బడ్జెట్ కేటాయింపులు అందుకు తగ్గట్టుగా లేవు. ప్రభుత్వ అంచనాకీ, కేటాయింపుకీ మధ్య రూ.5 వేల కోట్ల లోటు కనిపిస్తున్నది. అంటే ఈ మేరకు రుణమాఫీలో లబ్ధిదారుల సంఖ్యలో కోత పెడతారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రైతుభరోసా: ప్రభుత్వం రైతుభరోసా(రైతు బంధు)కు రూ.15,075 కోట్లు కేటాయించింది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రతి రైతుకు ఎకరానికి రూ.15 వేల చొప్పున పెట్టుబడి సాయం అందిస్తామని హామీ ఇచ్చింది. రాష్ట్రంలో 69 లక్షల మంది రైతులకు 153 లక్షల ఎకరాల భూమి ఉన్నది. వీటికి యథాతథంగా ఇచ్చేందుకు కనీసం రూ.23 వేల కోట్ల నిధులు అవసరం. కానీ ప్రభుత్వం రూ.15 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. అవసరానికన్నా రూ.8 వేల కోట్లు తక్కువగా కేటాయించింది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల చొప్పున సాయం అందించేందుకు రూ.15 వేల కోట్లు కేటాయించింది. ఇప్పుడు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని చెప్పి, అంతే నిధులు కేటాయిస్తే ఏ విధంగా ఈ పథకాన్ని అమలుచేస్తారనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఆ మేరకు కొంతమంది రైతులకు రైతుభరోసాలో ఎగనామం పెడతారని స్పష్టమవుతున్నది.

వ్యవసాయ కూలీలకు...

ఈ ఏడాది నుంచి వ్యవసాయ కూలీలకు కూడా ఏడాదికి రూ.12 వేల చొప్పున భరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం రూ.1,200 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో ఉపాధి హామీ కార్డులు సుమారు 50 లక్షలు ఉన్నాయి. ఈవిధంగా కార్డుకు ఒకరికి భరోసా ఇచ్చినా రూ.6 వేల కోట్లు అవసరం.. కానీ, ప్రభుత్వం రూ.1,200 కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో వ్యవసాయ కూలీలు అందరికీ భరోసా ఇచ్చే అవకాశం లేదని స్పష్టమవుతున్నది.

పంటలకు బోనస్

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వరి ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చింది. బడ్జెట్‌లో రూ.1,800 కోట్లు కేటాయించింది. ఈ నిధులు ఏ మాత్రం సరిపోవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదికి రెండు సీజన్లు కలిపి సుమారు 50-60 లక్షల టన్నుల సన్నాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన రూ.2,500 నుంచి రూ.3వేల కోట్లు అవసరం. అయితే ప్రభుత్వం రూ.1800 కోట్లతో సరిపెట్టింది. మిగిలిన పంటలకు కూడా బోనస్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఈ బడ్జెట్‌లో ఒక్క వరికి మాత్రమే కేటాయించి చేతులు దులుపుకున్నది.

చేనేత, వస్త్రశాఖకు 355కోట్లు

బడ్జెట్‌లో లేని బతుకమ్మ చీరల పథకం



హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): చేనేత, వస్త్ర శాఖకు ప్రభుత్వం రూ.355కోట్లు కేటాయించింది. విద్యార్థుల యూనిఫామ్స్, దవాఖానల్లో ఉపయోగించే బెడ్‌షీట్లు వంటివి చేనేత సహకార సంఘాల ద్వారా సేకరిస్తామని బడ్జెట్‌లో ప్రకటించింది. ఇందులో బతుకమ్మ చీరల ప్రస్తావన లేకపోవడం విశేషం. బడ్జెట్‌లో చేనేత కార్మికులకు ఆర్థిక సహకారం(ఫైనాన్షియల్ అసిస్టెన్స్) కింద రూ.153కోట్లు, కార్మికుల బీమాకు రూ.15కోట్లు, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్ ప్రమోషన్‌కు రూ.187కోట్లు కలిపి మొత్తం రూ.355కోట్లు కేటాయించారు. అలాగే, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ(ఐఐహెచ్‌టీ) ఏర్పాటుకు కేంద్రం అంగీకరించిందని, త్వరలో ఏర్పాటు చేస్తామని బడ్జెట్ ప్రసంగంలో మంత్రి ప్రకటించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ ఏర్పాటుకు కేంద్రంతో సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపారు. కాగా, గత ప్రభుత్వం ఏటా చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ. 500కోట్లు కేటాయించేది. ఇందులో బతుకమ్మ చీరలకే రూ. 300నుంచి రూ.350కోట్లు చెల్లించేవారు. 35వేలమంది చేనేత కార్మికులకు సంవత్సరమంతా చేతినిండా పని దొరికేది. కాగా, ప్రభుత్వం ఈసారి బడ్జెట్‌లో బతుకమ్మ చీరల పథకం ప్రస్తావన కూడా తేలేదు.

హోంశాఖకు 35 కోట్లు కోత

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణను కాంగ్రెస్ ప్రభుత్వం లైట్ తీసుకుంటుంది. అంతరంగిక రక్షణకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో కేవలం రూ.9,349 కోట్లు మాత్రమే కేటాయించి, ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్‌లో గతంకంటే రూ.35 కోట్లు తక్కువగానే కేటాయించింది. కేసీఆర్ గత బడ్జెట్‌లో రూ.9,599 కోట్ల నిధులను కేటాయించారు. అంతకుముందు బడ్జెట్‌లో రూ.9,315.47 కోట్లు కేటాయించారు. కాగా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రూ.9,564 కోట్లను మాత్రమే కేటాయించింది. తమకు బడ్జెట్‌లో తక్కువ కేటాయించడంపై పోలీసు వర్గాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి.



బ్రాహ్మణ సంక్షేమానికి రూ.50 కోట్లు

దేవాదాయ శాఖకు 189 కోట్లు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.50 కోట్లు, దేవాదాయ శాఖకు రూ.189 కోట్లు కేటాయించారు. బ్రాహ్మణ స్వయం ఉపాధి పథకం (బెస్ట్), వివేకానంద విదేశీ విద్యాపథకం కోసం 800 మందిని ఎంపికచేశారు. ఈ పథకాల కోసం రూ.100 కోట్లు అవసరమవుతాయని బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ప్రభుత్వానికి ప్రతిపాదన పంపింది. విదేశీ విద్యా పథకం కింద ఎంపికైన 300 మంది అప్పటికే విదేశాల్లో విద్యను అభ్యసిస్తుండగా, స్కాలర్‌షిప్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయాల అభివృద్ధికి రూ.47 కోట్లు, కామన్‌గుడ్ ఫండ్ కింద 13.33 కోట్లు, అర్చకులు, ఆలయ ఉద్యోగుల వేతనాలకు రూ.109.52, బోనాలకు 20 కోట్లు కేటాయించారు. ప్రధాన ఆలయాల అభివృద్ధి ఇప్పట్లో సాకారమయ్యేలా కనిపించడంలేదు.

వ్యవసాయం కలగాపులగం

అత్యధికంగా రూ.72,659 కోట్లు

- విద్యుత్తు సబ్సిడీ, నీటిపారుదల ఖర్చులూ ఇందులోనే
- రుణమాఫీకి 26 వేల కోట్లు
- రైతుభరోసాకు 15,075 కోట్లు.. బోనస్‌కు 1800 కోట్లు
- రైతుకూలీలకు1200 కోట్లు
- వ్యవసాయ లెక్క గంగరగోళంగా ఉందంటున్న నిపుణులు

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో వ్యవసాయానికి అత్యధిక నిధులు కేటాయించినట్టు ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క చెప్పారు. వ్యవసాయానికి మొత్తంగా రూ.72,659 వేల కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ, అనుబంధరంగాలకు కలిపి మొత్తం రూ.32,019 కోట్ల బడ్జెట్‌ను గత ప్రభుత్వం కేటాయించింది. ఈ బడ్జెట్‌లో అనుబంధరంగాలైన ఉద్యానశాఖకు రూ.737 కోట్లు, పౌర సరఫరాల సంస్థకు రూ.3,836 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1,980 కోట్లు కేటాయించింది. ప్రభుత్వం అమలుచేస్తున్న, చేయబోయే పలు పథకాలకు నిధులు కేటాయించింది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఈ ఏడాది నుంచి వ్యవసాయ కూలీలకు కూడా రైతుభరోసా అమలు చేయనున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకోసం బడ్జెట్‌లో రూ.1,200 కోట్లను కేటాయించింది. దీంతోపాటు రైతుభరోసా కోసం రూ.15,075 కోట్లు కేటాయించింది. రుణమాఫీ కోసం రూ.26 వేల కోట్లు, ధాన్యం బోనస్‌కు రూ.1,800 కోట్లు కేటాయించింది. వీటితోపాటు రైతులకు సబ్సిడీ విత్తనాలు అందించేందుకు రూ.106 కోట్లు, పంటల బీమా కోసం 1,300 కోట్లు, రైతు బీమా కోసం 1,589 కోట్లు కేటాయించింది.

విద్యుత్తు సబ్సిడీ, నీటి లెక్కలూ ఇందులోనే..

ప్రభుత్వం వ్యవసాయ శాఖ బడ్జెట్‌ను ఎక్కువగా చూపించడం తాపత్రయ పడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్ కేటాయింపుల్లోని లెక్కలను వ్యవసాయ, ఆర్థికరంగ నిపుణులు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. వ్యవసాయానికి అవసరమయ్యే విద్యుత్తు సబ్సిడీ, నీటిపారుదల ఖర్చును కూడా ప్రభుత్వం వ్యవసాయ పద్దులోనే చూపడం గమనార్హం. విద్యుత్తు సబ్సిడీ కింద రూ.11,500 కోట్లు, నీటిపారుదల ఖర్చు కింద రూ.10,829 కోట్లు చూపించింది. ఈ రెండు పథకాలు కలిపి రూ.22,329 కోట్లు చూపించింది. ఈ రెండింటిని తీసేస్తే వ్యవసాయ శాఖ బడ్జెట్ రూ.72,659 కోట్ల నుంచి రూ.50,330 కోట్లుగా ఉంటుంది. రుణమాఫీకి కేటాయించిన రూ.26వేల కోట్లను మినహాయిస్తే వ్యవసాయ శాఖ బడ్జెట్ రూ.24 వేల కోట్లేనని నిపుణులు లెక్కవేస్తున్నారు. ఈ నేపథ్యంలో గత ప్రభుత్వం వ్యవసాయరంగానికి రూ.26,831 కోట్లు కేటాయించింది. ఈ లెక్కన ప్రస్తుతం ప్రభుత్వం గతంతో పోల్చితే రూ.2,831 కోట్లు తక్కువగానే కేటాయించిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

సాగరాలకు సంకటం

సాంకేతికత విస్ఫోటించి కృత్రిమ మేధస్సు ఊపిరి పోసుకుంటున్న ప్రస్తుత యుగంలోనూ మానవ పరిజ్ఞానం రెండింటి విషయంలో ఇంకా పరిమితంగానే ఉండిపోయింది. అందులో మొదటిది మనిషి మెదడు కాగా, రెండోది సముద్రం. రెండూ లోతైనవి కావడమే అందుకు కారణం కావచ్చు. భూగోళం విస్తీర్ణంలో 71 శాతం సముద్ర జలాలే పరుచుకుని ఉంటాయి. రుతువులు మారడం, ఉష్ణోగ్రత స్థిరీకరించడం, అధిక మొత్తంలో ఆక్సిజన్ సమకూర్చడం విషయంలో సముద్రాల పాత్ర అద్వితీయమైంది. భూగోళం మనుగడలో ఇంత ముఖ్యపాత్ర పోషించే సముద్రం గురించి తెలిసింది చాలా తక్కువే. ఉదాహరణకు సముద్రం అడుగు భాగం మ్యాపింగ్ 26 శాతం మాత్రమే పూర్తయింది. ఇక వాతావరణంపై సముద్రం వేసే ప్రభావం గురించిన పరిశోధనలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. సముద్రంలో ఖనిజాలు, ఇతర వనరుల అన్వేషణ ఇటీవలి కాలంలో కొంత ఊపందుకున్నది. ఈ నేపథ్యంలో సముద్ర శాస్త్రం పురోగతి దిశగా అడుగులు వేసేందుకు ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకున్నది. ప్రస్తుత దశాబ్దిని సాగర దశాబ్దిగా ప్రకటించింది. సుస్థిర అభివృద్ధికి సముద్ర శాస్త్రం అనేది దీని లక్ష్యంగా నిర్ణయించింది. మన దేశం ఈ కార్యక్రమంలో భాగంగా అర్థిక మండలాల సమీపంలో సముద్రం అడుగు భాగం అన్వేషణలకు 2023లో శ్రీకారం చుట్టింది.

సుస్థిర అభివృద్ధికి సముద్ర శాస్త్రాన్ని ఆలంబనగా నిలపడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెను సవాలుగా మారిందని చెప్పక తప్పదు. అన్వేషణ కన్నా ముందు సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన అత్యవసర స్థితి నెలకొన్నది. ఎందుకంటే మహాసాగరాలు ప్రస్తుతం కాలుష్య కాసారాలుగా మారిపోయాయి. రసాయనాలు, ముఖ్యంగా ప్లాస్టిక్ కాలుష్యం ప్రాణాంతకంగా తయారవుతున్నది. సముద్రగర్భం ప్లాస్టిక్‌కు శాశ్వత రిజర్వాయర్‌గా మారిపోయింది. పసిఫిక్‌లో దాదాపు ఫ్రాన్స్ భూభాగమంత సైజులో అతిపెద్ద ప్లాస్టిక్ తెట్టు తేలియాడుతున్నదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఏటా సముద్రంలో 80 లక్షల నుంచి కోటి మెట్రిక్ టన్నుల దాకా ప్లాస్టిక్ వ్యర్థాలు వచ్చిచేరుతున్నాయి. రసాయనాల వ్యర్థాలు, అణు వ్యర్థాలు కూడా అదనంగా వచ్చిపడుతుండటంతో సముద్రాలను కాలుష్యం ఊపిరి సలుపనివ్వడం లేదు. ఫలితంగా సముద్ర జీవులు మనుగడ సాగించలేక సతమతమవుతున్నాయి. ప్లాస్టిక్ వల్ల ప్రభావితమవుతున్న జీవజాతుల్లో 17 శాతం అంతరించే దిశగా పోతున్నట్టు ఐక్యరాజ్య సమితి నివేదిక తెలియజేస్తున్నది. కాలుష్యం కారణంగా సముద్రాల ఉష్ణోగ్రత నిరంతరాయంగా పెరుగుతుండటం మరో సమస్య. దీనివల్ల తుపానులు, వడగాలుల వంటి తీవ్ర వాతావరణ సమస్యలు తలెత్తుతున్నాయి. 2030లోగా సముద్రాల్లో 30 శాతం విస్తీర్ణంలో రక్షిత వనాల తరహాలో రక్షిత మండలాలను ఏర్పాటు చేయాలని సూచించే ఐక్యరాజ్య సమితి సముద్ర ఒప్పందం వచ్చే ఏడాది (2025) నుంచి అమలులోకి వస్తుంది. అంటే దాని అమలుకు ఐదేండ్ల సమయం మాత్రమే ఉంటుందన్న మాట.

సముద్ర పరిరక్షణ కృషి ప్రధానంగా సాంకేతికత మీదే ఆధారపడ ఉన్నది. సాగర జలాల్లోంచి కాల్యాన్ని వేరుచేసి, తొలగించేందుకు సాంకేతికతను వినియోగిస్తున్నారు. కానీ, జరగాల్సింది మనుషుల లేదా దేశాల ధోరణిలో మార్పు రావడం. భూమి మీద ఇప్పటిదాకా తయారైన ప్లాస్టిక్‌లో పందశాతం యథాతథంగా ఉండిపోయిందనేది గుర్తుంచుకోవాలి. అది కొంత భూమి మీద, చాలావరకు సముద్రాల్లో నిక్షిప్తమై ఉంది. ప్లాస్టిక్ వినియోగాన్ని సున్నాకు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఇది అంత సులభంగా సాధ్యమయ్యేది కానప్పటికీ ఆ దిశగా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేకపోతే మానవజాతి తనకు మాత్రమే కాకుండా యావత్తు జీవకోటికి మరణశాసనం రాసుకున్నట్టే అవుతుంది.

కాళేశ్వరంపై కల్లబొల్లి కబుర్లు



వి.ప్రకాశ్

జూలై 15న తెలంగాణ ట్రాన్స్‌కోలో చీఫ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న కె.రఘు, జూలై 16న కేంద్ర జల వనరుల మంత్రి సలహాదారు వెదిరె శ్రీరాం కాళేశ్వరం విచారణ కమిషన్ ముందు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చినట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయి. ఆ వార్తల ప్రకారం.. వారు కమిషన్‌కు కొత్త విషయాలు ఏమీ చెప్పినట్టు కనబడలేదు. 2017 నుంచి జేఏసీ ముసుగులో చేసిన వాదనలే రఘు, రెండు నెలల కింద ఒక తెలుగు దినపత్రికలో రాసిన అంశాలనే వెదిరె శ్రీరాం కమిషన్ ముందు ప్రస్తావించినట్టు అవగతం అవుతున్నది. వారు ప్రధానంగా ప్రస్తావించిన అంశాలు నాలుగు.

వాటిలో 1.తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత ఉన్నా.. లేదని కేంద్ర జల సంఘం లేఖ రాసినట్టు తప్పుడు అన్వయం చేసి కాళేశ్వరం ప్రాజెక్టును తెరపైకి తెచ్చారు. 2.తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మిస్తే గ్రావిటీ ద్వారా నీరు ఎల్లంపల్లికి చేరేవి. అయితే 152 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర ఒప్పుకోవడం లేదన్న కారణం చూపి బ్యారేజీ నిర్మాణస్థలాన్ని మేడిగడ్డకు మార్చారు. దీంతో ఏటా వేల కోట్ల రూపాయల కరెంటు బిల్లుల రూపంలో రాష్ట్రంపై ఆర్థిక భారాన్ని మోపారు. 3.డీపీఆర్ లేకుండానే ప్రాజెక్టు పనులకు టెండర్లు పిలిచారు. 4.బ్యారేజీల నిర్మాణంలో ప్లానింగ్ లోపాలు, డిజైన్‌లో లోపాలు, నాణ్యతా లోపాలు, నిర్వహణ లోపాలు ఉన్నాయని నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నిర్ధారించింది.

ఈ అంశాలన్నిటికీ గతంలోనే అనేకసార్లు వివరణలు ఇచ్చినప్పటికీ వారు మళ్లీ మళ్లీ పాత చింతకాయ పచ్చడినే వడ్డిస్తున్నారు. పదే పదే అబద్ధాలు ప్రచారం చేస్తే అవే నిజాలై పోతాయన్న గోబెల్స్ సిద్ధాంతాన్ని వారు బలంగా నమ్ముతున్నారని అనుకోవాల్సి వస్తున్నది. వారు ప్రస్తావించిన అంశాలను ఒక్కొక్కటే సంక్షిప్తంగా విశ్లేషిస్తాం. రాసిన విషయాలనే మళ్లీ రాయడం నాకూ విసుగ్గా అనిపిస్తున్నప్పటికీ రాయక తప్పడం లేదు.

1.తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై కేంద్ర జల సంఘం ఏం చెప్పింది?

తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతకు సంబంధించి కేంద్ర జల సంఘం కాళేశ్వరం ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు రాసిన లేఖలు రెండున్నాయి. మొదటిది 2015 ఫిబ్రవరి 18న రాసిన లేఖ. రెండవది 2015 మార్చి 4న రాసినది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పంపిన ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు డీపీఆర్‌ని కేంద్ర జల సంఘంలోని హైడ్రాలజీ డైరెక్టరేట్ వారు పరిశీలించి తుమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై తమ పరిశీలనను, సూచనలను చేశారు. 2015 ఫిబ్రవరి 18న ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్‌కు కేంద్ర జల సంఘం రాసిన లేఖలోని పేరా 2లో.. 'నది పర్యావరణ పరిరక్షణ కోసం వదలాల్సిన నీరు పోనూ తుమ్మిడిహట్టి వద్ద నికరంగా లభ్యమయ్యే 160 టీఎంసీల నీటిని ప్రాజెక్టు అవసరాల కోసం వినియోగించే అవకాశం ఉండవచ్చు'ని ఉంది. ఇకపోతే 2015 మార్చి 4న రాసిన లేఖలోని పేరా 3, Combined Yield Series అనే సబ్ హెడ్డింగ్ కింద పేరా 12లో తుమ్మిడిహట్టి వద్ద 75 శాతం విశ్వసనీయతతో లభ్యమయ్యే నీరు 165 టీఎంసీలని పేర్కొంటూనే, అందులో పై రాష్ట్రాలు భవిష్యత్తులో వాడుకునే 63 టీఎంసీలు కలిసి ఉన్నాయని, ఈ 63 టీఎంసీలు ఇప్పుడు కిందికి వస్తున్నాయని, కానీ భవిష్యత్తులో రావడానిదన్ని స్పష్టంగా పేర్కొన్నది. ఈ మాటలు రాష్ట్ర ప్రాజెక్టు అధికారులకు తుమ్మిడిహట్టి వద్ద తరలించగలిగే నీటి పరిమాణాన్ని పునపరిశీలించాలని సూచన చేసింది. తుమ్మిడిహట్టి వద్ద లభ్యమయ్యే నీటి పరిమాణం తగ్గిపోతుందన్న సూచన అందులో ఉన్నది. కాబట్టి భవిష్యత్తులో నికరంగా లభ్యమయ్యే నీరు 165- 63 = 102 టీఎంసీలని స్పష్టం అవుతున్నది. ఇందులో పర్యావరణ ప్రవాహాలు 25 శాతం తీసేస్తే మిగిలేది 80 టీఎంసీలు. ఇది తుమ్మిడిహట్టి బ్యారేజీని 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద నిర్మించినప్పుడు మాత్రమే సాధ్యం అవుతుంది. మహారాష్ట్ర 148 మీటర్ల కంటే ఒక్క ఇంచు ఎక్కువకు కూడా ఒప్పుకోనే ప్రసక్తే లేదని అనేక సందర్భాల్లో ప్రకటించింది. 148 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద 4 మీటర్ల డ్రైవింగ్ హెడ్ తగ్గిపోతుంది. కనుక గ్రావిటీ కాలువలోకి మళ్లించగలిగే నీటి పరిమాణం మరింత తగ్గుతుందని విశ్లేషిస్తే.. ఇది పచ్చి అబద్ధం, తప్పుడు అన్వయమని అంటున్నారు ఈ ఇద్దరు మేధావులు.

> **ఏపీ ప్రభుత్వం తమతో సంప్రదించకుండా, తమ అంగీకారం లేకుండా ఏకపక్షంగా ప్రాజెక్టు కంట్రోల్ లెవెల్స్, ఇతర సాంకేతిక అంశాలను నిర్ధారించుకొని ముందుకు సాగుతున్నదని, ఈ ఖర్చు అంతా వృథా అవుతుందని అప్పటి కాంగ్రెస్ ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చవాన్.. ఏపీ ముఖ్యమంత్రి కిరణ్ కుమార్‌రెడ్డికి ఘాటైన లేఖ రాసిన సంగతి అందరికీ ఎరుకే.**

ప్రాణహిత - చేవెళ్లపై అనుమతి కోసం మహారాష్ట్రతో సంప్రదింపులు

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుమతి సాధించడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని కమిషన్ ముందు వెదిరె ఆరోపించారు. ఇంతకంటే పచ్చి అబద్ధం మరొకటి ఉండదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాగానే మహారాష్ట్ర ప్రభుత్వంతో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు అనుమతుల కోసం కేసీఆర్ సర్కార్ సంప్రదింపులు ప్రారంభించింది. అప్పటికి ఇంకా మహారాష్ట్రలో కాంగ్రెస్ ప్రభుత్వమే అధికారంలో ఉన్నది. ఆనాటి తెలంగాణ సాగునీటి మంత్రి హరీశ్‌రావు ముంబై వెళ్లి మహారాష్ట్ర జల వనరుల మంత్రి ముష్రీఫ్‌ను కలిశారు. ఆయన తమ ప్రభుత్వపు పాత వైఖరినే వెల్లడించారు. అయితే కొద్ది నెలల్లో రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు జరుగబోతున్నాయి కనుక ఈ తరుణంలో ఈ అంశంపై ఏ చర్చలకూ ఆస్కారం లేదని, ఎన్నికల తర్వాత ఏర్పడే కొత్త ప్రభుత్వంతో చర్చించాలని నిజాయితీగానే చెప్పారు. దేనికీమూ లేక ఎన్నికలు ముగిసి, కొత్త ప్రభుత్వం ఏర్పాటు



కాళేశ్వరంపై విష ప్రచారం.. అసలు వాస్తవాలు - 1

అయ్యేదాకా వేచి ఉండక తప్పలేదు. మహారాష్ట్రలో దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైంది. అప్పుడు ఆ రాష్ట్రంలో మన తెలంగాణ బిడ్డ చెన్నమనేని విద్యాసాగర్ రావు గవర్నర్‌గా ఉన్నారు. తొలుత హరీశ్‌రావు మహారాష్ట్ర సాగునీటి మంత్రి గిరీష్ మహాజన్‌తో చర్చించడానికి ముంబై, నాగపూర్‌కు వెళ్లారు. ఆయనతో పాటు నేనూ వెళ్లాను. తుమ్మిడిహట్టి బ్యారేజీ ఎఫ్ఆర్ఎల్‌పై మహారాష్ట్రను ఒప్పించే ప్రయత్నం చేశారు. అయితే, 'ఇది నా స్థాయిలో తీసుకునే నిర్ణయం కాదు, ముఖ్యమంత్రుల స్థాయిలో జరగాల్సిన నిర్ణయం' అని గిరీష్ మహాజన్ సెలవిచ్చారు. అదే సమయంలో తెలంగాణ సాగునీటి సలహాదారు దివంగత ఆర్.విద్యాసాగర్ రావు కూడా ఇంజినీర్ల స్థాయిలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. ఈ చర్చల్లో కూడా వారు తమ పాత వైఖరిని సడలించలేదు. 2015 ఫిబ్రవరి 17న కేసీఆర్ తన పుట్టిన రోజు వేడుకలను కూడా వదిలేసి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో చర్చలకు ముంబై వెళ్లారు. ఆ సమావేశం గవర్నర్ నివాసంలో ఆయన సమక్షంలోనే జరిగింది. ఆ సమావేశంలో పాల్గొనడానికి కూడా మంత్రి హరీశ్‌రావుతో పాటు నేను కూడా వెళ్లాను. తుమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ వద్ద బ్యారేజీ నిర్మాణానికి ఆమోదం తెలపాలని కేసీఆర్ అభ్యర్థించారు. ముంపునకు గురవుతున్న భూములకు మహారాష్ట్ర నిర్ధారించిన పరిహారాన్ని చెల్లిస్తామని అన్నారు.

> **ఇవాళుగా ఫడ్నవీస్ స్పష్టంగా అన్న మాట ఏమిటంటే.. 'కేంద్రంలో కాంగ్రెస్, మహారాష్ట్రలో కాంగ్రెస్, ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడే మహారాష్ట్ర ప్రభుత్వం 152 మీటర్ల ఎత్తుకు బ్యారేజీ నిర్మాణానికి అనుమతించలేదు. ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఉద్యమించి అరెస్ట్ అయిన నేను అనుమతి ఎట్లా ఇస్తాను? బ్యారేజీ ఎత్తును 4 మీటర్లు తగ్గించి, 148 మీటర్ల వద్ద కట్టుకోండి. గోదావరి అవార్డు ప్రకారం మీకు ఎన్ని నీళ్లు తీసుకపోయినా మాకు అభ్యంతరం లేదు' అని.**

నాటి మహారాష్ట్ర గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు సమక్షంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి అన్నమాటలు ఇవి. ఇక వాటితో సంప్రదింపులు అంటే కాలయాపన తప్ప మరేమీ ఉండదని కేసీఆర్ నిర్ధారణకు వచ్చారు. చర్చలు విఫలమైంది తెలంగాణ ప్రభుత్వ ప్రయత్న లోపం వల్ల కాదు, మహారాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి వల్లనే. మహారాష్ట్ర సర్కార్ వైఖరి వల్లే చర్చలు ముందుకు సాగలేదు. అనంతరం 2015 మార్చి 4న తుమ్మిడిహట్టి వద్ద భవిష్యత్తులో నీటి లభ్యత అనుమానాస్పదమేనని కేంద్ర జల సంఘం లేఖ రాసిన తర్వాత ఇక మహారాష్ట్రతో ఎఫ్ఆర్ఎల్, ముంపు పంచాయతీ పరిష్కారమైనా ప్రాజెక్టు సాఫల్యతకు అవసరమైన నీటి లభ్యతనే ప్రశ్నార్థకం అయినప్పుడు ప్రభుత్వం ఏం చేయాలి? ప్రాజెక్టు సాఫల్యత కోసం ప్రత్యామ్నాయం వెదకాల్సి వచ్చింది. ఆ వెదుకులాటలో దొరికిందే మేడిగడ్డ. ఇది 1990వ దశకంలో గోదావరి జలాల వినియోగంపై ప్రముఖ ఇంజినీర్, ఐక్యరాజ్య సమితి సలహాదారు దివంగత టి.హనుమంతరావు స్టెప్ ల్యాడర్ టెక్నాలజీలో భాగంగా ప్రతిపాదించిన ఏడు వరుస బ్యారేజీల్లో ఒకటైన సూరారం బ్యారేజీ స్థలమే. 152 మీటర్ల వద్ద తుమ్మిడిహట్టి బ్యారేజీని తీవ్రంగా వ్యతిరేకించిన ఫడ్నవీస్ ప్రభుత్వం ప్రాజెక్టును రీ- ఇంజినీరింగ్ చేసిన తర్వాత సానుకూలంగా స్పందించింది. రెండు రాష్ట్రాల మధ్య చరిత్రాత్మకమైన ఒప్పందంపై సంతకాలు కూడా చేసింది దేవేంద్ర ఫడ్నవీస్ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం.

కేంద్ర జల సంఘం హెచ్చరికను పరిగణనలోకి తీసుకోవడం తప్పా?

ప్రాజెక్టు సాఫల్యతకు తుమ్మిడిహట్టి వద్ద భవిష్యత్తులో నికర జలాలు లభ్యం కావని చెప్పిన కేంద్ర జల సంఘం, మేడిగడ్డ వద్ద 284 టీఎంసీల నికర జలాలు ఉన్నాయని చెప్పింది. మేడిగడ్డ స్థలం ఎంపిక నీటి లభ్యత దృష్ట్యా సరైనదేనని కేంద్ర జల సంఘం ధ్రువీకరించింది. నాగార్జునసాగర్ నిర్మించినప్పుడు ఎగువన ప్రాజెక్టులు లేవు కాబట్టి, నీరు ధారాళంగా ప్రాజెక్టుకు చేరుకునేది. కర్ణాటక తమ వాటా వినియోగం కోసం ఆల్మట్టి, నారాయణపూర్ డ్యాంలను, మరికొన్ని బ్యారేజీలను నిర్మించడంతో నాగార్జునసాగర్‌కు నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గిపోయాయి. శ్రీరాంసాగర్ పరిస్థితి కూడా అదే. కాబట్టి భవిష్యత్తులో తుమ్మిడిహట్టికి అదే గతి పట్టబోతున్నదన్న హెచ్చరిక కేంద్ర జల సంఘం రాసిన లేఖలో ఉన్నది. ఆ హెచ్చరికను అన్వయించుకోవడం ఈ ఇద్దరు మేధావులకు తప్పుగా కనబడుతున్నది. కేంద్ర జల సంఘం రాసిన లేఖలు రహస్య పత్రాలు కావు. 2018లోనే తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం ప్రచురించిన 'తెలంగాణ జీవధార కాళేశ్వరం ప్రాజెక్టు' అనే పుస్తకంలో అనుబంధంగా చేర్చారు. ప్రజలందరూ వాటిని చదివారు. అయినా పాత చింతకాయ పచ్చడినే వీరు మళ్లీ మళ్లీ వడ్డించడమంటే తెలంగాణ ప్రజల విజ్ఞతను పరిహసించే సాహసం చేస్తున్నారనే అనుకోవాలి.

(ఇంకా ఉంది)

(వ్యాసకర్త: తెలంగాణ జల వనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్)

> కొన్ని సందర్భాలు, కొన్ని ప్రభుత్వాలు, కొంతమంది నాయకుల గురించి చెప్పడానికి ఏ ఉపమానాలూ సరిపోవు. అట్లాంటి సందర్భం మొన్నటి కేంద్ర బడ్జెట్ అయితే, అట్లాంటి ప్రభుత్వం ఎన్డీయే, ఆ నాయకుడు మోదీ. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణపై సవతి తల్లి ప్రేమ చూపిస్తూనే ఉన్నది. రూ.48 లక్షల కోట్ల తాజా కేంద్ర బడ్జెట్‌లో దిల్లిగవ్వ కూడా తెలంగాణకు ఇవ్వకపోవడమే అందుకు నిదర్శనం.

కనికరం లేదు.. కాసు విదిల్చలేదు!



అస్నాని మారుతీ సాగర్
90107 56666

తెలంగాణ ప్రయోజనాలు. బీజేపీకి అస్సలు పట్టవు. అలాంటి ఆలోచన రావడం కూడా చాలా పెద్ద తప్పు అనేలా పదేండ్లుగా ఆ పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారు. వాళ్లకు తెలంగాణపై ఎందుకంత కోపమో ఇప్పటికీ అర్థం కావడం లేదు. తాజా సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ఎంపీ సీట్లు రెట్టింపయ్యాయి. అయినా ఢిల్లీ పెద్దలకు తెలంగాణపై కనికరం లేదు. తెలంగాణ అనే ఒక రాష్ట్రం ఉందనే సంగతి వారు మరిచిపోయారు. అందుకే ఒక్క కాసు కూడా విదిల్చడం లేదు.

మోదీ మూడోసారి ప్రధాని అయితే మంత్రి పదవులతో పాటు భారీగా నిధులు తెస్తామని ఎన్నికల సమయంలో బీజేపీ నాయకులు ప్రగల్భాలు పలికారు. వారన్నట్టు రెండు కేంద్ర మంత్రి పదవులు వచ్చాయి గానీ, నిధులు మాత్రం అస్సలు రాలేదు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, సమస్యలు, పోరాటాలు, ఆత్మగౌరవ నినాదాల గురించి బీజేపీ నేతలకు బొత్తిగా తెలియదని పదే పదే రుజువవుతూనే ఉన్నది. 'తల్లిని చంపి, పిల్లను బతికించారని' మోదీ గతంలో అన్నప్పుడు తెలంగాణ ప్రజలకు దాని వెనుకున్న అంతర్యం అర్థం కాలేదు. అందుకే మూడోసారైనా మోదీ మారకపోతారా? మనకు నిధులు ఇవ్వకపోతారా? అని భావించి బీజేపీకి సీట్లు, ఓట్లు కట్టబెట్టారు. అయితే ఎన్ని ఓట్లిచ్చినా, సీట్లిచ్చినా ఆయన తీరులో మార్పు ఉండదని సవతి ప్రేమతో తేటతెల్లమైంది.

> **తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఢిల్లీ పర్యటనలకు శ్రీకారం చుట్టారు. కాసుల కేటాయింపులకు పోటీపడతారని సంకేతాలు ఇచ్చారు. చాలామంది కేంద్ర మంత్రులను వారు కలిశారు. వినతిపత్రాలు ఇచ్చారు. అంతేకాదు, ఏకంగా మోదీని బడే భాయ్ (పెద్దన్న) అని రేవంత్ సంబోధించారు. అయినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో కేసీఆర్ వైఖరి వల్లనే కేంద్రం నిధులు ఇవ్వడం లేదని గతంలో పెద్ద ఎత్తున ప్రచారం చేసినవాటికి వాస్తవాలు తెలిసివచ్చాయి.**

అసలు విభజన హామీలు అనేవి ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించినవి. కేంద్రంలో భాగస్వామిగా ఉన్నారు కాబట్టి, ఒకరికి న్యాయం చేసి, మరొకరికి తీరని అన్యాయం చేయడం ఎంతవరకు సబబు. అమరావతికి రూ.15 వేల కోట్లు, పోలవరం దాదాపు రూ.59 వేల కోట్లు కేటాయించిన కేంద్రం.. పోలవరం ప్రాజెక్టును పూర్తిచేసే బాధ్యతను తీసుకున్నది. అయితే తెలంగాణలోని పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు గురించి కనీసం ప్రస్తావించకపోవడం శోచనీయం. అంతేకాదు, బడ్జెట్‌లో బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ ముచ్చటే లేదు. కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీకి బదులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పిన ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు కేటాయింపులు లేవు. ఐటీఐఆర్, ఐఐఎం ఊసే ఎత్తలేదు. దీంతో తెలంగాణపై బీజేపీ నాయకులది కపట ప్రేమేనని మరోసారి స్పష్టమైంది.

కేంద్రానికి ఎక్కువ పన్నులు చెల్లిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. పైగా తెలంగాణ మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రం. అందుకే తెలంగాణ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం ఇష్టం లేక కేసీఆర్ మూలధనాన్ని పెట్టుబడిగా పెట్టి, సంపద సృష్టి దిశగా అడుగులు వేశారు. ఆ సంపదను ప్రజలకు పథకాల రూపంలో పంచారు. కేంద్రం ఏమీ ఇవ్వకపోయినా ప్రపంచం అబ్బురపడే పథకాలను తీసుకొచ్చారు. సంక్షేమానికి సరికొత్త అర్థం చెప్పారు. ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ప్రయోజనం ఉండదని తెలిసే కేసీఆర్ తన మార్గంలో తాను వెళ్లారు. ఈ నేపథ్యంలో కేంద్రంపై ఆధారపడటం మానుకొని.. కాంగ్రెస్ పాలకులు కూడా కేసీఆర్ పంథాను అనుసరిస్తూ వనరుల సమీకరణపై, ప్రత్యామ్నాయ ఆర్థిక వనరులపై దృష్టి పెట్టాలి.



ఇంగ్లండ్ తరహా పన్నులు.. సోమాలియా తరహా సేవలు!



సాధారణంగా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడు ఏదో ఒక వర్గం సంతోషిస్తుంది. కానీ, ఈసారి బడ్జెట్‌పై బీజేపీ కార్యకర్తలతో సహా ఎవరూ సంతోషంగా లేరు. మన దేశ ప్రజలు ఇంగ్లండ్ తరహాలో పన్నులు చెల్లిస్తున్నారు. కానీ, సోమాలియా తరహాలో మనకు సేవలు అందుతున్నాయి.

- రాఘవ్ చద్దా, ఆప్ రాజ్యసభ ఎంపీ

పోరాటమే తన ఊపిరి



డా.అయాచితం శ్రీధర్
98498 93238



సింగంబాలుటితో గుహాంతరమునన్ చేర్పాటులై నుండి మాతంగ స్ఫూర్తి యూధ దర్శన సముద్యత్ క్రోధమై వచ్చుతో జంగాంతర సిహాద భీమ్నమతి అత్యత్నోన్నతి వేదివ చ్ఛం గుంతీ సుత మధ్యమంబు సమరోత్సాహాభిరామాకృతిన్

ఈ పద్యం తిక్కన రచించిన మహాభారతం (విరాట పర్వం) లోనిది. అడవిగొడ్డు సింహం పగలు పర్వతంపై గుహాలో ఉంటూ, ఏనుగుల గుంపును చూసి వాటి మీదికి ఒక్కసారిగా లంఘించినట్టు ఆగ్రహంతో ఉన్న అర్జునుడు కౌరవసేనపై సమరోత్సాహంతో వస్తున్నాడని ఉత్తర గోగ్రహణ ఘట్టంలో ద్రోణాచార్యుడు దుర్యోధనునితో అంటాడు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా శాసనసభకు బయలుదేరిన కేసీఆర్‌ను దృశ్య మాధ్యమాల్లో చూసినప్పుడు నాకా పద్యం గుర్తుకొచ్చింది. 2001లో జలదృశ్యానికి, 2006లో కరీంనగర్ ఉప ఎన్నికలకు, 2009లో ఆమరణ నిరాహార దీక్షకు బయలుదేరిన కేసీఆర్ దృశ్యాలన్నీ ఒక్కసారిగా కండ్లముందు కదలాడాయి. నాలుగు దశాబ్దాలుగా నిరంతరంగా చట్టసభల్లో కొనసాగుతున్న రాజకీయ దురంధరుడు రాష్ట్ర సాధకుడు, రాష్ట్ర మంత్రిగా, కేంద్రమంత్రిగా, ముఖ్యమంత్రిగా అపార అనుభవం గడించిన కేసీఆర్‌పై.. కాలం కలిసిరాక ఒక పరుసవేద్య తానేనంత మాత్రాన ప్రత్యర్థులు ఎన్ని అవహేళనలు, ఎన్నెన్ని దూషణలు, ఎన్నెన్ని అవాకులు చెవాకులు పేలారో మనం చూశాం. దురదృష్టవశాత్తు ప్రమాదానికి గురైతే కాంగ్రెస్ నేతలు కనీసం ఆయన వయసుకైనా గౌరవం ఇవ్వకుండా వికృత వ్యాఖ్యానాలు, వెటకారాలతో చేసి కొరవ సభను తలపించిన వైనాన్ని తెలంగాణ ప్రజలు ఇంకా మరిచిపోలేదు.

చట్టసభల్లో పాల్గొనడం, ప్రత్యర్థులను దీటొప్పడం, ప్రసంగించడం, ప్రతిస్పందించడం కేసీఆర్‌కు ఏదో కొత్త అయినట్టు, అయనేదో భయపడుతున్నట్టు బీరాలు పలికిన అంగుష్ఠ మాత్రులకు, ఆగొద్ది భ్రాతలకు నోళ్లు మూతపడే ముహూర్తం కేసీఆర్ సందనసభలోని ఇంటి గడప దాటిన క్షణంలోనే ఆరాధించి. అయనను పాతికేండ్లుగా చూస్తున్న అది మానులకు తెలుసు. కేసీఆర్ మౌనం ఒక తుఫాను ముందు ప్రశాంతత. కేసీఆర్ ఆగ్రహం ఒక మహాశక్తి యుద్ధానికి సంకేతం. అది తెలియని అర్భకులు ఇంతకాలం పెంచేపోయారు. ఇక ఆట మొదలైంది. పిల్లకాకులకేం తెలుసు ఉండేలు దెబ్బ.

కేంద్రంలో వరుసగా మూడుసార్లు బొక్కబోర్లా పడి, మూడ్నాలుగు రాష్ట్రాలకు పరిమితమై మనుగడ సాగిస్తున్న కాంగ్రెస్ ఇవాళ బీఆర్ఎస్‌ను చచ్చిన పాము అని, భూస్థాపితమైందని, ముగిసిన అధ్యాయమని అనడం విడ్డూరం. దశాబ్ద పాటు కాంగ్రెస్ ముఖ్యమంత్రులను అందించిన ఆంధ్రప్రదేశ్‌లో అటు అసెంబ్లీలో, ఇటు లోక్‌సభలో వరుసగా మూడుసార్లు గుండు సున్నా తెచ్చుకున్న కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్‌ను వెక్కిరించడం గురువిందను గుర్తుచేస్తున్నది. గతంలో ఓ పెద్దమనిషి తెలంగాణ ఉద్యమం మట్టిలో పుట్టి మట్టిలో మాడిపోతుందన్నారు. తానే ఆ రాష్ట్రానికి పరాయిగా చిత్తగించారు. ఆయన అసెంబ్లీ కిమ్మిదికి అదే గతి. కేసీఆర్ రాజకీయ అనుభవమంత వయసు లేని ఈ పిపీలికం గాళ్ల కొరలు చరుస్తుంటే నవ్వొస్తోంది.

కొందరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బీఆర్ఎస్ నుంచి జారుకోగానే అల్పులు చరుమకుంటున్న కాంగ్రెస్.. కోడి గొంతు నొక్కి కొత్త పొద్దు ఆగిపోతుందని భ్రమిస్తున్నది. పాతికేండ్ల క్రితం కేసీఆర్ ఒక్కడే ప్రారంభించిన ఉద్యమం ఎన్ని ఆటుపోట్లను ఎదుర్కొన్నా తుదకు విజయం సాధించింది. కేసీఆర్ నినదించిన జై తెలంగాణ బిందువుగా ప్రారంభమై, ప్రవహించి, విస్తరించి, వ్యాపించి ఒక సింధువుగా మారింది. కేసీఆర్ అడుగు సరికొత్త నడకలు నేర్పుతుంది. అడ్డంకులెన్ని ఎదురైనా ముందుకు సాగిపోవడం గమ్యాన్ని చేరుకోవడం దాని సహజ లక్షణం. ఏదేమైనా 2024 జూలై 25 రాష్ట్ర రాజకీయాల్లో ఒక కొత్త మలుపు. కేసీఆర్ చిరకాలం వర్ధిల్లు గాక. శుభమస్తు. విజయోస్తు.



రాష్ట్ర బడ్జెట్ పూర్తి సత్యదూరంగా ఉంది. గత ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం తప్ప, ప్రజా సంక్షేమం కనిపించలేదు. ప్రజలకు ఆశలు పెట్టి వంచనకు గురి చేసింది. రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులను ప్రతి ఒక్కరిని ఈ బడ్జెట్ నిరాశపర్చింది. 4వేల పెన్షన్, నిరుద్యోగభృతి, తులం బంగారం..ఏవీ లేదు.

- మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

ట్రిపుల్ ఆర్‌కు కేటాయించిన నిధులు 1,525 కోట్లు

బడ్జెట్‌లో పీఆర్సీ ఊసెత్తని సర్కారు

- ప్రస్తావనకు రాని 4 డీఏల పెంపు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో కేటాయింపు లపై ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పెదవి విరుస్తున్నారు. ఉద్యోగులకు అనుకూలంగా ఈ బడ్జెట్ లేదని అంటున్నారు. పీఆర్సీ గురించి బడ్జెట్‌లో ఎక్కడా ప్రస్తావించలేదని పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏల పెంపు ప్రస్తావన కూడా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల రిటైర్‌మెంట్ సెటిల్‌మెంట్లు, పీఆర్సీకి నిధులు మంజూరు చేసిన దాఖలాలు కనిపించడం లేదని తెలిసింది.



ఆటో కార్మికులకు మొండిచెయ్యి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో కార్మికులకు మొండి చేయిచ్చింది. ఏటా ఆర్థికసాయం అందజేస్తానన్న ప్రభుత్వం.. దానికోసం బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయలేదు. దీంతో ప్రభుత్వం మరోసారి తమను నమ్మించి మోసం చేసిందని ఆటో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని, ఆటో కార్మికులను ఆదుకోవడానికి ఓలా, ఉబెర్ తరహాలో యాప్‌ను తీసుకొస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఆర్థిక సాయం చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఏప్రిల్ నుంచి వీటిని అమలు చేస్తామనే ప్రభుత్వం ప్రకటించింది. ఈ విషయాన్ని ఎన్నికల మ్యానిఫెస్టోలోనూ ప్రకటించారు. వాటికోసం కేటాయింపులు చేయకపోవడంతో ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు.



సాగునీటికి భారీగా నిధుల కోత

- నిరుడు 26,885 కోట్లు.. ప్రస్తుతం 22,301 కోట్లు
- గతంతో పోల్చితే 4,584 కోట్లు తగ్గింపు
- ఓటాన్ అకౌంట్‌తో పోల్చితే 5,723 కోట్లు కోత
- మిషన్ కాకతీయకూ తగ్గింపు
- ప్రాజెక్టుల నిర్వహణ, మెయింటెనెన్స్‌కు సున్నా
- కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టులకు అంతంతే..
- మీడియం ప్రాజెక్టుల్లో కొన్నింటికే పెంపు

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రగతిలో అత్యంత ప్రాధాన్యం కలిగిన సాగునీటి రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధుల కోత విధించింది. గత సంవత్సరం కంటే ఈ బడ్జెట్‌లో రూ.4,584 కోట్లు తగ్గించింది. రాష్ట్ర ఆవిర్భావం నుంచి ఇప్పటివరకు మేజర్, మీడియం, మైనర్ సాగునీటి ప్రాజెక్టులపై మొత్తంగా రూ.1.69 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులకు కేటాయించే నిధుల్లో భారీగా కోత విధించింది. గత సంవత్సరం బడ్జెట్‌లో రూ.26,885 కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్‌లో రూ.22,301 కోట్లు మాత్రమే కేటాయించింది. ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సైతం రూ.28,024 కోట్లు ప్రతిపాదించగా, ఇప్పుడు రూ.5,723 కోట్లు కోత వేయడం గమనార్హం. సాగునీటి రంగానికి సంబంధించిన కేటాయింపులు తీవ్ర నిరాశను మిగిల్చాయి. కేంద్రం ఏఐబీపీ తదితర పథకాల కింద అందిస్తున్న నిధులకు రాష్ట్ర వాటాగా రూ.100 కోట్లు కేటాయించింది. భారీ ప్రాజెక్టులపై కాకుండా, మీడియం ప్రాజెక్టులపై ప్రభుత్వం ఎక్కువగా దృష్టిసారించినట్టు బడ్జెట్ కేటాయింపులను బట్టి అర్థమవుతున్నది.

ఆ మూడు జిల్లాలకే..

సాగునీటి రంగానికి సంబంధించిన బడ్జెట్ కేటాయింపుల్లో నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం జిల్లాల్లోని ప్రాజెక్టులకే ప్రభుత్వం పెద్ద పీట వేసింది. మహబూబ్‌నగర్ జిల్లాలోని పాలమూరు-రంగారెడ్డి, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు, బీమా, కల్వకుర్తి, జూరాల లింక్ కెనాల్, సంగంబండ ప్రాజెక్టు పనులకు నిధులు కేటాయించింది. నల్లగొండ జిల్లాలోని ఎస్ఎల్‌బీసీ, డిండి, మూసీ, ఎఎమ్ఆర్‌పీ లిఫ్ట్ స్కీములకు, ఖమ్మం జిల్లాలో సీతారామ, వైరా, ఎస్సారెస్పీ ఫేజ్- 2 ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించింది. ఇతర అనేక ప్రాధాన్యాలు కలిగిన ప్రాజెక్టులకు నిధుల కేటాయింపులో మొండి చెయ్యి చూపింది. దేవాదుల, వరదకాలువ, చిన్నకాళేశ్వరం, కుప్తితోపాటు పలు ప్రాజెక్టులకు మాత్రమే కొద్దిమేర నిధులు విదిల్చింది. కాళేశ్వరం, ప్రాణహిత-చేవెళ్ల, సీతారామ, మత్తడి, ర్యాలివాగు, జగన్నాథ్‌పూర్, కాళేశ్వరం, నిజాంసాగర్ ఆధునికీకరణకు నిధుల కేటాయింపుల్లో భారీగా కోత విధించింది.

ప్రాజెక్టుల నిర్వహణకు నిల్

తెలంగాణ సాగునీటి రంగంలో చెరువులు అత్యంత కీలకపాత్ర పోషిస్తాయి. దీంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పునరుద్ధరణ, పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. మిషన్‌కాకతీయ పథకాన్ని చేపట్టి ఏటా బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించింది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం మైనర్ ఇరిగేషన్‌కు కేటాయించే నిధులను గమనిస్తే ఎక్కువగా తగ్గించింది. గత బడ్జెట్‌లో రూ.1,011.14 కోట్లు కేటాయించగా, ప్రస్తుతం రూ.585.63 కోట్లు కేటాయించారు. అందులో మిషన్ కాకతీయకు రూ.273 కోట్లు మాత్రమే కేటాయించింది. మేజర్, మీడియం, మైనర్ ప్రాజెక్టుల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ కోసం గత ప్రభుత్వం జీవో 45 ద్వారా ప్రతి బడ్జెట్‌లో రూ.250 కోట్లకుపైగా కేటాయిస్తూ రాగా, ప్రస్తుత బడ్జెట్‌లో భారీగా కోత విధించారు. కేవలం రూ.50 కోట్లు కేటాయించింది. చిన్నలిఫ్ట్ స్కీముల నిర్వహణకు సంబంధించిన బడ్జెట్‌లో కూడా కోత విధించింది.

గోదావరి బేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

ప్రాజెక్టు	నిధులు
కాళేశ్వరం	1,676.46
సీతారామ	687.81
ఎల్లంపల్లి	349.66
ఎస్సారెస్పీ వరదకాలువ	265.21
ప్రాణహిత-చేవెళ్ల	248.99
దేవాదుల	245.00
లోయర్‌పెన్‌గంగ	133.83
చిన్నకాళేశ్వరం	200.00

కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులకు కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)

పాలమూరు-రంగారెడ్డి	1,285.00
కల్వకుర్తి	715.00
డిండి	300.00
నెట్టెంపాడు	105.00
ఎస్ఎల్‌బీసీ	800.00
కోయిల్‌సాగర్	429.86
నాగార్జునసాగర్ లిఫ్ట్	500.00
సంగంబండ	188.07

దళితబంధు ఔట్.. అభయహస్తం మాయం

- బడ్జెట్‌లో కేటాయింపులే లేని పథకాలు
- ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ తిలోదకాలు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): దళితుల సర్వతోముఖాభివృద్ధికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపొందించి అమలుచేసిన దళితబంధు పథకానికి కాంగ్రెస్ సర్కార్ స్వస్తి పలికింది. అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12లక్షలు ఇస్తామన్న వాగ్దానాన్ని సైతం తుంగలో తొక్కింది. అటు దళితబంధు పథకానికి, ఇటు అంబేద్కర్ అభయహస్తం పథకానికి తాజా బడ్జెట్‌లో రూపాయి కూడా కేటాయించలేదు. ఎస్సీ కార్పొరేషన్‌కు సైతం నిధుల కేటాయింపు బడ్జెట్ పద్దులో కానరాలేదు.

సొంత వ్యాపారాలు, తెలిసిన, నచ్చిన ఉపాధి మార్గాన్ని ఎంచుకొని జీవించడానికి నిరుపేద దళిత కుటుంబాలకు ఎలాంటి షరతులు లేకుండా, బ్యాంకు లింకేజీ లేకుండా ఏకమొత్తంగా రూ.10లక్షల నగదును అందించే సీఎం దళిత్ ఎంపవర్‌మెంట్ పేరిట దళితబంధు పథకాన్ని గత ప్రభుత్వం ప్రారంభించిన సంగతి తెలిసిందే. తొలివిడతలో రాష్ట్రవ్యాప్తంగా 44 వేల దళిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. అందుకు రూ.4400 కోట్ల నిధులను వెచ్చించారు. ఆ పథకానికి 2023-24 బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించారు. హుజూరాబాద్ మినహాయించి నియోజకవర్గానికి 1500 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 118 నియోజకవర్గాల్లో మొత్తంగా 17,700 కుటుంబాలకు దళితబంధు పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేయాలని నిర్ణయించారు. అందుకు 17,700 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. జీహెచ్ఎంసీ పరిధిలోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా పలువుర్ని లబ్ధిదారులను ఎంపిక చేసి ఒక విడత ఆర్థిక సాయాన్ని కూడా అందజేశారు. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ పథకానికి నిధులేవీ కేటాయించకపోవడం గమనార్హం. దళిత్ ఎంపవర్‌మెంట్ స్కీమ్‌కు బడ్జెట్ పద్దులో రూ.2వేల కోట్లను కేటాయించినట్టు చూపినా అవి దళితబంధు పథకానికి కాదని ఎస్సీ సంక్షేమ ఉన్నతాధికారులు వెల్లడించడం గమనార్హం.

అభయహస్తం ఉత్తముచ్చటే..

అధికారంలోకి వస్తే దళితబంధు తరహాలో అంబేద్కర్ అభయహస్తం పేరిట ఒక్కో దళిత కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. రాబోయే బడ్జెట్లలో నిధులను కేటాయించి ఆ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపింది. చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభలో ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. ప్రస్తుత బడ్జెట్‌లో ఆ పథకం ఊసే లేకుండా పోయింది. దీంతో ఉన్న దళితబంధుతో పాటు, అంబేద్కర్ అభయహస్తం పథకం కూడా ఉత్త ముచ్చటగానే మారింది.

దళితబంధుకు కేసీఆర్ నిధులివ్వలే

- బడ్జెట్‌లో రూ.17,700 కోట్లు కేటాయింపు
- అయినా రూపాయి కూడా విడుదల చేయలే
- ఇప్పుడు దళితుల గురించి మాట్లాడుతారా?
- డిప్యూటీ సీఎం భట్టి ఆగ్రహం



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బడ్జెట్‌లో రూ. 17,700 కోట్లను దళితబంధు కోసం కేటాయించిన గత ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిందని డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఆరోపించారు. ఈ బడ్జెట్‌లో దళితబంధు ప్రస్తావన లేదన్న కేసీఆర్ మాటలు చూస్తుంటే నవ్వాలో? ఏడ్వాలో అర్థం కాకుండా ఉందని ఎద్దేవా చేశారు. శాసనసభలో బడ్జెట్ సమర్పించిన తర్వాత అసెంబ్లీ మీడియా హాల్-1లో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను గత ప్రభుత్వం మాదిరిగా మళ్లించబోమని పేర్కొన్నారు. బ్యాక్‌లాగ్ నిధులను కూడా కలుపుకొని దళిత, గిరిజనులకు ఎస్సీ ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు పెడతామని తెలిపారు. సంక్షేమం,అభివృద్ధికి సమభాగంలో నిధులు పెడిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నడూ లేని విధంగా బడ్జెట్‌లో రూ.10 వేల కోట్లు కేటాయించినట్టు వివరించారు. హైదరాబాద్‌లో ఉద్యోగ వ్యవస్థను, ఎకో సిస్టం అభివృద్ధికి కావాల్సిన నిధులను పెట్టుబడిగా పెడుతూ ప్రభుత్వం ముందుకు వెళ్తున్నదని తెలిపారు. ఓ విజన్‌తో హైదరాబాద్‌లో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు.

దశ దిశ లేని బడ్జెట్

- అంతా ఆత్మస్తుతి, పరనింద
- రాష్ట్రానికి ఇది తిరోగమనమే
- మహాలక్ష్మికి మహా నిరాశ
- ఏకకాలంలో రుణమాఫీకి నిధులేవి ?
- ఆరు గ్యారంటీల్లేవ్.. అంకెల గారడే
- రాష్ట్ర బడ్జెట్‌పై హరీశ్‌రావు



గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పూర్తిగా ఆత్మస్తుతి, పరనిందగా ఉందని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు అన్నారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్ దశ దిశ లేకుండా ఉందని, ఇది రాష్ట్రాన్ని తిరోగమన దిశలో నడిపే బడ్జెట్ అని అభివర్ణించారు. ఏడాదిలో 2 లక్షలు ఉద్యోగాల ప్రస్తావనే లేదని, ఆరుగ్యారంటీలను పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని నిందించారని, భట్టి 57 వేల కోట్లు అప్పు తెస్తామన్నారని.. ఇది బీఆర్ఎస్ ప్రభుత్వం తెచ్చినదానికంటే 17 వేల కోట్లు ఎక్కువ అని చెప్పారు. మహాలక్ష్మి పథకంపై బడ్జెట్ మహా నిరాశ కలిగించిందని, కోటి మంది మహిళలు నెలకు రూ. 2500 కోసం ఎదురుచూస్తున్నారని, ఎనిమిది నెలల్లో మహిళలకు రూ.20వేల కోట్లు ప్రభుత్వం బకాయి పడ్డదని చెప్పారు. ఆసరా పింఛను రూ. 4 వేలు ఇస్తామని బాండు పేపర్ మీద రాశారని, మరి బడ్జెట్లో ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు, స్కూటీలు ఇస్తామన్నారని వాటి ప్రస్తావన ఏదని నిలదీశారు. కొత్త రేషన్ కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ప్రస్తావన కూడా లేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని, చేనేత కార్మికులకు గుండు సున్నా చూపారని ఆవేదన వ్యక్తంచేశారు.

తాగుబోతుల తెలంగాణ చేస్తరా ?

> గత బడ్జెట్‌లో ఎక్సైజ్ ఆదాయం 18,470 కోట్లు ఉంటే, భట్టి ప్రతిపాదించింది 25,617 కోట్లు. 7,147 కోట్లు ఎక్కువ పెంచుతామంటే తాగుబోతుల తెలంగాణ చేస్తరా ? బెల్ట్ షాపులు బంద్ చేస్తామని చెప్పి, గల్లీకో బెల్ట్ షాప్ పెడతరా ?
>
> - మాజీ మంత్రి హరీశ్‌రావు

విజన్‌లేని సర్కార్

ప్రభుత్వానికి ఏ రంగంలోనూ విజన్ లేదని హరీశ్ రావు విమర్శించారు. దేశంలో తలసరి ఆదాయంలో 13 స్థానంలో ఉన్న తెలంగాణను తాము నంబర్ 1 స్థానంలో తీసుకొచ్చామని చెప్పారు. తెలంగాణ తలసరి ఆదాయం 3,47,299 రూపాయలు అయితే, దేశ తలసరి ఆదాయం 1,83,236 మాత్రమేనని అన్నారు. రాష్ట్ర పొరుగు తలసరి ఆదాయం దేశ తలసరి ఆదాయానికంటే రూ.1,64,063 ఎక్కువ అని, ఇది పదేండ్ల బీఆర్ఎస్ పరిపాలన ఫలితమని తెలిపారు. దేశం జీడీపీ కంటే 2 శాతం ఎక్కువ ఉందని, తెలంగాణ వృద్ధి రేటు 11.9 శాతం కాగా దేశవృద్ధి రేటు 9.1 శాతమేనన్నారు. బడ్జెట్లో ఏదో చెప్పినంత మాత్రాన నిజాలు నిజం కాకుండా పోతాయా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాడు గ్యారెంటీల గారడీ.. నేడు అంకెల గారడీ

> భట్టి విక్రమార్క బడ్జెట్ అన్నివర్గాలను తీవ్ర నిరాశపర్చింది. బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలు నీరు కారిపోయాయి. సంక్షేమం సన్నగిల్లింది.. అభివృద్ధి అగమ్యగోచరమైంది. ఎన్నికలప్పుడు గ్యారెంటీల గారడీ, ఇప్పుడేమో అంకెల గారడీ.
>
> - మాజీ మంత్రిహరీశ్‌రావు

రుణమాఫీకి 15వేల కోట్లే

పంద్రాగస్టు కల్లా ఏకకాలంలో రైతు రుణమాఫీ అని దేవుళ్ల మీద ఒట్టు పెట్టారని, రూ.31వేల కోట్లు మాఫీ అని చెప్పి బడ్జెట్లో రూ.15,470 కోట్లు మాత్రమే కేటాయించారని హరీశ్‌రావు విమర్శించారు. మైనారిటీలకు 4వేల కోట్లని మ్యానిఫెస్టోలో చెప్పి రూ. 3 వేల కోట్లే కేటాయించారని, ప్రతి సంవత్సరం బీసీలకు 20 వేల కోట్లు ఇస్తామని చెప్పి 9 వేల కోట్లు మాత్రమే కేటాయించారని మండిపడ్డారు. ఇరిగేషన్‌కు రూ.22,301 కోట్లే కేటాయించారని చెప్పారు. దళితబంధు 10 లక్షల నుంచి 12 లక్షలకు పెంచుతామని ప్రస్తావన లేకుండా చేశారని విమర్శించారు. స్టాంప్స్ డ్యూటీ ఆదాయాన్ని 18,228 కోట్లు ప్రతిపాదించారని, గతం కంటే 4 వేల కోట్లు ఎక్కువ వస్తాయని ప్రతిపాదించారని, భూముల విలువ, రిజిస్ట్రేషన్, వస్తువుల భారం పెంచుతామని చెప్పకనే చెప్పారని మండిపడ్డారు.

రాజీనామాకు సిద్ధమా...?

> ఒక్క డాక్టర్ పోస్టును భర్తీ చేయలేదని భట్టి ఆరోపించారు. మా హయంలో వైద్య ఆరోగ్య శాఖలో 30 వేల పోస్టులను భర్తీ చేశాం. భర్తీ చేసినట్టుగా నేను నిరూపిస్తా, నిరూపించమంటే భట్టి రాజీనామాకు సిద్ధమా?
>
> - మాజీ మంత్రిహరీశ్‌రావు

గ్రాంట్ ఇన్ ఎయిడ్ సాధ్యమా..?

గ్రాంట్ ఇన్ ఎయిడ్ విషయానికి వస్తే రూ.9729 కోట్లు గత సంవత్సరం వస్తే, నిన్ననే కేంద్రం నిధులు ఇవ్వలేదని తీర్మానం చేశారు. బడ్జెట్‌లో 21,636 కోట్లు పెట్టారని.. ఇంత ఎక్కడి నుంచి వస్తాయని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్, బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

గొర్రెల పంపిణీకి గుండు సున్నా

- విజయ మెగా డెయిరీకి రూపాయి లేదు
- చేపల పంపిణీకి అంతంతే నిధులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చింది. ఇప్పటికే లబ్ధిదారులు చెల్లించిన డీడీలను తిరిగి ఇచ్చేస్తుండగా, బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ప్రభుత్వం ఈ పథకాన్ని నిలిపివేసినట్టేననే అనుమానాలు మరింత బలపడుతున్నాయి. పాల ఉత్పత్తికి అనుగుణంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మెగా డెయిరీని నిర్మించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ డెయిరీ మెయింటెనెన్స్‌కు నిధులు కేటాయించకపోవడం విమర్శలకు దారితీస్తున్నది. మత్స్యకారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు గత ప్రభుత్వం చేపట్టిన ఉచిత చేపపిల్లల పంపిణీపై కాంగ్రెస్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. ఈ ఏడాది చేప పిల్లల పంపిణీకి రూ.100 కోట్లు అవసరం కాగా రూ.20 కోట్లే కేటాయించింది. మత్స్యకారుల ఇన్సూరెన్స్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. వెటర్నరీ కాలేజీల్లో మౌలిక వసతుల కల్పనలోనూ వివక్ష చూపించింది. సిద్దిపేట కాలేజీకి నయా పైసా కేటాయించని ప్రభుత్వం.. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ వెటర్నరీ కాలేజీకి రూ.6.50 కోట్లు కేటాయించింది. పెద్దేముల్‌లోని ఫిషరీస్ కాలేజీకి పైసా కేటాయించలేదు.

మద్యం ప్రియులే ఆదుకోవాలి!

- రూ.25,617 కోట్లకు మద్యం అమ్మకాల పెంపు
- ఎక్సైజ్ నుంచి రూ.5,318 కోట్లు 'అదనపు' లక్ష్యం
- మరింత తాగించడం.. లేదా ధరలు పెంచడం?
- 25 శాతం మేర పెరగనున్న మద్యం వినియోగం
- ఇప్పటికే ధరలు పెంచేందుకు సర్కారు యత్నం

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మద్యం ఆదాయాన్ని అదనంగా మరో రూ.5,318 కోట్లకు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పథకాల అమలుకు ప్రభుత్వం తప్పనిసరిగా మందుప్రియులపైనే ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చింది. గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాబడి విభాగాల్లో ఎక్సైజ్‌శాఖలోని ఒక్క మద్యం విభాగం నుంచే రూ.25,617 కోట్ల నిధులను ఆశిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. గత ప్రభుత్వం కంటే ఎక్సైజ్ నుంచి రూ.5,318 కోట్లు 'అదనపు ఆదాయం' రావడమే లక్ష్యంగా పెట్టుకున్నది.

25% పెరగనున్న మద్యం వినియోగం

ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే కనీసం 25 శాతం అదనంగా మద్యం అమ్మకాలు చేయాల్సి ఉన్నది. దీంతో మరింత తాగించడం లేదా ధరలు పెంచటం ఒక్కటే మార్గంగా కనిపిస్తున్నది. ఇప్పటికే ఒకదఫా మద్యం ధరలు పెంచేందుకు సర్కారు ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తున్నది. అదనపు ఆదాయం సమకూర్చుకునే క్రమంలోనే వాస్తవ తక్కువ. బల్క్ మద్యం ఆరోపణలున్న కొన్ని కంపెనీలకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనిపై బీఆర్ఎస్ పోరాటం చేయటంతో అనుమతులు తాత్కాలికంగా నిలిపివేసింది. దీంతో మరో ప్రణాళికలో భాగంగా 20 - 25 శాతం మద్యం అమ్మకాలు పెంచేలా, ప్రభుత్వ లక్ష్యానికి తగ్గట్టుగా సిబ్బందికి టార్గెట్లు సైతం ఇచ్చినట్టు తెలిసింది.



సంక్షేమ పథకాల కోసం ధరల పెంపు?

సర్కారుకు వస్తున్న ఆదాయ వనరుల్లో మద్యం అమ్మకాలే ప్రధానం. మద్యం అమ్మకాలు, ట్యాక్స్‌ల ద్వారా ఏటా సుమారు రూ.35 వేల కోట్ల వరకు సర్కారుకు ఆదాయం సమకూరుతుంది. అయితే ఈ లక్ష్యాన్ని రూ.45 వేల కోట్లకు పెంచారు. ఎక్సైజ్‌శాఖ ఆదాయ వనరుల సమీకరణపై ఏర్పడిన మంత్రివర్గ ఉపసంఘం నిధులు ఎలా పెంచాలనే సుదీర్ఘంగా చర్చించింది. ఒక్కో మద్యం షాపునకు రూ.50 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించినట్టు కూడా సమాచారం. దీంతో మద్యం అమ్మకాలు పెంచడం అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు. మద్యం, ఇతర వ్యాట్‌లు కలుపుకొని 2022లో రూ.32 వేల కోట్లు, 2023లో రూ.35 వేల కోట్లు ఆదాయం వచ్చింది. ప్రభుత్వం ఈ లక్ష్యాన్ని అదనంగా రూ.10 వేల కోట్లకు పెంచి.. రూ.45 వేల కోట్లు రాబట్టాలని చూస్తున్నది. ఈ క్రమంలో 25 శాతం మద్యం ధరలు పెంచాలని కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. త్వరలోనే ధరలు పెరిగే అవకాశం ఉన్నదని ఎక్సైజ్ వర్గాలు తెలిపాయి.

నాడు బీఆర్ఎస్‌ను బద్నాం చేసిన కాంగ్రెస్!


నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఓ క్రమ పద్ధతిలో మద్యం అమ్మకాలు చేపట్టినా.. టార్గెట్ పెట్టిందని, మద్యం అమ్మకాలపై కాంగ్రెస్, నాటి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి గగ్గోలు పెట్టారు. అలాంటిది ఈ ఏడాది మద్యం అమ్మకాల ద్వారా ఎన్నడూ లేనివిధంగా రూ.45 వేల కోట్లు మేరకు ఆదాయం పొందాలని లక్ష్యంగా పెట్టుకున్నది. నాడు బీఆర్ఎస్‌ను విమర్శించిన వారు.. ఇప్పుడు చేస్తున్నది ఏమిటి? అని ప్రభుత్వాన్ని విశ్లేషకులు నిలదీస్తున్నారు.

రోడ్లకు భారీగా తగ్గిన కేటాయింపులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రోడ్లకు కేటాయించే బడ్జెట్‌లో ఈసారి భారీగా కోతపడింది. గత ఏడాది రూ. 8,833 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.5,790 కోట్లే కేటాయించారు. మేజర్ జిల్లా రోడ్లకు రూ. 298.86 కోట్లు, కోర్ నెట్‌వర్క్ రోడ్లకు రూ.100 కోట్లు, రోడ్ సేఫ్టీకి రూ.2.62 కోట్లు, రేడియల్ రోడ్లకు రూ. 57 కోట్లు, ఇతర రోడ్లకు రూ.10 కోట్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాల రోడ్లకు రూ. 50 కోట్లు, గ్రామీణ రోడ్లకు రూ.90 కోట్లు, లెఫ్ట్ వింగ్ ఎక్స్‌ట్రీమిజమ్ పనులకు రూ.4 కోట్లు, రైల్వే సేఫ్టీ వర్క్స్ కింద ఆర్‌వోబీలకు రూ.120 కోట్లు, ఆర్వోబీలు, ఆర్‌యూబీలకు రూ.8.45 కోట్లు, ఇతర రోడ్లు, బ్రిడ్జిలకు కలిపి రూ. 3031.47 కోట్లు కేటాయించారు. ఇక, ట్రిపుల్ ఆర్‌కు రూ.1,525 కోట్లు కేటాయించారు.

పల్లెప్రగతిపై నీలినీడలు

- పంచాయతీరాజ్ శాఖకు తగ్గిన కేటాయింపులు
- పెంచుతున్న పెంపు, మహిళా పథకం హామీ అటకెక్కినట్లేనా?



పంచాయతీరాజ్ శాఖకు కేటాయింపులు

ఆర్థిక సంవత్సరం	నిధులు(కోట్లలో)
2022-23	రూ.21,887
2023-24	రూ.30,976
2024-25	రూ.29,816

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): పెరిగిన జనాభాకు అనుగుణంగా పంచాయతీరాజ్ శాఖకు బడ్జెట్ కేటాయింపులను పెంచాల్సింది పోయి కాంగ్రెస్ సర్కారు ఈ ఏడాది బడ్జెట్‌లో తగ్గించి చిన్నచూపు ప్రదర్శించింది. నిరుడు బీఆర్ఎస్ ప్రభుత్వ కేటాయింపుల కంటే రూ.1,000 కోట్లు తక్కువగా ప్రతిపాదించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ శాఖ పట్ల వివక్షను చాటుకున్నది. ఆసరా పింఛన్ సొమ్మును రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంపు, మహిళలకు నెలనెలా 2,500 ఆర్థిక సాయం హామీలకు బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు చేయకపోవడంతో ఆ హామీలపై ఉమ్మారుమనిపించారనిపిస్తున్నది. దాదాపు 10 లక్షల మందికి కొత్త పింఛన్లపైనా ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులు చేయలేదు. వడ్డీలేని రుణాలకు రూ.1,302 కోట్లు కేటాయించగా, మహిళలకు రూ.20 వేల కోట్ల రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నది. అటు.. బడ్జెట్‌లో మున్సిపల్ శాఖకు స్వల్పంగానే కేటాయింపులను పెంచారు. 2022-23లో రూ.8,029 కోట్లు, 2023-24లో రూ.11,372 కోట్లు కేటాయించగా, 2024-25లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.15,594 కోట్లే కేటాయించింది.



"రాష్ట్ర బడ్జెట్‌లో అన్నీ అభూతకల్పనలు.. అంకెల గారడీలు తప్ప ఏమీ లేదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ ప్రస్తావనే లేదు. ఆటో డ్రైవర్లకు రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మోసం చేశారు. ఆదాయం పెంచే మార్గాలు, నిధుల సమీకరణపై స్పష్టతలేదు." - కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పాతబస్తీ మెట్రోకు కేటాయించిన నిధులు **500 కోట్లు**

ఆరింటికీ 'నో గ్యారెంటీ'

ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో దక్కని భరోసా

కొన్నింటి అమలు ఊసే లేని వైనం • అమలయ్యే వాటికీ నిధుల కొరత

100 రోజుల్లో అమలుకు హామీ • ఏడు నెలలు దాటినా అతీగతీ కరువు

హైదరాబాద్, జూలై 25(నమస్తే తెలంగాణ): ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు బడ్జెట్‌లో భరోసా దక్కలేదు. ఆశించిన స్థాయిలో నిధులు దక్కలేదు. కొన్నింటి అమలు ఊసే లేకపోగా, మరికొన్నింటికి అరకొరగా నిధులు కేటాయించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో 13 హామీలు ఉన్నాయి. ప్రస్తుతం కేవలం నాలుగు హామీలనే అమలు చేస్తున్నది. అన్నింటినీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే అమలు చేస్తామని హామీ ఇచ్చింది. కానీ ఏడు నెలలు గడిచినా అతీగతీ లేదు. ఈ బడ్జెట్‌లో రైతుభరోసా, కూలీలకు భరోసా, వరి పంటకు బోనస్, చేయూత, ఇందిరమ్మ ఇండ్ల పథకం, ఇంటర్నేషనల్ స్కూల్ పథకాన్ని అమలు చేసేందుకు నిధులు కేటాయించింది.



'మహాలక్ష్మి'లో మహిళలకు సాయం ఊసేలేదు

మహాలక్ష్మి గ్యారెంటీ పథకంలో మూడు హామీలున్నాయి. వీటిలో రెండింటిని అమలు చేస్తున్నది. మరొకటైన మహిళలకు ప్రతినెలా రూ.2,500 ఆర్థికసాయం హామీపై ప్రభుత్వం బడ్జెట్‌లో ఎలాంటి ప్రస్తావన చేయకపోగా, ఒక్కపైసా కేటాయించలేదు. దీంతో ఈ పథకం అమలును ప్రభుత్వం పక్కకు పెట్టినట్టే.

రైతుభరోసా ఏది?

రైతుకూలీలకు భరోసా పథకంలో మూడు గ్యారెంటీలు ఉండగా ఇప్పటి వరకు ఏ ఒక్కటీ అమలు చేయలేదు. తాజాగా బడ్జెట్‌లో మూడు హామీల అమలుకు నిధులు కేటాయించింది. ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా, వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేల చొప్పున భరోసా, వరి పంటకు క్వింటాకు రూ.500 బోనస్‌ను అమలు చేయనున్నది. ఈ మూడు హామీలకు సుమారు రూ. 32 వేల కోట్ల నిధులు అవసరం కాగా, ప్రభుత్వం మాత్రం కేవలం రూ.18 వేల కోట్లు మాత్రమే కేటాయించింది.

గృహజ్యోతికి రూ.2,418 కోట్లు

గృహజ్యోతి పథకం కింద ప్రతి కుటుంబానికి ప్రభుత్వం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందిస్తున్నది. ఈ పథకం కోసం తాజా బడ్జెట్‌లో రూ.2,418 కోట్లు కేటాయించింది.

ఇందిరమ్మ పథకంలో రెండు మాయం

ఇందిరమ్మ ఇండ్ల గ్యారెంటీ పథకంలో ఇంటి నిర్మాణానికి స్థలం ఉన్న వారికి రూ.5 లక్షలు ఇస్తామన్న ప్రభుత్వం ఇంటి స్థలం లేని వారికి స్థలంతోపాటు రూ.5 లక్షలు, ఉద్యమకారులకు రూ.250 గజాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చింది. తాజా బడ్జెట్‌లో స్థలం ఉండి ఇండ్లు నిర్మించుకునేందుకు మాత్రమే రూ.5 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించింది. మొత్తం 4.5 లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,500 కోట్ల నిధులు అవసరం కాగా, ప్రభుత్వం కేవలం రూ.9,184 కోట్లు కేటాయించింది. ఇక మిగిలిన రెండు హామీలను ప్రభుత్వం పక్కన పెట్టేసింది.

యువ వికాసం భరోసా మిస్

ఈ గ్యారెంటీలో విద్యార్థులకు విద్యాభరోసా కార్డు ద్వారా రూ.5 లక్షలు ఇవ్వడంతో పాటు ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో తొలి హామీని విస్మరించగా, ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణానికి నిధులు కేటాయించింది.

చేయూత అందేదెలా?

చేయూత గ్యారెంటీ పథకంలో సామాజిక పింఛన్లను రూ.4 వేల పెంపుతోపాటు రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచుతామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. వీటిలో ఆరోగ్యశ్రీ పరిమితి పెంపును అమలు చేస్తున్నది. సామాజిక పింఛన్ లబ్ధిదారులు, పెండింగ్ దరఖాస్తులు కలిపితే ఏటా రూ.27 వేల కోట్ల నిధులు అవసరం అవుతాయి. ప్రభుత్వం మాత్రం బడ్జెట్‌లో కేవలం రూ.14 వేల కోట్లనే కేటాయించింది. దీంతో అర్హులైన అందరికీ రూ.4 వేల చేయూత పింఛన్ అమలవుతుందా? లేదా? అనేది ప్రశ్నగా మారింది.



బారెడు మూసీకి మూరెడు నిధులు

- లక్షన్నర కోట్ల ప్రాజెక్టుకు 1,500 కోట్లే కేటాయింపు
- భూసేకరణకూ సరిపోని నిధులు
- రేవంత్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కరువు

హైదరాబాద్ సిటీబ్యూరో/ప్రధాన ప్రతినిధి, జూలై 25 (నమస్తే తెలంగాణ): మూసీ అభివృద్ధిపై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలన్నీ మూసీలో మురుగులాంటివేనని తేలిపోయింది. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.లక్షన్నర కోట్లయితే బడ్జెట్‌లో కేటాయించింది మాత్రం రూ.1,500 కోట్లే. ఖర్చు బేసుడు దేవుడెరుగు.. కనీసం కేటాయింపుల్లోనూ అత్తెసరు నిధులతో లెక్కలు చూపించింది. ఇక లెక్కలు తేలి, పనులు మొదలుపెట్టాలంటే బారెడున్న మూసీ సుందరీకరణ.. మూరెడు నిధులతో ఎలా సాధ్యం అవుతుంది? అన్న ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. రూ.1,500 కోట్లు 56 కిలోమీటర్ల మేర భూసేకరణకు కూడా సరిపోవని అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఇప్పటికే ఆర్థిక రంగ సంస్థలు, ప్రతినిధులతో సంప్రదింపులు చేస్తున్న ప్రభుత్వం.. అప్పులు తెచ్చి మూసీని మెరిపించాలని భావిస్తున్నది. ఇప్పటికే పలు సంస్థలతో మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు సంప్రదింపులు జరపటం గమనార్హం.

తలలు పట్టుకుంటున్న అధికారులు

55 కిలోమీటర్ల పొడవునా మూసీ నదికి ఇరువైపులా రహదారి నడుమ దారులు, అందమైన పార్కులు, ఐటీ టవర్లు అంటూ గొప్పలు చెప్పగా, కేటాయించిన బడ్జెట్ చూసి మూసీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. మూసీ ప్రక్షాళన కోసం అధికారులు నదికి ఇరువైపులా సామాజిక ఆర్థిక సర్వే నిర్వహించారు. మొత్తం 12 వేలకు అక్రమ నిర్మాణాలను గుర్తించింది. వీటన్నింటిని తొలగించి మూసీని అభివృద్ధి చేయాలంటే భూసేకరణకే భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఓ అంచనా ప్రకారం.. లెక్కతేల్చిన మొత్తం నిర్మాణాల్లో 60 శాతం నిర్మాణాలకు పరిహారాన్ని చెల్లించాలంటే రూ.వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక డీపీఆర్, ప్రాజెక్టు నిర్మాణం, మౌలిక వసతుల పేరిట భారీ మొత్తంలో ఖర్చు తప్పదు. మూసీపై ఉన్న వంతెనల నిర్మాణం, ఆధునీకరణ, ఎస్టీపీల నిర్మాణం, మురుగు నీటి తరలింపు తదితర పనులకు రూ.వేల కోట్లు అవుతాయి. కానీ ప్రభుత్వం కేటాయించిన రూ.1,500 కోట్లు దేనికోసం ఖర్చు చేయాలనే విషయంలో అధికారులకు స్పష్టత లేకుండా పోయింది.

నిధులు ఒక్క శాతమే

ప్రాజెక్టు కోసం అధ్యయనం చేయించిన చెంత భూమి అమలు చేయాలంటేనే కనీసం రూ.400-500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందన్న చర్చ జరుగుతున్నది. మూసీ పేరిట నిధుల సమీకరణపై సీఎం రేవంత్‌రెడ్డి నేరుగా పైకా లాంటి ఆర్థిక సంస్థలతో మంతనాలు జరిపారు. కేంద్రం నుంచి కూడా భారీ నిధులు తెచ్చుకునేలా సంప్రదింపులు చేసి రూ.10 వేల కోట్లు అడిగారు. కానీ, అక్కడి నుంచి రూపాయి కూడా రాకపోవటంతో ప్రభుత్వ ఖజానా నుంచే భారీ మొత్తంలో నిధులను వెచ్చించాల్సి ఉంటుంది. ఆదాయ వనరులకు ఆస్కారం లేకపోవటంతో నిధుల సమీకరణ కష్టంగానే ఉన్నట్టు తెలిసింది.

హైదరాబాద్ అభివృద్ధికి 10 వేల కోట్లు

హైదరాబాద్‌లో ఫ్లైఓవర్లు, ఆర్వోబీల వంటి రవాణా వ్యవస్థల ఏర్పాటుతో పాటు నాలాల పూడికతీత, వరద ముంపు నిర్మూలన పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన హెచ్-సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్)కి రూ.2,675.35 కోట్లు సహా జీహెచ్‌ఎంసీకి రూ.3,075.7 కోట్లు కేటాయించింది. హెచ్‌ఎండీఏకు రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ ఏ ప్రాజెక్టుకు దీనిని ఖర్చు పెట్టాలనేదానిపై అధికారుల్లోనూ స్పష్టత లేదు. హెచ్‌ఎండీఏ తలపెట్టిన ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి రూ.3,800 కోట్లు కావాల్సి ఉన్నందున ఈ కేటాయింపు దేనికి సరిపోతుందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. జలమండలికి ఈ బడ్జెట్‌లో రూ.3,385 కోట్లు కేటాయించగా, ఇందులో అభివృద్ధి పనులకు రూ.1,450 కోట్లు, సుంకిశాల ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు, ఉచిత మంచినీటి పథకానికి రూ.300 కోట్లు వెచ్చించనున్నారు. పేద ప్రజల వైద్య సేవల కోసం కేసీఆర్ ప్రభుత్వం మొదలుపెట్టిన సూపర్‌స్పెషాలిటీ దవాఖానల నిర్మాణానికి అరకొర కేటాయింపులే జరిపారు. మూడు దవాఖానలతో వరంగల్‌లోని దవాఖానల నిర్మాణానికి కలిపి రూ.260 కోట్లు మాత్రమే కేటాయించారు. మొత్తంగా హైదరాబాద్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయించింది.

నిమ్స్ బడ్జెట్ 3 కోట్లే

ప్రస్తావనకురాని గాంధీ, ఉస్మానియా

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 25 (నమస్తే తెలంగాణ): నిత్యం వేల సంఖ్యలో ఓపీ ఉండే ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, ఫీవర్ తదితర హాస్పిటల్స్‌కు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వకపోగా నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) బడ్జెట్‌లో భారీ కోత విధించింది. గత ప్రభుత్వం నిమ్స్‌కు ప్రతి బడ్జెట్‌లో వందల కోట్లు వెచ్చించగా కాంగ్రెస్ సర్కార్ కేవలం రూ.3 కోట్లు కేటాయించింది. కేసీఆర్ సర్కార్ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన సూపర్‌స్పెషాలిటీ దవాఖానలకు రూ.260 కోట్లు కేటాయించింది.

మొరాయించిన 'మెట్రో' బడ్జెట్



హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ ప్రాజెక్టుకు ప్రభుత్వం చేసిన కేటాయింపులు గండ దగోళంగా మారాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కనీసం రూ.3-5వేల కోట్లు కేటాయిస్తేనే పాతబస్తీ మెట్రోతో పాటు రెండో దశ ప్రాజెక్టు పనులను పట్టాలెక్కించేందుకు అవకాశం ఉన్నదని అధికారులు ముందు నుంచి చెప్తూ వస్తున్నారు. పార్లమెంటు ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి పాతబస్తీ మెట్రో పనులకు హడావుడిగా శంకుస్థాపన చేయటంతో ఆ మేరకే కేటాయింపులు ఉంటాయని అంతా ఆశించారు. కానీ గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పాతబస్తీ మెట్రోకు రూ.500 కోట్లు, ఎయిర్‌పోర్టు మెట్రోకు రూ.100 కోట్లు, హెచ్‌ఎంఆర్‌ఎల్‌కు రూ.500 కోట్లు.. ఇలా మొత్తంగా రూ.1100 కోట్లే కేటాయించారు. 78.4 కిలోమీటర్ల రెండో దశ మెట్రో ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.24,042 కోట్లు. దీంతో ఈ కేటాయింపు ఏమూలకు? అని అంతా పెదవి విరుస్తున్నారు. ఈ అరకొర కేటాయింపుతో అధికారులు పనులను ముందుకు తీసుకెళ్లలేని పరిస్థితి ఉన్నందున మెట్రో ప్రాజెక్టుల పనుల్లో మరింత జాప్యం నెలకొనే అవకాశం ఉన్నది.

సలహాలిస్తే తీసుకుంటం



కేసీఆర్ సలహాలు ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటుంది. బీఆర్‌ఎస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి కరీంనగర్ జిల్లాకు ఎన్ని టీఎంసీల నీళ్లు ఇచ్చారో చెప్పాలి. ఏడు నెలల కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు.. పదేండ్ల పాలనపై చర్చకు సిద్ధమా?

- మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపాలనకు అద్దం



ఆర్థిక మంత్రి భట్టి ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ ప్రజాపాలనకు అద్దం పట్టేలా ఉన్నది. ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించారు. కేసీఆర్ తెచ్చుకొట్టే వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం.

-మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి


ముస్లింలకు మోసం

కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ముస్లింలను మోసం చేసింది. అధికారంలోకి వస్తే ముస్లిం సంక్షేమానికి రూ.4 వేల కోట్లు, స్వయం ఉపాధికి రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. బడ్జెట్‌లో కేవలం రూ.3003 కోట్లే కేటాయించడం సరికాదు. సబ్‌ప్లాన్ హామీని కూడా విస్మరించారు.

- ఇంతియాజ్ ఇసాక్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్

ఇంటి గోడలైనా లేస్తయా?

- ఇందిరమ్మ ఇండ్లకు అరకొర కేటాయింపులు
- కావాల్సింది రూ. 22.5 వేల కోట్లు
- కేటాయించింది రూ. 9,184 కోట్లు
- ఇందులో సింహభాగం కేంద్రవాటానే
- ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల సహాయం
- మిగిలిన వర్గాలకు రూ.5 లక్షలు



ఇందిరమ్మ ఇండ్ల పథకం వివరాలివీ..

రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం **4,50,000** ఇండ్లు (ఏడాదికి)

రూ.5లక్షల చొప్పున ఇస్తే కావాల్సింది రూ. **22,500** కోట్లు

ప్రభుత్వం కేటాయించిన నిధులు రూ. **9,184** కోట్లు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం అరకొర నిధులే కేటాయించింది. ఈ ఏడాది రూ.4.5 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ బడ్జెట్ కేటాయింపులు మాత్రం ఏ మూలకూ సరిపోయేలా లేవు. రూ. 22.5వేల కోట్లు కన్నా అధికంగా నిధులు అవసరం కాగా, రూ.9,184 కోట్లే కేటాయించారు. అందులోనూ కేంద్రం ద్వారా వచ్చే నిధులే ఎక్కువ. గత ఏడాది కేసీఆర్ ప్రభుత్వం ఇండ్ల నిర్మాణానికి రూ.10,428 కోట్లు కేటాయించగా, ఈసారి ప్రభుత్వం రూ.9,184 కోట్లతోనే సరిపుచ్చింది. ఈ పథకం కింద ఎస్సీ,ఎస్టీలకు రూ.6 లక్షలు, ఇతరులకు రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్టు ఆర్థిక మంత్రి భట్టివిక్రమార్క తెలిపారు. ఒక్కో నియోజకవర్గంలో 3,500 ఇండ్ల చొప్పున మొత్తం రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇండ్లు నిర్మించనున్నట్టు ప్రకటించారు. రాష్ట్రంలో 4.5 లక్షల ఇండ్లను నిర్మించాలన్నది లక్ష్యం కాగా, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో రెండున్నర లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రెండు లక్షల ఇండ్లు నిర్మించాలని నిర్ణయించారు. ఒక్కో ఇంటికి రూ.5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం చేసినా రూ.22,500 కోట్లు అవసరమవుతాయి. తాజాగా ఎస్సీ, ఎస్టీలకు రూ.6 లక్షల చొప్పున ఇవ్వనున్నట్టు ప్రకటించడంతో దీనికి మరిన్ని నిధులు అవసరం అవుతాయి. పీఎం ఆవాస్ యోజన (అర్బన్), పీఎం ఆవాస్ యోజన (రూరల్) పథకం కింద రూ.7117.55 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని, దీనికితోడు హౌసింగ్‌బోర్డు, హౌసింగ్ కార్పొరేషన్లను హడ్కో ద్వారా రూ.1,150 కోట్లు రుణం ద్వారా సమీకరించనున్నట్టు ప్రభుత్వం బడ్జెట్‌లో వెల్లడించింది.

గొప్పలే.. నిధుల్లేవ్

ఇందిరమ్మ ఇండ్ల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ, ఇందులో రాష్ట్ర ప్రభుత్వ నిధులు నామమాత్రమే. దీన్ని బట్టి పేదల గృహ నిర్మాణంపై ప్రభుత్వ చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. గత ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్రూం ఇండ్లలో అసంపూర్తిగా ఉన్న ఇండ్లను కూడా పూర్తిచేసి పేదలకు కేటాయిస్తామని ఆర్థికమంత్రి తెలిపారు. అయితే, ప్రభుత్వం చెప్తున్న ఈ నాలుగున్నర లక్షల ఇండ్లలో ఆ డబుల్ బెడ్రూం ఇండ్లు కూడా ఉంటాయా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇల్లు కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆర్‌సీసీ కప్పుతో ఒక వంటగది, ఒక టాయిలెట్ తప్పనిసరి. పట్టణ ప్రాంతాల్లో స్థలం లభ్యతను బట్టి గ్రూప్ హౌసింగ్, అపార్ట్‌మెంట్లు నిర్మిస్తారు. గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం స్థలం ఉన్నవారు తమ సొంత స్థలంలో ఇండ్లను నిర్మించుకొనే వెసులుబాటు ఉంటుంది. దీనికోసం ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. అయితే కేంద్రం నుంచి గరిష్ఠంగా రాష్ట్రానికి రెండు లక్షల ఇండ్లే మంజూరయ్యే అవకాశం ఉన్నదని అధికార వర్గాలు చెప్తున్నాయి. అంతేకాదు, కేంద్రం ఒక్కో ఇంటికి రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షలు మాత్రమే ఇస్తుంది. పైగా, లబ్ధిదారుల ఎంపిక కూడా కేంద్ర నిబంధనల ప్రకారమే, కేంద్ర ప్రభుత్వ యాప్‌లోనే చేయాల్సి ఉంటుంది. కేంద్రం రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకొని ఇండ్లను మంజూరు చేస్తుంది. రాష్ట్ర కోఠ్యం ఉండదు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఒక్కో నియోజకవర్గంలో మూడున్నర వేల ఇండ్లు నిర్మిస్తామని ప్రకటించింది. కేంద్ర నిధులను ఉపయోగించుకుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్టు నియోజకవర్గాలవారీగా ఇండ్లను మంజూరుచేసే అవకాశం లేదు.

కల్యాణలక్ష్మి తులం బంగారం తరుగు!

- పెండ్లినాడే అందిస్తామని నాడు హామీ
- బడ్జెట్‌లో కానరాని కేటాయింపులు
- పెండింగ్‌లో 82 వేల దరఖాస్తులు



హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): కల్యాణలక్ష్మి పథకం కింద పేదింటి ఆడబిడ్డల పెండ్లికి రూ.1,00,016 నగదుతో పాటు తులం బంగారం ఇస్తామన్న కాంగ్రెస్ హామీ అటకెక్కింది. అందుకు తాజా బడ్జెట్‌లో చేసిన కేటాయింపులే నిదర్శనం. కల్యాణలక్ష్మి పథకంపై అధికారులు ప్రభుత్వానికి ఇప్పటికే నివేదిక అందజేశారు. కానీ, ప్రస్తుత బడ్జెట్‌లో తులం బంగారాన్ని అందించేందుకు సరిపడా నిధులు కేటాయించలేదు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించిన తరహాలోనే కల్యాణలక్ష్మి పథకం అమలు కోసం ఎస్సీలకు రూ.500 కోట్లు, ఎస్టీలకు రూ.260 కోట్లు, మైనార్టీలకు రూ.450 కోట్లు కేటాయించింది. బీసీలకు గతంలో రూ.2వేల కోట్లు కేటాయించగా, కాంగ్రెస్ ప్రభుత్వం స్వల్పంగా రూ.175 కోట్లు పెంచి రూ.2,175 కోట్లు కేటాయించింది. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల కింద ఏటా దాదాపు 1.50 నుంచి 2 లక్షల మంది ఆడబిడ్డలు ఆర్థిక సాయాన్ని అందుకుంటున్నారు. ఇప్పటికే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలకు సంబంధించి 82 వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో ఈ ఆర్థిక సంవత్సరంలో వచ్చినవే 30 వేలకుపైగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు నగదు సాయానికే సరిపోతాయి. తులం బంగారం హామీ అమలు అటకెక్కినట్టేనని అర్థమవుతున్నది.

ఈ బడ్జెట్ సంతోషదాయకం



రాష్ట్రానికి రూ.6 లక్షల 71 వేల కోట్లు అప్పు ఉన్నా.. రూ.2.91లక్షల కోట్లతో బడ్జెట్ తయారు చేయడం సాహసోపేతం. వ్యవసాయ రంగానికి రూ.72వేల కోట్లు కేటాయింపులు చేయడం రైతాంగంపై ప్రభుత్వానికి ఉన్న సానుకూలతకు అద్దం పడుతున్నది. విద్యా, వైద్యరంగాలకు మరికొంత కేటాయింపులు పెంచాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. అసంఘటిత రంగాన్ని ఆదుకోవడానికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి.

-కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే

కేటాయింపులను స్వాగతిస్తున్నాం



వ్యవసాయం, దళిత, గిరిజన, విద్య, వైద్యరంగాలకు కేటాయింపులను స్వాగతిస్తున్నాం. ఇండ్ల నిర్మాణానికి బీసీలకు రూ.5 లక్షలు, దళితులకు రూ.6 లక్షలు , నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తామని ప్రకటించి రూ.8424 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇండ్ల నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. మహిళలకు వడ్డీలేకుండా రూ.2లక్షల ఆర్థిక సాయం ఇవ్వాలి

- తమ్మినేని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి

బాబు టూర్ ఎఫెక్ట్.. ఏపీ బకాయి మాఫ్?

- అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దును సున్నాగా చూపిన సర్కార్
- అనుమానం వ్యక్తంచేస్తున్న ఆర్థికరంగ నిపుణులు

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు రాష్ట్ర పర్యటన ప్రభావం బడ్జెట్‌పై కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నదని నిపుణులు విశ్లేషిస్తున్నారు. 2023-24 బడ్జెట్ అంచనాల్లో అంతర్రాష్ట్ర సర్దుబాట్లు పద్దులో రూ.17,828 కోట్లు రావాల్సిన ఉన్నాయని సర్కార్ పేర్కొన్నది. ఈ మొత్తం ఏపీ విద్యుత్తు సంస్థల నుంచి తెలంగాణకు రావాల్సి ఉన్నది. వీటితోపాటు ఉమ్మడి ఆస్తుల నిర్వహణ కింద రాష్ట్రానికి ఏపీ నుంచి రావాలసినవి రూ.405 కోట్లు ఉన్నాయి. 2014-15 ఆర్థిక సంవత్సరంలో కేంద్రం తెలంగాణకు ఇవ్వాల్సిన సీఎస్‌ఎస్ నిధులు రూ.495 కోట్లను పొరపాటున ఏపీ ఖాతాలో జమచేసింది. ఈ మొత్తాన్ని రాబట్టేందుకు కేసీఆర్ సర్కార్ తీవ్ర ప్రయత్నాలు చేసింది. 2024-25 బడ్జెట్‌లో ప్రభుత్వం అంతర్రాష్ట్ర సర్దుబాట్ల పద్దును సున్నాగా పేర్కొన్నది. దీంతో ఏపీ నుంచి వివిధ శాఖలు, పద్దుల కింద రావాల్సిన బకాయిలను సర్కార్ మాఫ్ చేసినట్టే ఉన్నదని ఆర్థిక నిపుణులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



గాడిద గుడ్డు.. బడ్జెట్

కాంగ్రెస్ బడ్జెట్‌లో 6 గ్యారెంటీలకు నిధులు గాడిద గుడ్డేనా? రూ.లక్షన్నర కోట్లతో నిర్మిస్తామన్న మూసీ రివర్ ఫ్రంట్‌కు బడ్జెట్‌లో పైసా కేటాయించలేదు. రంజాన్‌కు రూ.33 కోట్లు కేటాయించి.. హిందువుల పండుగలకు నయాపైసా కేటాయించకపోవడం మతతత్వం కాదా ? మహాత్ముడి వ్యాఖ్యలపై ఆత్మపరిశీలన చేసుకోవాలి.

-బండి సంజయ్, కేంద్రమంత్రి



నిరాశపరిచింది

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులను బడ్జెట్ నిరాశ పరిచింది. ఐదు విడతల డీఏ పెండింగ్ ప్రభుత్వం విడుదల చేస్తుందని ఆశించినా కనిపించకపోవడం అన్యాయం, మధ్యంతర భృతి ప్రస్తావన లేదు. ఓహెచ్‌ఎస్ ఐలోపేతం చేస్తామని హామీ ఇచ్చినా ప్రస్తావించలేదు. బడ్జెట్‌లో ఎక్కడా ఉద్యోగుల సంక్షేమం కనపడలేదు. వివక్ష మాత్రమే ఉన్నది.

- దేవీప్రసాద్, కార్పొరేషన్ మాజీ చైర్మన్



పాలసీ లేదు.. పథకం లేదు

రాష్ట్ర బడ్జెట్‌లో అన్ని వర్గాలకు నిరాశే ఎదురైంది. రైతులనే కాదు, కౌలు రైతులు, రైతు కూలీలనూ కాంగ్రెస్ మోసం చేసింది. రైతు భరోసా, దళిత బంధు, గొర్రెల పంపిణీ, మత్స్యకారులకు భరోసాకు కేటాయింపులే లేవు. ఇది పూర్తిగా 'రైతు వ్యతిరేక ప్రభుత్వం'. పాలసీపై స్పష్టత లేదు. ఒక్క కొత్త సంక్షేమ పథకాన్ని ప్రకటించలేదు.

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



దివాలా తీయించే బడ్జెట్

ఇది రాష్ట్రాన్ని దివాలా తీయించే బడ్జెట్. అభివృద్ధి మచ్చుకైనాలేదు. బడ్జెట్‌లో రాష్ట్ర ఆదాయాన్ని రూ. రెండు లక్షల 21 వేలకు పైగా చూపారు. గత ఏడాది ఆదాయం రూ.లక్షా 69 వేల కోట్లు మాత్రమే. మిగిలిన రూ.52 వేల కోట్ల అదనపు ఆదాయం ఎలా సాధ్యమో ఆర్థిక మంత్రి చెప్పాలి.

- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ శాసనసభాపక్షనేత



పెన్షన్లు లేవు.. కొలువుల్లేవు

ప్రస్తుత బడ్జెట్‌లో కొత్త పెన్షన్లు, కొత్త ఉద్యోగాల భర్తీకి నిధుల కేటాయింపులు లేవు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతను, ఆసరా పెన్షన్ దారులను కాంగ్రెస్ ఘోరంగా మోసం చేస్తున్నది.

- కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి



విజన్ లేని బడ్జెట్

బడ్జెట్‌లో స్పష్టమైన విజన్ లేదు. అన్ని వర్గాల ప్రజలు వంచనే ధ్యేయంగా ఉన్నది. ఎక్కడా నూతన విధానాలను రూపొందించలేదు. రానున్న రోజుల్లో ఈ ప్రజా వ్యతిరేక విధానాలని ఎక్కడికక్కడ ఎండగడుతాం. కాంగ్రెస్ నాయకులని ఊర్లో తిరిగే పరిస్థితి లేకుండా చేస్తాం.

- అనిల్ కూర్మాచలం, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్



అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలు

అసెంబ్లీ సాక్షిగా కాంగ్రెస్ పార్టీ అబద్ధాల ప్రచారం చేసింది. రైతు ప్రభుత్వం అని రైతులను నట్టేట ముంచే చర్యలకు దిగుతున్నది. బడ్జెట్‌లో ప్రతి ఒక్క రంగాన్ని నిరాశపరిచారు. చిన్న పిల్లలు పాడిన అప్పుతెచ్చి నట్టుగా బడ్జెట్ ఉన్నది తప్ప ప్రజలకు ఉపయోగకరంగా లేదు.

-మేడే రాజీవ్‌సాగర్, తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్



ఫ్లైఓవర్ పరేషాన్ ఉండదిక!

ఇరుకు రోడ్ల లొల్లికి చెల్లు
గూగుల్ మ్యాప్స్‌లో సరికొత్త ఫీచర్లు

హైదరాబాద్, జూలై 25: గూగుల్ మ్యాప్స్‌ను నమ్ముకుంటే గల్లీల్లో ఇరుక్కుపోయాం. ఫ్లైఓవర్‌పై నుంచి రావాలని తెలియక కింద నుంచి వెళ్లి సిగ్నల్ దగ్గర ట్రాఫిక్‌లో చిక్కుకున్నాం. గూగుల్ మ్యాప్స్ వినియోగించే చాలామంది ఇలాంటి అనుభవాలను చెప్తుంటారు. ఈ సమస్యలకు ఇప్పుడు గూగుల్ పరిష్కారాలను తీసుకువచ్చింది. భారత్‌లో గూగుల్ మ్యాప్స్‌కు ఆరు సరికొత్త ఫీచర్లను జోడించింది. ఈ ఫీచర్ల ద్వారా వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గమ్యం చేరుకోవచ్చని గూగుల్ చెప్తున్నది. ఈ వారం నుంచి ఈ ఫీచర్లు అందుబాటులోకి వస్తున్నాయి.



'న్యారో రోడ్'

గూగుల్ కొత్తగా 'న్యారో రోడ్' ఫీచర్‌ను తీసుకొచ్చింది. శాటిలైట్ చిత్రాలు, స్ట్రీట్ వ్యూ, ఇతర డాటా ద్వారా కృత్రిమ మేధ(ఏఐ) ఇరుకు రోడ్లను గుర్తిస్తుంది. మ్యాప్స్‌లో దారి చూపించేటప్పుడు 'న్యారో రోడ్' అని సూచిస్తుంది. తద్వారా వాహనదారులు ఆ రోడ్డును వదిలి మరో మార్గంలో వెళ్లే అవకాశం ఉంటుంది. ప్రస్తుతానికి ఈ ఫీచర్‌ను హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై వంటి ఎనిమిది నగరాల్లో తీసుకువచ్చింది.



'టేక్ ఫ్లైఓవర్'

గూగుల్ మ్యాప్స్‌లో అడ్రస్ పెట్టుకొని మనం వెళ్లే రోడ్డులో ఫ్లైఓవర్ వచ్చినప్పుడు దాని మీద నుంచి వెళ్లాలా, కింది నుంచి వెళ్లాలా అనేది చాలా పెద్ద గందరగోళంగా ఉంటుంది. ఈ సమస్యను గూగుల్ కొత్త ఫీచర్ పరిష్కరించింది. ఇప్పుడు మ్యాప్స్‌లో ఫ్లైఓవర్లు ప్రత్యేకంగా కనిపిస్తాయి. ఫ్లైఓవర్ నుంచి వెళ్లాల్సి ఉంటే 'టేక్ ఫ్లైఓవర్' అనే సూచన కనిపిస్తుంది. ఈ ఫీచర్ దేశంలోని 40 ప్రధాన నగరాల్లో అందుబాటులోకి వచ్చింది.



మ్యాప్స్ నుంచి మెట్రో టికెట్స్

గూగుల్ మ్యాప్స్‌లో మెట్రో రైలు రూట్ మాత్రమే కాదు మెట్రో టికెట్లు కూడా బుక్ చేసుకోవచ్చు. ఇందుకోసం మ్యాప్స్‌లో కొత్త ఫీచర్ అందుబాటులోకి వచ్చింది. ఓఎన్‌డీసీ, నమ్మ యాత్రి సంస్థలతో కలిసి గూగుల్ ఈ ఫీచర్‌ను తీసుకొచ్చింది. అయితే, ఇప్పటివరకైతే ఇది కొచ్చి, చెన్నై మెట్రోలకు మాత్రమే అందుబాటులో ఉంది. భవిష్యత్తులో మిగతా నగరాల్లోనూ అందుబాటులోకి రానున్నది.

ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఈజీగా గుర్తించొచ్చు

ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో మ్యాప్స్‌లో గూగుల్ కొత్త ఫీచర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దాదాపు 8,000 ఈవీ చార్జింగ్ స్టేషన్లను మ్యాప్స్‌తో అనుసంధానం చేసింది. ఈవీ వినియోగదారులు మ్యాప్స్‌లో చార్జింగ్ స్టేషన్లను గుర్తించొచ్చు. ఏ చార్జింగ్ స్టేషన్‌లో ఎలాంటి చార్జర్ ఉందో కూడా తెలుసుకోవచ్చు. ఇప్పటివరకు భారత్‌లో మాత్రమే ఇలా ద్విచక్ర వాహనాల ఈవీ చార్జింగ్ స్టేషన్లు సైతం మ్యాప్స్‌తో అనుసంధానం అయ్యాయి.

ఎక్కడికెళ్లాలి? ఏం చూడాలి ?

ఏదైనా కొత్త నగరానికి వెళ్లినప్పుడు పర్యాటకులు గూగుల్ మ్యాప్స్‌పై ఎక్కువగా ఆధారపడతారు. అయితే, ఆ ప్రాంతంలో చూడాల్సిన ప్రదేశాలు తెలుసుకోవడానికి ఇతరులను అడగడమో, ఇంటర్నెట్‌లో సెర్చ్ చేయడమో తప్పటం లేదు. ఇక నుంచి గూగుల్ మ్యాప్స్‌లోనే ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రముఖ ప్రదేశాలు, టూరిస్ట్ స్పాట్‌లు తెలిసిపోతాయి. పది నగరాల్లో స్థానిక నిపుణులతో జాబితాలు సిద్ధం చేసి మ్యాప్స్‌లో పొందుపరిచింది.

రోడ్డుపై సమస్య చెప్పొచ్చు

మనం ప్రయాణించే రోడ్డుపై ఏదైనా సమస్య ఉన్నా, రోడ్డు ప్రమాదం జరిగినా, రోడ్డు మూసి ఉన్నా, వాహనం నిలిచిపోయినా, వాహనాలు అలస్యంగా కదులుతున్నా మ్యాప్స్‌లో రిపోర్ట్ చేసేందుకు 'రిపోర్ట్ యాన్ ఇన్సిడెంట్' అనే ఫీచర్‌ను గూగుల్ ప్రవేశపెట్టింది. దీని ప్రకారం ఆ రోడ్డులో రియల్-టైమ్ ట్రాఫిక్ పరిస్థితులను ఇతర వినియోగదారులకు గూగుల్ తెలియజేస్తుంది.

సీయూఈటీ-యూజీ ఫైనల్ కీ విడుదల

న్యూఢిల్లీ, జూలై 25: 'సీయూఈటీ-యూజీ-2024' ప్రవేశ పరీక్షల తుది సమాధానాల కీ గురువారం విడుదలైంది. ప్రవేశ పరీక్ష ఫలితాల్ని త్వరలో విడుదల చేస్తామని గురువారం ఎన్టీఏ తెలిపింది. నీట్-యూజీ, యూజీసీ-నెట్ సహా సీయూఈటీ-యూజీ ప్రవేశ పరీక్షల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయన్న ఆరోపణలు వచ్చాయని, దీంతో ఫలితాల విడుదల ఆలస్యమైందని ఎన్టీఏ అధికారి ఒకరు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం జూన్ 30న పరీక్ష ఫలితాల్ని ఎన్టీఏ విడుదల చేయాల్సింది. అలాంటిది జూలై 7న తాత్కాలిక జవాబుల కీని విడుదల చేసింది. జూలై 19న 1000 మందికి పైగా అభ్యర్థులకు రీటెస్ట్ నిర్వహించింది.

అలా చేస్తే సీబీఐ, ఈడీ దర్యాప్తు ఆపేస్తాం!

- ఠాక్రే, ఎంవీఏ నేతలపై తప్పుడు అఫిడవిట్లు ఫైల్ చేయాలని ఒత్తిడి
- ఫడ్నవీస్‌పై మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణలు



ముంబై, జూలై 25: మహారాష్ట్ర డిప్యూటీ సీఎం, బీజేపీ సీనియర్ నేత దేవేంద్ర ఫడ్నవీస్‌పై రాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ సంచలన ఆరోపణలు చేశారు. మూడేండ్ల క్రితం రాష్ట్రంలోని మహావికాస్ అఘాడీ ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ఆయన కుట్రలు చేశారని ఆరోపించారు. అందులో భాగంగా అప్పటి సీఎం, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాక్రే, ఇతర ఎంవీఏ కూటమి నేతలకు వ్యతిరేకంగా తప్పుడు అఫిడవిట్లు ఫైల్ చేయాలని తనపై ఒత్తిడి చేశారని, ఈ మేరకు ఫడ్నవీస్ తనతో పలుమార్లు ఫోన్లో మాట్లాడారని, ఆయన మనిషి ద్వారా రాయబారం నడిపారని పేర్కొన్నారు. అలా చేస్తే 'రిటర్న్ గిఫ్ట్'గా తనపై సీబీఐ, ఈడీ కేసుల దర్యాప్తులను నిలిపివేయిస్తామని ఫడ్నవీస్ ఆఫర్ ఇచ్చారని దేశ్‌ముఖ్ అన్నారు. తాను తిరస్కరించినందుకు తనపైకి సీబీఐ, ఈడీలను పంపించారని, 13 నెలల పాటు జైల్లో పెట్టారని ఎన్సీపీ(శరద్ పవార్) నేత అనిల్ దేశ్‌ముఖ్ పేర్కొన్నారు. దేశ్‌ముఖ్ ఆరోపణలు నిరాధారమైనవని ఫడ్నవీస్ అన్నారు. ఉద్ధవ్, శరద్ పవార్‌లకు వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యల ఆడియో, వీడియో క్లిప్పులు తన వద్ద ఉన్నాయని అన్నారు. ఫడ్నవీస్‌కు కౌంటర్ ఇస్తూ.. తనకు వ్యతిరేకంగా వీడియో క్లిప్పులను బయటపెట్టాలని అనిల్ సవాల్ చేశారు.

పరీక్షల ప్రక్రియలో మార్పులు!

అక్రమాల అడ్డుకట్టకు సాంకేతికత

- ఫింగర్‌ప్రింట్ అథెంటికేషన్, ఫేషియల్ రికగ్నిషన్ వినియోగం
- నీట్, పూజా ఖేద్కర్ వివాదాల నేపథ్యంలో యూపీఎస్సీ నిర్ణయం



న్యూఢిల్లీ, జూలై 25: నీట్-యూజీ పరీక్షలో అక్రమాల ఆరోపణలు, ఐఏఎస్‌గా పూజా ఖేద్కర్ నియామకంపై వివాదం నేపథ్యంలో యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) పరీక్షల ప్రక్రియలో మార్పులకు సిద్ధమైంది. ఆధునాతన సాంకేతికతను వినియోగించి అక్రమాలకు తావులేకుండా చూడాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా ఆధార్ ఆధారంగా వేలిముద్రల ధ్రువీకరణ, ముఖాన్ని గుర్తించే ఫేషియల్ రికగ్నిషన్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ సాంకేతికను పొందేందుకు గానూ ప్రభుత్వ రంగ సంస్థల(పీఎస్‌యూ) నుంచి బిడ్లను ఆహ్వానించింది. అభ్యర్థుల బయోమెట్రిక్‌ను ధ్రువీకరించేందుకు, పరీక్ష సమయంలో అభ్యర్థుల కార్యకలాపాలను పర్యవేక్షించడం ద్వారా మోసాలు, ఒకరికి బదులుగా మరొకరు పరీక్షకు హాజరవడం వంటి అక్రమాలను అడ్డుకునేందుకు అధునాతన సాంకేతికతను వినియోగించాలని నిర్ణయించినట్టు టెండర్ డాక్యుమెంట్‌లో యూపీఎస్సీ పేర్కొన్నది.

వారం ముందు అభ్యర్థుల వివరాలు

ఈ సాంకేతికతను అందించే ప్రభుత్వ రంగ సంస్థకు పరీక్ష తేదీకి రెండు మూడు వారాల ముందు ఏర్పాట్లు చేసుకునేందుకు పరీక్షా కేంద్రాల వివరాలు, హాజరయ్యే అభ్యర్థుల సంఖ్య వంటి ప్రాథమిక వివరాలు అందిస్తామని యూపీఎస్సీ తెలిపింది. వేలిముద్రతో ధ్రువీకరణ, ఫేషియల్ రికగ్నిషన్ కోసం అభ్యర్థుల పేర్లు, హాల్ టికెట్ నెంబరు, ఫొటో వంటి వివరాలను మాత్రం వారం రోజుల ముందు ఇస్తామని తెలిపింది. సివిల్ సర్వీసుల పరీక్షలతో పాటు ప్రతియేటా 14 రకాల పరీక్షలను యూపీఎస్సీ నిర్వహిస్తున్నది. ట్రెయినీ ఐఏఎస్ పూజా ఖేద్కర్ అక్రమంగా ఉద్యోగం పొందిందనే అంశం బయటకు రావడం, ఐదేళ్ల పదవీకాలం ఉండగానే యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోని రాజీనామా వంటి అంశాలు వివాదంగా మారిన సంగతి తెలిసిందే.

నీట్ రివైజ్డ్ ఫలితాలు విడుదల కాలేదు

కేంద్ర విద్యా శాఖ స్పష్టీకరణ

న్యూఢిల్లీ, జూలై 25: సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) నీట్ యూజీ-2024 రివైజ్డ్ ఫలితాలను విడుదల చేసిందని వచ్చిన వార్తలను కేంద్ర ప్రభుత్వం గురువారం ఖండించింది. సవరణ ఫలితాలను ఇంకా విడుదల చేయలేదని స్పష్టం చేసింది. షేర్ అవుతున్న లింక్ పాతదని, త్వరలో అభ్యర్థుల తుది మార్కులను విడుదల చేస్తామని కేంద్ర విద్యా శాఖ తెలిపింది. నీట్ యూజీ పరీక్షలో ఫిజిక్స్‌లో అడిగిన ఓ ప్రశ్నకు రెండు సమాధానాలు ఉన్నాయన్న అంశం వివాదాస్పదమైన విషయం తెలిసిందే. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఢిల్లీ ఐఐటీ నిపుణుల బృందం సంబంధిత ప్రశ్నకు 'ఆప్షన్ 4' సరైన సమాధానం అని తేల్చింది. దీంతో సవరించిన ఫలితాలను విడుదల చేయాలని సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఎన్టీఏకు ఆదేశాలు జారీచేసింది.

స్కూల్ సర్టిఫికెట్లలో మత మార్పిడికి అనుమతి

కేరళ హైకోర్టు కీలక తీర్పు

కొచ్చి: ఇద్దరు యువకులు తమ పాఠశాల ధ్రువీకరణ పత్రాల్లో మతం మార్చుకోవడానికి కేరళ హైకోర్టు అనుమతి ఇస్తూ కీలక తీర్పు ఇచ్చింది. ఈ మేరకు పరీక్షల నియంత్రణాధికారి పిటిషన్‌ను తిరస్కరించింది. అధికారులు సర్టిఫికెట్లలో మత మార్పిడికి తిరస్కరించడంతో ఇద్దరు యువకులు హైకోర్టును ఆశ్రయించారు. స్కూల్ సర్టిఫికెట్లలో మత మార్పిడిని అనుమతించే నిబంధన ఏదీ లేనప్పటికీ.. కేవలం పుట్టుక కారణం వల్ల ఒక వ్యక్తిని ఒక మతానికి కట్టుబడి ఉండేలా చేయడం సబబు కాదని వ్యాఖ్యానించింది. రాజ్యాంగంలోని 25(1) అధికరణ ప్రకారం ప్రతి వ్యక్తికి మత స్వేచ్ఛ ఉందని తెలిపింది.

భారత్‌లో నాసిరకం దగ్గుమందులు

నాణ్యత పరీక్షలో 100కు పైగా సిరప్‌లు విఫలం

న్యూఢిల్లీ: భారతీయ ఫార్మా కంపెనీలకు చెందిన 100కు పైగా దగ్గు సిరప్‌లు నాణ్యత పరీక్షలో ఫెయిల్ అయ్యాయని ప్రభుత్వ నివేదిక ఒకటి వెల్లడించింది. ఈ దగ్గు మందుల్లోని కొన్ని శాంపిళ్లలో డైథిలిన్ గ్లైకాల్(డీఈజీ), ఇథిలిన్ గ్లైకాల్(ఈజీ) వంటి విష పదార్థాలు ఉన్నాయని తేలింది. డీఈజీ, ఈజీ, అస్సే, మైక్రోబియాల్ గ్రోత్, పీహెచ్, వాల్యూమ్ వంటి అంశాల కారణంగా ఆయా సిరప్‌లు బ్యాచ్‌లను నాణ్యతా ప్రమాణాలు లేని వాటిగా తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా 141 మంది చిన్నారుల మరణాలకు భారత్‌లో ఉత్పత్తి అయిన దగ్గు మందులే కారణమని ఆరోపణలు రావడంతో.. ప్రభుత్వ, ప్రైవేటు ల్యాబ్‌లు దేశవ్యాప్తంగా టెస్టింగ్‌లు చేపట్టాయి.

దర్బార్ హాల్, అశోక్ హాల్ పేర్లు మార్పు

న్యూఢిల్లీ: గురువారం రాష్ట్రపతి భవన్‌లోని రెండు హాళ్ల పేర్లను మార్చారు. దర్బార్ హాల్‌ను 'గణతంత్ర మండపం'గా, అశోక హాల్‌ను 'అశోక మండపం'గా నామకరణం చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి సెక్రటేరియట్ తెలిపింది. రాష్ట్రపతి భవన్ వాతావరణాన్ని భారతీయ సాంస్కృతిక విలువలు, తత్వాలను ప్రతిబింబించేలా చేసే ప్రయత్నమే ఇదని వివరించింది. దర్బార్ హాల్‌ను జాతీయ అవార్డులు ప్రదానం చేసేందుకు, ముఖ్యమైన వేడుకలు నిర్వహించేందుకు ఉపయోగిస్తుండగా, అశోక హాల్ ఓ బాల్‌రూమ్.

30న ఇండియా కూటమి నిరసన

కేజ్రీవాల్ ఆరోగ్యంపై ఆందోళన..

న్యూఢిల్లీ, జూలై 25: తీహార్ జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఆరోగ్యం క్షీణిస్తున్న విషయాన్ని లేవనెత్తేందుకు ఈనెల 30న విపక్ష ఇండియా కూటమి పార్టీలు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ర్యాలీ చేపట్టనున్నట్టు ఆమ్ ఆద్మీ పార్టీ గురువారం వెల్లడించింది. మద్యం పాలసీ కేసులో అరెస్టు అయిన కేజ్రీవాల్‌ను జైల్లోనే చంపేందుకు కేంద్రంలోని అధికార బీజేపీ కుట్ర చేస్తుందని ఆప్ ఆరోపిస్తున్నది. జూన్ 3, జూలై 7 మధ్య ఆయన షుగర్ స్థాయిలు పలుమార్లు పడిపోయాయన్న వైద్య నివేదికను ఆ పార్టీ ప్రస్తావిస్తున్నది.

నార్త్ బెంగాల్‌పై దుమారం

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్ ఉత్తర ప్రాంతానికి ఈశాన్య రాష్ట్రాలతో సారూప్యతలు ఉన్నాయని, దాన్ని ఈశాన్య ప్రాంత అభివృద్ధి శాఖ కిందకు తీసుకురావాలని తాను ప్రధాని మోదీకి ప్రతిపాదన చేశానన్న కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ చేసిన వ్యాఖ్యలపై టీఎంసీ మండిపడింది. బెంగాల్‌ను విభజించలేరని తృణమూల్ నేత సుదీప్ బందోపాధ్యాయ్ అన్నారు. గతంలో గోర్ఖాలాండ్ డిమాండ్‌ను పశ్చిమబెంగాల్ ప్రజలు వ్యతిరేకించారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు ఇలాంటి డిమాండ్లను సహించరని, వాళ్లు(బీజేపీ నేతలు) ఇదే విధంగా మాట్లాడితే బీజేపీ రాష్ట్రంలో జీరో అవుతుందన్నారు.



పుణెలో వరదలో చిక్కుకున్న స్థానికులను తరలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

మహారాష్ట్రలో భారీ వర్షాలు

- వరద ముంపులో ముంబై, పుణె
- విమాన సర్వీసులకు అంతరాయం
- విద్యాసంస్థలకు సెలవులు
- రెండు నగరాల్లోనూ రెడ్ అలర్ట్

ముంబై, జూలై 25: భారీ వర్షాలతో మహారాష్ట్ర అతలాకుతలం అవుతున్నది. గురువారం ముంబైలో తెల్లవారు జామున 4 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 100 మి.మీ. పైగా వర్షపాతం నమోదయ్యింది. పలు ప్రాంతాల్లో 150 మి.మీ. పైగా వర్షం కురిసింది. ముంబైతో పాటు పుణె, థాణె, పాల్ఘార్ సహా పలు నగరాలను వరద ముంచెత్తింది. దీంతో ముంబైలోని స్కూళ్లు, కళాశాలలకు గురువారం సెలవు ప్రకటించారు. వర్షాల కారణంగా రాష్ట్రంలో ఆరుగురు మరణించారు. వీరిలో ముగ్గురు డెక్కన్ ప్రాంతంలో విద్యుదాఘాతంతో మృతి చెందారు. పింప్రి-చించ్వాడ్ ప్రాంతంలో వరద పోటెత్తింది. దీంతో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆర్మీ రంగంలోకి దిగింది. పుణెకు 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న లవాసా ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. వర్షాలు, వరద కారణంగా ముంబై, పుణెలో ప్రజా రవాణా స్తంభించిపోయింది. ముంబైలో భారీ వర్షాల కారణంగా పలు విమానాలు రద్దయ్యాయని, ఇంకొన్ని విమానాలను మళ్లించినట్టు ఎయిర్ ఇండియా ప్రకటించింది. కాగా, మహారాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ముంబై, పుణెలో రెడ్ అలర్ట్ జారీ చేసింది.

ఖనిజాలపై పన్ను అధికారం రాష్ట్రాలదే

- పార్లమెంటుకు ఆ హక్కు ఉండదు
- పరిమితులు మాత్రం విధించవచ్చు
- రాష్ట్రాలకు ఇచ్చే రాయల్టీ.. పన్ను కాదు
- సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ, జూలై 25: ఖనిజాలపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం రాష్ట్రాల చట్టసభలకు ఉంటుందని, పార్లమెంటుకు ఈ అధికారం ఉండదని సుప్రీంకోర్టు చారిత్రక తీర్పును ఇచ్చింది. రాష్ట్రాలకు చెల్లించే రాయల్టీ అనేది పన్ను కాదని కోర్టు స్పష్టం చేసింది. కేంద్రం, రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న ఈ అంశంపై గురువారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని తొమ్మిది మంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం 8:1 మెజారిటీతో తీర్పు వెలువరించింది. రాజ్యాంగంలోని మొదటి జాబితా 54వ ఎంట్రీ ప్రకారం ఖనిజాలపై పన్ను విధించే చట్టబద్ధమైన అధికారం పార్లమెంటుకు ఉండదని ధర్మాసనం పేర్కొన్నది. అయితే, రెండో జాబితాలోని 50వ ఎంట్రీ ప్రకారం మాత్రం.. రాష్ట్రాలపై పరిమితులు, షరతులు, మార్గదర్శకాలతో పాటు నిషేధం కూడా విధించే అధికారం పార్లమెంటుకు ఉందని పేర్కొన్నది. ఖనిజాలపై ప్రాథమిక అధికారం కేంద్రానికి ఉంటుందని 1989లో ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన తీర్పును కొట్టివేసింది.

కేంద్రం తిరిగిచ్చేలా ఆదేశించండి: రాష్ట్రాల వినతి

గనులు, ఖనిజాలపై రాష్ట్రాలకు చెల్లించే రాయల్టీ అనేది పన్ను కాదని ధర్మాసనం స్పష్టం చేసింది. లీజు పొందిన వ్యక్తి ఖనిజాలపై హక్కులను అనుభవిస్తున్నందుకు ఒక ఒప్పందం ప్రకారం చెల్లించేదే రాయల్టీ అని పేర్కొన్నది. కాగా, గతానికి కూడా వర్తించేలా ఈ తీర్పు అమలయ్యేలా చూడాలని, కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఖనిజాలు, గనులపై పన్నుల రూపంలో వసూలు చేసిన వేల కోట్ల రూపాయలను రాష్ట్రాలకు తిరిగి ఇచ్చేలా నిర్ణయం తీసుకోవాలని ధర్మాసనాన్ని రాష్ట్రాలు కోరాయి. రాష్ట్రాల విజ్ఞప్తిని కేంద్రం తరఫున విచారణకు హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వ్యతిరేకించారు. ఇలా చేస్తే భారీ ప్రభావం పడుతుందని, ఇక నుంచి మాత్రమే తీర్పు అమలయ్యేలా ఆదేశాలు ఇవ్వాలని ధర్మాసనాన్ని కోరారు. దీంతో ఈ విషయమై రాతపూర్వకంగా స్పందన తెలియజేయాల్సిందిగా కేంద్ర, రాష్ట్రాలకు సూచిస్తూ జూలై 31 వరకు కోర్టు గడువిచ్చింది. కాగా, జస్టిస్ బీవీ నాగరత్న మాత్రం మిగతా న్యాయమూర్తుల అభిప్రాయంతో విభేదించారు.

35 ఏండ్ల వివాదం కొలిక్కి

ఖనిజ వనరుల మీద వచ్చే ఆదాయంపై కేంద్రం, రాష్ట్రాల మధ్య 35 ఏండ్లుగా ఉన్న వివాదానికి సుప్రీంకోర్టు ఈ తీర్పుతో ముగింపు పలికింది. రాయల్టీని కూడా పన్ను కిందనే చూడాలని, మైన్స్, మినరల్స్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్ యాక్ట్ ప్రకారం ఖనిజాలపై పన్నులు విధించే అధికారం రాష్ట్ర చట్టసభలకు ఉండదని 1989లో సుప్రీంకోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం తీర్పు ఇచ్చింది. 2004లో మాత్రం ఐదుగురు సభ్యుల సుప్రీం ధర్మాసనం.. రాయల్టీ అనేది పన్ను కాదని మరో తీర్పు ఇచ్చింది. దీంతో ఈ అంశంపై రాజ్యాంగ ధర్మాసనం గురువారం ఇచ్చిన తీర్పు కీలకంగా మారింది.

మిత్రపక్షాలకు 'ప్రేమ లేఖ'లా బడ్జెట్

ఎన్డీయే ప్రభుత్వంపై విపక్షాలు ఫైర్

న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కేటాయింపులపై విపక్ష పార్టీల విమర్శల దాడి కొనసాగింది. బడ్జెట్‌పై చర్చలో భాగంగా గురువారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ మాట్లాడుతూ 2024-25 బడ్జెట్‌ను చూస్తుంటే ఎన్డీయేలోని మిత్రపక్ష పార్టీలకు బీజేపీ రాసిన కృతజ్ఞత లేఖ, ప్రేమ లేఖగా అనిపిస్తున్నదని అన్నారు. ప్రభుత్వాన్ని కాపాడుకొనేందుకు ప్రవేశపెట్టిన బడ్జెట్ ఇది అని ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఎద్దేవా చేశారు. అటు రాజ్యసభలో ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా మాట్లాడుతూ పాత ప్రాపర్టీల అమ్మకాలపై ఇండెక్సేషన్ లబ్ధిని తొలగించాలన్న కేంద్రం నిర్ణయం వల్ల రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఎన్నికైన ఎంపీ జైల్లో ఉండటమూ ఎమర్జెన్సీనే

అమృత్‌పాల్‌కు కాంగ్రెస్ ఎంపీ చన్నీ మద్దతు


న్యూఢిల్లీ: ఖలిస్థానీ మద్దతుదారు, స్వతంత్ర ఎంపీ అమృత్‌పాల్ సింగ్ నిర్బంధంపై పంజాబ్ మాజీ సీఎం, కాంగ్రెస్ ఎంపీ చరణ్‌జిత్ సింగ్ చన్నీ ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం ఆయన పార్లమెంట్‌లో మాట్లాడుతూ 'దాక్ష ప్రతిరోజూ అత్యవసర పరిస్థితి గురించి మాట్లాడతారు. కానీ ఇవాళ దేశంలో ఉన్న అప్రకటిత ఎమర్జెన్సీ గురించేమిటి? 20 లక్షల మంది పంజాబ్ ప్రజలు ఎన్నుకొన్న ఓ వ్యక్తిని జైల్లో ఉంచడం కూడా ఎమర్జెన్సీనే. తన నియోజకవర్గ ప్రజల అభిప్రాయాలను ఆయన ఇక్కడ వ్యక్తం చేయలేకపోతున్నారు. ఇదీ ఎమర్జెన్సీనే' అని ఆయన అన్నారు. దీనిపై బీజేపీ నేత గిరిరాజ్ సింగ్ స్పందిస్తూ.. కాంగ్రెస్ ఖలిస్థానీలకు మద్దతుగా నిలవడం దేశానికి ప్రమాదకరమని వ్యాఖ్యానించారు.

ముఖంపై 'ఉదర క్యాన్సర్' లక్షణాలు!

న్యూఢిల్లీ, జూలై 25: ప్రపంచంలో ప్రమాదకరంగా మారుతున్న క్యాన్సర్‌లలో ఉదర క్యాన్సర్ ఒకటి. దీనిని గ్యాస్ట్రిక్ క్యాన్సర్ అని కూడా అంటారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధి లక్షణాలను గుర్తించడం కూడా కష్టమే. సాధారణంగా ఉదర క్యాన్సర్ ప్రారంభంలో ఉండే లక్షణాలు అజీర్ణ సమస్యతో ఉండే లక్షణాలను పోలి ఉంటాయి. అయితే, ముఖంపై వచ్చే కొన్ని లక్షణాలను బట్టి ప్రారంభ దశలోనే ఉదర క్యాన్సర్‌ను గుర్తించవచ్చని నిపుణులు చెప్తున్నారు. ఉదర క్యాన్సర్ వల్ల పాపులో ఎరిత్రోడెర్మ అనే అరుదైన చర్మ సంబంధ సమస్య వచ్చే అవకాశం ఉంటుందని, దీని వల్ల ముఖంపై చిన్న గడ్డలు ఏర్పడటం, వాపు రావడం జరగొచ్చని పేర్కొంటున్నారు. దీంతో పాటు చర్మం పొడిబారి ఊడిపోవడం, దురద వంటి లక్షణాలూ కనిపించవచ్చని చెప్తున్నారు. శోషరసగ్రంథుల వాపుతో పాటు ఆకలి కాకపోవడం, ఒకేసారి బరువు తగ్గడం, నిత్యం కడుపు నొప్పి ఉండటం, గుండెలో మంట, అజీర్ణం, వాంతులు, వికారం, హిమోగ్లోబిన్ లోపం వంటి లక్షణాలు ఉదర క్యాన్సర్ బాధితుల్లో ఉంటాయని పేర్కొంటున్నారు. ఈ లక్షణాలను నిర్లక్ష్యం చేయవద్దని సూచిస్తున్నారు.

భోజనంలో ఊరగాయ వేయనందుకు రూ.35 వేల ఫైన్!

చెన్నై, జూలై 25: అన్నంలోకి ఊరగాయ ఇవ్వలేదన్న కారణంతో తమిళనాడు వాసి ఒకరు ఒక హోటల్‌పై రెండేళ్ల వినియోగదారుల కమిషన్‌లో పోరాడి విజయం సాధించారు. అన్నంలో ఊరగాయ వేయకపోవడం సేవల్లో లోపమని పేర్కొంటూ రెస్టారెంట్‌కు కమిషన్ రూ.35,025 జరిమానా విధించింది. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ఆరోగ్యస్వామి 25 భోజనాలు ఆర్డర్ చేశాడు. అయితే భోజనంలో ఊరగాయ లేకపోవడంతో వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించి రెండేళ్ల పాటు పోరాడాడు. భోజనంలో ఊరగాయ వడ్డించనందుకు ఆ హోటల్ యజమానికి కమిషన్ 35 వేల జరిమానా విధించింది. అంతేకాకుండా ఖర్చుల కోసం 5 వేలు, ఊరగాయల ప్యాకెట్లకు మొత్తం రూ.25 ఇవ్వాలని ఆదేశించింది.



రామాలయ వాచీ @ 34 లక్షలు

అయోధ్య రామమందిర థీమ్‌తో స్విట్జర్లాండ్ సంస్థ జాకోబ్ అండ్ కో లిమిటెడ్ ఎడిషన్ లగ్జరీ వాచ్‌ను తీసుకొచ్చింది. సమయం 6 గంటలైనప్పుడు ఈ గడియారం 'జై శ్రీరామ్' అని పలుకుతుంది. 9 గంటలు అయినప్పుడు రామాలయాన్ని చూపిస్తుంది. కాషాయ రంగు బెల్ట్, శ్రీరాముడు, హనుమంతుడు స్పష్టంగా కనిపించే విధంగా దీనిని తీర్చిదిద్దారు. మొత్తం 49 గడియారాలను తయారు చేశారు. ఒక వాచ్ ధర రూ.34 లక్షలు.



టీచరమ్మగా రాష్ట్రపతి

న్యూఢిల్లీ : రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఉపాధ్యాయురాలిగా మారారు. ఆమె రాష్ట్రపతిగా పదవీ బాధ్యతలు చేపట్టి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ప్రెసిడెంట్స్ ఎస్టేట్‌లోని డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ కేంద్రీయ విద్యాలయాన్ని సందర్శించారు. ప్రపంచ ఉష్ణోగ్రతలు పెరుగుదల, ఆ సమస్యను నిరోధించేందుకు చేపట్టవలసిన చర్యల గురించి తొమ్మిదో తరగతి విద్యార్థులకు బోధించారు. నీటి పరిరక్షణ అవసరాన్ని వివరించారు. వాతావరణ మార్పుల ప్రభావం తగ్గాలంటే మరిన్ని చెట్లను నాటాలని తెలిపారు.

ప్రభాకర్‌రావు అరెస్టుకు ముగిసిన గడువు

ఇతర నిందితులను నేడు కోర్టులో హాజరుపర్చనున్న పోలీసులు

నాంపల్లి కోర్టులు, జూలై 25 (నమస్తే తెలంగాణ): ఫోన్‌ ట్యాపింగ్‌ కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న స్పెషల్‌ ఇంటెలిజెన్స్‌ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ చీఫ్‌ ప్రభాకర్‌రావుతోపాటు ఓ మీడియా సంస్థ ప్రతినిధి శ్రావణ్‌ కుమార్‌ను అరెస్టు చేసి, న్యాయస్థానంలో హాజరుపర్చాలని కోర్టు ఇచ్చిన గడువు గురువారంతో ముగిసింది. విదేశాల్లో ఉన్న వీరిద్దరితోపాటు ఈ కేసులోని ఇతర నిందితులందరినీ ఈ నెల 26న నాంపల్లి కోర్టులో తప్పనిసరిగా హాజరుపర్చాలని 12వ అడిషనల్‌ చీఫ్‌ జ్యుడీషియల్‌ మెజిస్ట్రేట్‌ ఈశ్వరయ్య గతంలో ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. కానీ, ప్రభాకర్‌రావు, శ్రావణ్‌ కుమార్‌ ఇప్పటికీ విదేశాల్లోనే ఉండటంతో పోలీస్‌ అధికారులకు ఏమీ పాలుపోవడం లేదు. దీంతో ఈ కేసులో రిమాండ్‌ ఖైదీలుగా ఉన్న అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతన్న, హైదరాబాద్‌ టాస్క్‌ఫోర్స్‌ మాజీ అధికారి రాధాకిషన్‌రావును మాత్రమే శుక్రవారం కోర్టులో హాజరుపర్చనున్నారు. ఈ క్రమంలో ప్రభాకర్‌రావు, శ్రావణ్‌ కుమార్‌ అరెస్టు విషయమై పోలీసులు కోర్టుకు ఏమి సమాధానం ఇవ్వనున్నారనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కాగా, ఏసీపీ వెంకటగిరికి ఇటీవల ప్రభాకర్‌రావు రాసిన లేఖను కోర్టుకు నివేదించేందుకు ఆయన తరఫు న్యాయవాది సిద్ధమవుతున్నారు.

పోలీసుల పిటిషన్‌పై నేడు విచారణ

రాధాకిషన్‌రావును మరో వారం రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ జూబ్లీహిల్స్‌ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై కౌంటర్‌ దాఖలు చేయాలని నిందితుల తరఫు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఆయన బెయిల్‌ పిటిషన్‌పై కౌంటర్‌ దాఖలు చేయాలని పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ను ఆదేశించింది. ఈ రెండు పిటిషన్లపై శుక్రవారం విచారణ చేపడతామని కోర్టు స్పష్టం చేసింది.

నేడు 483 మంది ఫైర్‌మెన్‌ల పాసింగ్‌ పరేడ్‌

హాజరుకానున్న సీఎం రేవంత్‌రెడ్డి, శ్రీధర్‌బాబు

హైదరాబాద్‌, జూలై 25 (నమస్తే తెలంగాణ): 2022లో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం ఇచ్చిన 610 ఫైర్‌మెన్‌ ఉద్యోగాల నోటిఫికేషన్‌కు ఎంపికైన 483 మంది ఫైర్‌మెన్‌లు నాలుగు నెలల శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. దీంతో శుక్రవారం వట్టినాగులపల్లిలోని అగ్నిమాపకశాఖ ట్రైనింగ్‌ అకాడమీలో వారికి పాసింగ్‌ ఔట్‌ పరేడ్‌ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు హాజరుకానున్నట్టు అగ్నిమాపకశాఖ డీజీ వై నాగిరెడ్డి తెలిపారు. ట్రైనీలకు వరదలు, భూకంపాలు, విపత్తులు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు, రైలు, విమాన ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు.

టెలిస్కోప్‌కు చిక్కిన 'సూపర్‌ జూపిటర్‌'

- జేమ్స్‌ వెబ్‌ టెలిస్కోప్‌తో గుర్తింపు
- గురుగ్రహానికి ఆరు రెట్లు పెద్దది

కేప్‌ కానావెరల్‌, జూలై 25: గురుగ్రహానికి ఆరు రెట్లు పెద్దదైన 'సూపర్‌ జూపిటర్‌'ను అంతర్జాతీయ పరిశోధకుల బృందం గుర్తించింది. నాసాకు చెందిన శక్తివంతమైన జేమ్స్‌ వెబ్‌ స్పేస్‌ టెలిస్కోప్‌ను ఉపయోగించి ఈ భారీ గ్రహానికి చెందిన కొన్ని చిత్రాలను తీసింది. ఇందుకు సంబంధించిన వివరాలు 'నేచర్‌' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. ఈ గ్రహం తన నక్షత్రం చుట్టూ ఒక్కసారి తిరగడానికి దాదాపు 100 నుంచి 250 ఏండ్ల వరకు పడుతుందని పరిశోధకులు గుర్తించారు. భూమి, సూర్యుడి మధ్య ఉన్న దూరం కంటే ఈ గ్రహానికి, దాని నక్షత్రానికి మధ్య ఉన్న దూరం దాదాపు 15 రెట్లు అధికంగా ఉందని భావిస్తున్నారు. పూర్తిగా గ్యాస్‌తో తయారైన ఈ గ్రహ వాతావరణం భూవాతావరణానికి చాలా భిన్నంగా ఉండొచ్చని ఈ పరిశోధక బృందానికి నేతృత్వం వహించిన ఎలిసబెత్‌ మాథ్యూస్‌ తెలిపారు.

వేశ్యా గృహం నిర్వహణకు రక్షణ కోరిన న్యాయవాది

దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మద్రాస్‌ హైకోర్టు

చెన్నై: వేశ్యా గృహాన్ని నడపడానికి రక్షణ కల్పించాలని ఓ న్యాయవాది కోరడంతో మద్రాస్‌ హైకోర్టు దిగ్భ్రాంతికి గురైంది. అడ్వకేట్‌ రాజా మురుగన్‌ హైకోర్టులో రెండు పిటిషన్లను దాఖలు చేశారు. వేశ్యా గృహాన్ని నిర్వహిస్తున్నందుకు పోలీసులు ఆయనపై నమోదు చేసిన కేసును రద్దు చేయాలని కోరారు. విచారణకు చేపట్టిన జస్టిస్‌ పుగళేంది తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వయోజనులు ఇష్టపూర్వకంగా సెక్స్‌ చేసుకునే హక్కుల ఆధారంగా తన చర్యలను సమర్థించుకుంటున్న పిటిషనర్‌ పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. న్యాయ శాస్త్ర డిగ్రీ సర్టిఫికెట్‌, బార్‌ కౌన్సిల్‌లో ఎన్‌రోల్‌మెంట్‌ సర్టిఫికెట్‌లను సమర్పించాలని మురుగన్‌ను ఆదేశించింది.


నిధులు తెస్తరా? రాజీనామా చేస్తరా?

- ఎనిమిది ఎంపీ సీట్లు ఇచ్చినా బీజేపీకి కృతజ్ఞత లేదా?
- ఏపీ, బీహార్‌కే కాదు అన్ని రాష్ర్టాలకు నిధులివ్వాలి
- రౌండ్‌టేబుల్‌ సమావేశంలో వక్తల ఆగ్రహం



సెక్యులర్‌ డెమోక్రటిక్‌ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్‌ జస్టిస్‌ బీ చంద్రకుమార్‌

ఖైరతాబాద్‌, జూలై 25: తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉండి కూడా బడ్జెట్‌లో రూపాయి తెప్పించలేకపోయారని, అలాంటి వారికి పదవులున్నా, లేకున్నా ఒక్కటేనని వక్తలు ఆగ్రహం వ్యక్తంచేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ ప్రధాని, ఆర్థిక, హోంశాఖ మంత్రులను కలిసి వారం పదిరోజుల్లో బడ్జెట్‌లో కేటాయింపులు చేయించాలని, ఒకవేళ ఒప్పించలేకపోతే పదవులకు రాజీనామా చేయడం ఉత్తమం అని సూచించారు. ఇద్దరు కేంద్రమంత్రులతో మిగిలిన ఆరుగురు బీజేపీ ఎంపీలు కూడా రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సెక్యులర్‌ డెమోక్రటిక్‌ ఫోరం తెలంగాణ ఆధ్వర్యంలో జరిగిన రౌండ్‌ టేబుల్‌ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్‌ జస్టిస్‌ బీ చంద్రకుమార్‌ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం భారత రాజ్యాంగ విలువలకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. బడ్జెట్‌ అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ అని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌, బీహార్‌కే కాదు దేశంలోని అన్ని రాష్ర్టాలకు సమానంగా, అవసరాలకు అనుగుణంగా నిధులు కేటాయించాలని డిమాండ్‌ చేశారు. రాజకీయ అధికారం నిలబెట్టుకోవడం కోసం, కొన్ని పార్టీలను తృప్తి పర్చడం కోసం బడ్జెట్‌లో కేటాయింపులు చేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. తమ ప్రభుత్వానికి మద్దతిచ్చిన పార్టీలే ఎక్కువ చేస్తామంటే, చేయక తప్పదంటే తమ పదవులకు రాజీనామా చేసి మరోసారి ఎన్నికలకు పోవాలని సవాల్‌ చేశారు. 1956 నుంచి తెలంగాణకు అన్యాయం జరుగుతూనే ఉన్నదని, నీళ్లు, నిధులు, ఉద్యోగాల విషయంలో తీరని అన్యాయం జరిగిందని వివరించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్‌ ఫ్యాక్టరీ తీరని కలగానే మిగిలిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. తెలంగాణకు బడ్జెట్‌లో కేటాయింపులు ఇవ్వకుండా వివక్ష చూపారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు 8 పార్లమెంట్‌ సీట్లు ఇచ్చినా బీజేపీకి కృతజ్ఞత లేదా? అని ప్రశ్నించారు. సమావేశంలో ఓడీసీ గ్యారెంటీ అధ్యక్షురాలు సాగరా బేగం, నాగరాజు, గోవర్ధన్‌, నర్సింహ పాల్గొన్నారు.



మొక్కల పెంపకానికి చేపట్టిన చర్యలేమిటి?

రాష్ట్ర ప్రభుత్వం నుంచి నివేదిక కోరిన హైకోర్టు

హైదరాబాద్‌, జూలై 25 (నమస్తే తెలంగాణ): వర్షాకాలంలో మొక్కల పెంపకానికి చేపట్టిన చర్యలేమిటో నివేదించాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. జనాభాకు తగ్గట్టుగా మొక్కలను, వృక్షాలను పెంచడం లేదని, పార్కులకు కేటాయించిన స్థలాలను రక్షించేలా ప్రభుత్వానికి ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్‌ ఆలోక్‌ అరాధే, జస్టిస్‌ అనిల్‌ కుమార్‌ గురువారం విచారణ జరిపింది. రాష్ట్రవ్యాప్తంగా 749 హెక్టార్లలో లక్షల మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, స్థానిక సంస్థలను భాగస్వాములను చేస్తామని అదనపు అడ్వకేట్‌ జనరల్‌ మహమ్మద్‌ ఇమ్రాన్‌ఖాన్‌ తెలిపారు. సమగ్ర వివరాలను తెలియజేసేందుకు గడువు కావాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ఆగస్టు 16 వాయిదా వేస్తున్నామని, ఆలోగా నివేదించాలని ధర్మాసనం స్పష్టం చేసింది.

ఉద్యానవర్సిటీకి 'ప్రభుత్వ తెగులు'

- నామమాత్రంగా మారిన కీలక విభాగాలు
- కనిపించని కూరగాయల సాగు విభాగం
- పైరవీల్లో మునిగిపోయిన ఉన్నతాధికారులు

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 25: రాష్ట్ర ఉద్యాన వర్సిటీకి 'ప్రభుత్వ తెగులు' పట్టింది. ఆ వర్సిటీలోని కూరగాయలు, ఔషధ మొక్కలు, పండ్లు, పూల సాగు విభాగాలను వ్యవసాయ వర్సిటీ నుంచి ఉద్యాన కళాశాల ఆవరణలోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించినప్పటికీ అందుకు అవసరమైన స్థలాన్ని, కార్యాలయాల నిర్మాణానికి కావాల్సిన నిధులను కేటాయించకపోవడమే ఇందుకు కారణం. దీంతో ప్రస్తుతం ఆ విభాగాలు నామమాత్రపు సిబ్బందితో పేరుకే కొనసాగుతున్నాయి. ఆ విభాగాల ఉన్నతాధికారులు విధులకు ఎగనామం పెట్టి, పైరవీల కోసం అధికార పార్టీ నాయకుల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. దీంతో విత్తనాలతోపాటు వ్యవసాయ సమాచారం కోసం వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తున్నది. దీనిపై కూరగాయల విభాగం హెడ్‌, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్‌ అనితా కుమారిని సంప్రదించడంతో.. తమ కార్యాలయ తరలింపునకు అవసరమైన స్థలాన్ని, నిధులను ప్రభుత్వం ఇంకా కేటాయించలేదని, ప్రస్తుతానికి తమ కార్యాలయాన్ని తాత్కాలికంగా నడిపేందుకు ఉద్యాన కళాశాలలోని ఓ గదిని మాత్రమే కేటాయించారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసారి కూరగాయల నర్సరీని కూడా ఏర్పాటు చేయలేదని చెప్పారు.

ఆప్‌కు కొత్త ఆఫీస్‌ కేటాయింపు

న్యూఢిల్లీ, జూలై 25: ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు ఆప్‌కి ఢిల్లీలోని లుటియెన్స్‌ ప్రాంతంలో కొత్త కార్యాలయాన్ని కేటాయించినట్టు ఆ పార్టీ వర్గాలు గురువారం వెల్లడించాయి. పండిట్‌ రవిశంకర్‌ శుక్లా మార్గంలోని బంగ్లా 1లో ఆప్‌ కొత్త ఆఫీస్‌ కొలువుదీరనుంది. గతంలో రౌస్‌ అవెన్యూలో ఆప్‌ కార్యాలయం ఉండేది. ఆప్‌కు వచ్చిన జాతీయ పార్టీ హోదాను గుర్తిస్తూ ఆ పార్టీకి ఆఫీస్‌ స్థలం కేటాయించడంపై గురువారం లోగా నిర్ణయం తీసుకోవాలని ఢిల్లీ హైకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది.

ఒడిశా అసెంబ్లీలో పోలవరం లొల్లి



భువనేశ్వర్‌, జూలై 25: ఆంధ్రప్రదేశ్‌లో నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టుపై ఒడిశా అసెంబ్లీలో కాంగ్రెస్‌ సభ్యులు గురువారం నిరసనకు దిగారు. ఈ ప్రాజెక్టు కారణంగా మల్కాన్‌గిరిలోని గిరిజనుల భూమి నీట మునిగిపోయే ప్రమాదం ఉందని కాంగ్రెస్‌ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పార్టీ సభ్యులు స్పీకర్‌ వద్దకు దూసుకువచ్చి నినాదాలు చేయడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. ఈ సందర్భంగా పోలవరంపై వెంటనే ఒక హౌస్‌ కమిటీ వేయాలని సీఎల్పీ నేత రామ చంద్ర కదమ్‌ డిమాండ్‌ చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని, కానీ ఈ ప్రాజెక్టు కారణంగా మల్కాన్‌గిరి జిల్లాలో 1400 నుంచి 1500 హెక్టార్ల భూమి నీట మునిగిపోతుందని చెప్పారు. దీనిపై స్పీకర్‌ స్పందించకపోవడంతో కాంగ్రెస్‌ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలు చేశారు.

అంతరిక్షంలోకి 4కే వీడియో ప్రసారాలు

- తొలిసారి పంపిన 'నాసా'

న్యూఢిల్లీ, జూలై 25: లేజర్‌ కమ్యూనికేషన్‌ టెక్నాలజీని ఉపయోగించి 'నాసా' మొట్టమొదటి సారి అంతరిక్షంలోకి 4కే వీడియో ప్రసారాలను చేయగలిగింది. ఆకాశంలోని ఓ ఎయిర్‌క్రాఫ్ట్‌ నుంచి అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్‌ఎస్‌), తిరిగి అక్కడ్నుంచి.. ఈ వీడియో ప్రసారాలను భూమిపైకి చేపట్టడంలో నాసా సక్సెస్‌ అయ్యింది. 'ఆర్టెమిస్‌ మిషన్స్‌'లో భాగంగా చంద్రుడిపైకి నాసా వ్యోమగాముల్ని పంపబోతున్నది. ఇందుకు సంబంధించి ప్రత్యక్ష ప్రసారాలు తాజా ప్రయోగంతో సాధ్యమవుతాయని నాసా సైంటిస్టులు చెబుతున్నారు. భవిష్యత్తులో 4కే హెచ్‌డీ వీడియో ప్రసారాలు సాధ్యమేనని 'నాసా' ఇంజినీర్ల బృందంలోని సైంటిస్టు డానియల్‌ రాయిబల్‌ చెప్పారు. వ్యోమగాముల ఆరోగ్యం, కార్యకలాపాల సమన్వయం చేయడానికి ఈ ప్రత్యక్ష ప్రసారాలు కీలకమవుతాయని అన్నారు.

పడవ బోల్తా.. 15 మంది మృతి

- 150 మంది గల్లంతు

అబుజా, జూలై 25: యూరప్‌కు వెళుతున్న ఆఫ్రికన్‌ వలసదారుల పడవ బోల్తా పడటంతో 15 మంది మృతి చెందారు. 150 మంది గల్లంతయ్యారు. సోమవారం మారిటానియా రాజధాని నౌవాక్‌చోట్‌ వద్ద ఈ ప్రమాదం జరిగింది. పడవలో మొత్తం 300 మంది ప్రయాణిస్తున్నారని అంతర్జాతీయ వలస సమాఖ్య తెలిపింది. మారిటానియా తీర రక్షక దళం 120 మందిని రక్షించింది. గల్లంతైన వారి కోసం గాలింపు కొనసాగుతున్నది. అభద్రత, పేదరికం కారణంగా ఆఫ్రికన్‌ వలసదారులు యూరప్‌ వలస వెళ్లడానికి ప్రయత్నిస్తున్నారు.

ఇద్దరు ఎమ్మెల్యేలపై జార్ఖండ్‌ స్పీకర్‌ వేటు

రాంచీ: జార్ఖండ్‌ శాసనసభ సభాపతి ట్రిబ్యునల్‌ ఎమ్మెల్యేలు లోబిన్‌ హెంబ్రోమ్‌ (జేఎంఎం), జై ప్రకాశ్‌ భాయ్‌ పటేల్‌ (కాంగ్రెస్‌)ను శాసన సభ్యత్వానికి అనర్హులుగా ప్రకటించింది. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం చెప్పిన ఈ తీర్పు ఈ నెల 26 నుంచి అమల్లోకి వస్తుందని వివరించింది. హెంబ్రోమ్‌పై జేఎంఎం, పటేల్‌పై బీజేపీ ఫిర్యాదులపై ఈ నిర్ణయం వెలువడింది. వర్షాకాల సమావేశాలు శుక్రవారం ప్రారంభమవుతున్న తరుణంలో వీరిపై వేటు పడింది.

వాణిజ్య

రియల్‌ పన్ను పోటు



స్థిరాస్తి క్రయవిక్రయాలకు దెబ్బ • బడ్జెట్‌లో ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ దూరం

పెరిగిన ఎల్‌టీసీజీ పన్ను భారం • నిర్మాణ రంగానికి నష్టమేనంటున్న నిపుణులు

మధ్యతరగతి సొంతింటి కలల్ని కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బడ్జెట్‌ చెరిపేసింది. ఇండెక్సేషన్‌ ప్రయోజనాన్ని తొలగించి మోయలేనంత పన్ను భారాన్ని మోదీ సర్కారు మోపింది మరి. స్థిరాస్తి క్రయవిక్రయాలను ఆందోళనకరం చేస్తూ తీసుకున్న ఈ నిర్ణయంపట్ల నిర్మాణ రంగ పరిశ్రమ భగ్గుమంటున్నదిప్పుడు.


న్యూఢిల్లీ, జూలై 25: కరోనా ప్రభావం నుంచి నెమ్మదిగా బయటపడిన స్థిరాస్తి రంగం.. మళ్లీ మందగమనంలోకి వెళ్లనుందా? బడ్జెట్‌లో మోపిన పన్ను భారంతో క్రయవిక్రయాలు పడిపోనున్నాయా? ధరలు పెరిగి సామాన్యుల సొంతింటి కలలు చెదిరిపోతాయా?.. దేశీయ నిర్మాణ రంగాన్ని ఇప్పుడు కుదిపేస్తున్న ప్రశ్నలివే. అవును.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2024-25)గాను లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌.. రియల్‌ ఎస్టేట్‌ ఇండస్ట్రీని ఒక్కసారిగా షాక్‌కు గురిచేసింది మరి.

ఇదీ సంగతి..

పార్లమెంట్‌లో ఈ నెల 23న (మంగళవారం) ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో స్థిరాస్తులు, ఇతర ఆర్థిక, ఆర్థికేతర ఆస్తుల అమ్మకాలపై ఇండెక్సేషన్‌ బెనిఫిట్స్‌ను తొలగిస్తున్నట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ స్పష్టం చేశారు. దీంతో రియల్‌ ఎస్టేట్‌ రంగంపై ఇది తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతుందని ఇప్పుడు మెజారిటీ ఇండస్ట్రీ నిపుణులు విశ్లేషిస్తున్నారు. లాంగ్‌-టర్మ్‌ క్యాపిటల్‌ గెయిన్స్‌ (ఎల్‌టీసీజీ లేదా దీర్ఘకాల మూలధన లాభాలు) పన్నుకు ఇండెక్సేషన్‌ ప్రయోజనాన్ని తీసేస్తున్నట్టు విత్త మంత్రి వెల్లడించారు. అలాగే ఎల్‌టీసీజీ ట్యాక్స్‌ను 12.5 శాతానికి తగ్గిస్తున్నట్టు చెప్పారు. ఇంతకుముందు ఇండెక్సేషన్‌ ప్రయోజనంతో 20 శాతంగా ఉండేది. అయితే గతంతో పోల్చితే పన్ను శాతం దాదాపు సగానికి తగ్గినా.. ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ను దూరం చేయడం వల్ల స్థిరాస్తి అమ్మకందారులపై ట్యాక్స్‌ భారం ఇంకా పెరుగుతుందనే ఇప్పుడు అందరి ఆందోళనకు కారణమవుతున్నది. ముఖ్యంగా రీ-సేల్‌ మార్కెట్‌ కుదేలవుతుందన్న అభిప్రాయాలున్నాయి.

ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ అంటే?

2001 తర్వాత కొన్న ఇండ్లను ఇప్పుడు అమ్మితే.. కొనుగోలు చేసిన ధరపై వచ్చిన లాభానికి ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ లేకుండా ఎల్‌టీసీజీ పన్ను 12.5 శాతం వర్తిస్తుందని బడ్జెట్‌లో మంత్రి నిర్మలా సీతారామన్‌ చెప్పారు. అయితే అంతకుముందు (2001 మార్చి 31 లోపు) కొన్న ఇండ్లను అమ్మితేనే మాత్రం ఇండెక్సేషన్‌ ప్రయోజనం ఉంటుంది. ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ను కాస్ట్‌ ఇన్‌ఫ్లేషన్‌ ఇండెక్స్‌ (సీఐఐ) నంబర్ల ఆధారంగా లెక్కిస్తారు. 2001-02 నుంచి (2001 ఏప్రిల్‌ నుంచి) ప్రతీ ఆర్థిక సంవత్సరం ఈ సీఐఐ నంబర్‌ను ఆదాయ పన్ను (ఐటీ) శాఖ విడుదల చేస్తూ వస్తున్నది. 2001-02లో నాటి ద్రవ్యోల్బణం ఆధారంగా ఇది 100గా ఉన్నది. ఈ బేస్‌ రేటు (100)నే 2001 కంటే ముందు ఇండ్లు కొన్నవారికి ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ లెక్కింపునకు వాడుతున్నారు. ఇక ఈ ఆర్థిక సంవత్సరం (2024-25) ఇప్పటి ద్రవ్యోల్బణం రేటు ప్రకారం సీఐఐని 363గా నిర్ణయించారు. దీని ప్రకారం 2001-02 ఆర్థిక సంవత్సరంలో మీరు లక్ష రూపాయలకు ఇల్లు కొంటే.. ప్రస్తుతం దాని విలువ రూ.3.63 లక్షలు అవుతుంది. ఇంతకు మించిన ధరకు ఇల్లును మీరు అమ్మితేనే అందులో నుంచి రూ.3.63 లక్షలపోనూ మిగతా మొత్తానికే ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాల్సి ఉంటుంది. దీన్నే ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ అంటారు. అయితే ఇది పాత పన్ను ప్రకారం. తాజా బడ్జెట్‌లో చేసిన మార్పుల ప్రకారం ఇంటిని అమ్మినప్పుడు ధరలో నుంచి కొన్న ధర లక్ష మాత్రమే తీసేస్తారు. మిగతా మొత్తం అంతటికీ పన్ను పడుతుంది.



పాత పన్ను ప్రకారం

2018-19లో రూ.50 లక్షలతో రాజేశ్‌ ఓ ఇంటిని కొనుగోలు చేశారు. ఆ ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ 280గా ఉన్నది. 2024-25లో రాజేశ్‌ ఆ ఇంటిని రూ.70 లక్షలకు అమ్మేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో సీఐఐ 363గా ఉన్నది. దీంతో ఇంటిని అమ్మిన ఆర్థిక సంవత్సరం సీఐఐతో.. ఇంటిని కొన్న ఆర్థిక సంవత్సరం సీఐఐని భాగించడం జరుగుతుంది. 363/280=1.296428 వస్తుంది. దీన్ని ఇంటిని కొన్న ధర రూ.50 లక్షలతో గుణిస్తే.. రూ.64,82,142గా ఉంటుంది. ఇంటిని అమ్మడం ద్వారా వచ్చిన రూ.70 లక్షల్లో నుంచి ఈ రూ.64,82,142ను తీసేయాలి. అప్పుడు రూ.5,17,858 వస్తుంది. దీనిపై ఎల్‌టీసీజీ పన్ను 20 శాతం అంటే రూ.1,03,571.6 చెల్లిస్తే సరిపోతుంది.

కొత్త పన్ను ప్రకారం

అమ్మిన ధర రూ.70 లక్షల నుంచి కొన్న ధర రూ.50 లక్షలను తీసేస్తే.. మిగిలే ఆ రూ.20 లక్షలపై 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను చెల్లించాలి. అంటే రూ.2.50 లక్షలు చెల్లించాలి. ఎల్‌టీసీజీకి ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ను తొలగించడం వల్ల గతంతో పోల్చితే ఇంటి అమ్మకంపై సుమారు రూ.1.47 లక్షలు అదనంగా ట్యాక్స్‌పేయర్లు చెల్లించాల్సి వస్తున్నదన్నమాట.

ఇండస్ట్రీ వర్గాల ఆందోళనలివీ..

- ఇండెక్సేషన్‌ బెనిఫిట్‌ను తాజా బడ్జెట్‌లో తీసేయడం వల్ల రీసేల్‌ మార్కెట్‌ లావాదేవీలు మందగిస్తాయి.
- ఎప్పుడో కొన్న ఇండ్లు, భూములను ఇప్పుడు అమ్మేందుకు వాటి యజమానులు పన్ను భారం కారణంగా ఆసక్తి చూపరు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అమ్మకందారులకు పన్ను భారం పెరిగి లాభాలు తగ్గుతాయి.
- పన్నుల కారణంగా స్థిరాస్తి ధరలను అమ్మకందారులు అమాంతం పెంచేస్తారు. దీనివల్ల కొనుగోలుదారులు ముందుకురాని దుస్థితి నెలకొంటుంది.
- పన్నుల్ని తప్పించుకోవడానికి నగదు లావాదేవీలనే అంతా ఎంచుకుంటారు. ఇది ప్రభుత్వ ఖజానాకు, నిర్మాణ రంగానికి కూడా నష్టం.
- కొత్త పెట్టుబడులు రాక నిర్మాణ ప్రాజెక్టులు ఎక్కడివక్కడే ఆగిపోయే ప్రమాదం.
- ఇండెక్సేషన్‌ ప్రయోజనాన్ని తొలగించడం వల్ల రియల్టీలోకి బ్లాక్‌మనీ రాక పెరుగుతుంది.

మరో 1,000 తగ్గిన బంగారం ధర

- 3 రోజుల్లో రూ.5,000 పతనం
- హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు తులం రేటు



న్యూఢిల్లీ, జూలై 25: బంగారం ధరలు భారీగా దిగొస్తున్నాయి. గురువారం తులం రేటు మరో రూ.1,000కిపైగా పడిపోయింది. దీంతో 24 క్యారెట్‌ 10 గ్రాముల విలువ హైదరాబాద్‌లో రూ.70 వేల దిగువకు చేరి రూ.69,820గా నమోదైంది. బుధవారంతో చూస్తే రూ.1,040 తగ్గింది. ఇక 22 క్యారెట్‌ రూ.950 దిగి రూ.64,000గా ఉన్నది. ఢిల్లీలో మాత్రం రూ.70,050 వద్ద స్థిరపడింది. ఇక్కడ అంతకుముందు రెండు రోజుల్లో రూ.4,000 దిగజారగా.. మొత్తం ఈ మూడు రోజుల్లో రూ.5,000 పతనం కావడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలో ధరల క్షీణత, నగల వర్తకులు అమ్మకాల ఒత్తిడికి లోనవడంబులియన్‌ మార్కెట్‌ను దిగువ ముఖం పట్టిస్తున్నాయి. మరోవైపు కిలో వెండి ధర కూడా ఢిల్లీలో రూ.3,500 తగ్గి రూ.84,000గా ఉన్నది. హైదరాబాద్‌లో రూ.84,500 పలుకుతున్నది. బడ్జెట్‌లో బంగారం, వెండిపై కస్టమ్స్‌ సుంకాలను కోత పెట్టడంతో.. ఒక్కసారిగా బయ్యర్లు, ఇన్వెస్టర్లు రివర్స్‌గేర్‌ వేశారు. కాగా, గ్లోబల్‌ మార్కెట్‌లో ఔన్సు బంగారం 2361 డాలర్లు పలికితే.. వెండి 28.04 డాలర్లుగా నమోదైంది.

ఐడీబీఐ అమ్మకానికి అంతా సిద్ధం

- త్వరలో ఆర్బీఐ నుంచి గ్రీన్‌సిగ్నల్‌

న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వ రంగ సంస్థ, ఐడీబీఐ బ్యాంక్‌ ప్రైవేటీకరణకు లైన్‌ క్లియరవుతున్నది. బ్యాంక్‌ను దక్కించుకునేందుకు వేలంలో పాల్గొనాలనుకుంటున్న వారికి కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి రావాల్సిన భద్రతాపరమైన అనుమతులు వచ్చాయి. ఈ మేరకు గురువారం సంబంధిత అధికారి ఒకరు పీటీఐకి తెలిపారు. అలాగే రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా (ఆర్బీఐ) నుంచి కూడా అనుమతి త్వరలోనే వస్తుందన్నారు. కాగా, ఐడీబీఐలో ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం ఎల్‌ఐసీ 30.24 శాతం, కేంద్ర ప్రభుత్వం 30.48 శాతం వాటాలను అమ్మేయనున్నాయి. ఈ బ్యాంక్‌లో కేంద్రానికి, ఎల్‌ఐసీకి కలిపి మొత్తం 94.72 శాతం వాటా ఉన్నది.

కెనరా బ్యాంక్‌ లాభం 3,905 కోట్లు

తొలి త్రైమాసికంలో 10 శాతం వృద్ధి



న్యూఢిల్లీ, జూలై 25: ప్రభుత్వరంగ సంస్థ కెనరా బ్యాంక్‌ రాణించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో నికర లాభంలో 10 శాతం వృద్ధిని నమోదు చేసుకున్నది. 2022-23 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.3,535 కోట్లుగా ఉన్న నికర లాభం గత త్రైమాసికానికిగాను రూ.3,905 కోట్లకు ఎగబాకింది. మొండి బకాయిలు తగ్గుముఖం పట్టడం వల్లనే లాభాల్లో రెండంకెల వృద్ధి నమోదైందని బ్యాంక్‌ ఎండీ కే సత్యనారాయణ రాజు తెలిపారు. సమీక్షకాలంలో బ్యాంక్‌ ఆదాయం రూ.34,020 కోట్లకు చేరుకున్నట్టు చెప్పారు. అలాగే మొండి బకాయిలపై యుద్ధం ప్రకటించినట్లు, ఇక నుంచి ప్రతి త్రైమాసికంలో రూ.1,000 కోట్ల బకాయిలను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

- బ్యాంక్‌ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 4.14 శాతానికి దిగొచ్చింది. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 1.24 శాతానికి తగ్గింది.
- మొండి బకాయిలను పూడ్చుకోవడానికి నిధుల కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8,500 కోట్ల నిధుల సేకరించనున్నది.

ఐపీవోకి స్టాండర్డ్‌ గ్లాస్‌

హైదరాబాద్‌, జూలై 25: హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్‌ గ్లాస్‌ లైనింగ్‌ టెక్నాలజీ లిమిటెడ్‌ స్టాక్‌ మార్కెట్లోకి లిస్ట్‌ కాబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్‌ మార్కెట్‌ నియంత్రణ మండలి సెబీకి డ్రాఫ్ట్‌ రెడ్‌ హెరింగ్‌ ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. ఐపీవో ద్వారా గరిష్ఠంగా రూ.600 కోట్ల వరకు నిధులు సమీకరించాలనుకుంటున్నది. దీంట్లో ఫ్రెష్‌ ఇష్యూ ద్వారా రూ.250 కోట్లు, ఆఫర్‌ ఫర్‌ సేల్‌ రూట్‌లో మరో రూ.350 కోట్లను 1.84 కోట్ల షేర్లను జారీ చేయడం ద్వారా సేకరించాలనుకుంటున్నది.

వెమ్‌ టెక్నాలజీస్‌ 1,000 కోట్ల పెట్టుబడి

- రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌ బాబు

హైదరాబాద్‌, జూలై 25 (నమస్తే తెలంగాణ): రక్షణ రంగ పరికరాల తయారీ సంస్థ వెమ్‌ టెక్నాలజీస్‌ మొదటి దశ ప్రాజెక్టులో భాగంగా రూ.1,000 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టబోతున్నదని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌ బాబు వెల్లడించారు. జహీరాబాద్‌ నిమ్జ్‌లో 511 ఎకరాల స్థలంలో ఏర్పాటవుతున్న ఈ సమీకృత ఉత్పాదన కేంద్రం వచ్చే ఏడాది డిసెంబర్‌ నాటికి అందుబాటులోకి రానున్నది. కంపెనీకి కేటాయించిన భూమిలో ఇంకా స్వాధీనం చేయాల్సిన 43 ఎకరాలకు సంబంధించిన సమస్యను వెంటనే పూర్తి చేసి అందజేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను మంత్రి సూచించారు. మరోవైపు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటా విక్రయం ద్వారా రూ.50 వేల కోట్లు లక్ష్యంగా పెట్టుకోవడానికి మంత్రి తప్పుపట్టారు. ఇది కన్న బిడ్డలను మరొకరికి అమ్ముకోవడం లాంటిదన్నారు.

మిత్సుయి కెమికల్స్‌ టెక్నికల్‌ సెంటర్‌

జపాన్‌కు చెందిన మిత్సుయి కెమికల్స్‌.. హైదరాబాద్‌లో ప్రపంచ స్థాయి టెక్నికల్‌ సెంటర్‌ను ఏర్పాటు చేయడానికి ఆసక్తి కనబరుస్తున్నది. టీ హబ్‌ ద్వారా లైఫ్‌ సైన్సెస్‌, పెట్రో కెమికల్స్‌ రంగాల స్టార్టప్‌ల్లో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నట్టు మిత్సుయి ప్రతినిధి హస్వంతరావు తెలిపారు.

ఆల్‌టైం కనిష్ఠానికి రూపాయి

న్యూఢిల్లీ: చారిత్రక కనిష్ఠ స్థాయికి రూపాయి పడిపోయింది. ఫారెక్స్‌ మార్కెట్లో డాలర్‌కు డిమాండ్‌ పెరగడంతో రూపాయి విలువ 7 పైసలు తరిగిపోయి ఆల్‌టైం కనిష్ఠ స్థాయి 83.78కి జారుకున్నది. విదేశీ నిధులు తరలించుకుపోవడం, డాలర్‌కు డిమాండ్‌ పెరగడంతో మారకం విలువ నెల కనిష్ఠానికి జారింది. 83.72 వద్ద ప్రారంభమైన డాలర్‌-రుపీ రేటు ఇంట్రాడేలో 83.66 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది.

జియో ఎయిర్‌ ఫైబర్‌ ఇన్‌స్టాలేషన్‌లో రాయితీ

న్యూఢిల్లీ, జూలై 25: ఎయిర్‌ఫైబర్‌ వినియోగదారులకు శుభవార్తను అందించింది జియో. వచ్చే నెల 15 వరకు ఇన్‌స్టాలేషన్‌ చార్జీలు రూ.1,000 రాయితీ ఇస్తున్నట్టు గురువారం ప్రకటించింది. అలాగే ఎంట్రీ-లెవల్‌ ప్లాన్లపై 30 శాతం వరకు రాయితీ ఇస్తున్నది. జూన్‌తో ముగిసిన మూడు నెలల కాలంలో దేశవ్యాప్తంగా 11 లక్షల మంది నూతన ఎయిర్‌ఫైబర్‌ కనెక్షన్లు మాత్రమే చేరారు. ఇతర పోటీ సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకోవాలనే ఉద్దేశంతో జియో ఈ నిర్ణయం తీసుకున్నది.



గౌహతి ఐఐటీలో సీటు పొందిన గూడెం గ్రామానికి చెందిన సొంటిరెడ్డి దీప్తిని హైదరాబాద్‌లో అభినందించి ల్యాప్‌టాప్ అందజేస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఐఐటీ విద్యార్థినికి అండగా కేటీఆర్

- చదువు పూర్తయ్యే వరకూ ఖర్చు భరిస్తానని హామీ

ముస్తాబాద్, జూలై 25: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేదలపై ఉన్న మమకారాన్ని మరోసారి చాటుకున్నారు. అస్సాంలోని గౌహతి ఐఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని చదువయ్యే ఖర్చంతా భరిస్తానని హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సొంటిరెడ్డి పద్మ-చంద్రంది నిరుపేద కుటుంబం. వీరి కొడుకు దుర్గాప్రసాద్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, కూతురు దీప్తి 10వ తరగతి వరకు ఇంటిపక్క చదిని మండలంలోని నామాపూర్ మోడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. ఐటీవలే గౌహతి ఐఐటీలో డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో సీటు సాధించింది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో చదివేందుకు కావాల్సినంత ఆర్థిక స్తోమత ఆ కుటుంబానికి లేదు. దీప్తి కుటుంబ సభ్యులు దాతల నుంచి ఆర్థిక సాయం కోసం ప్రయత్నించారు. ఈ విషయం కేటీఆర్ దృష్టికి రావడంతో ఆయన ఆ కుటుంబానికి అండగా నిలిచారు. బక్రీదే సందర్భంగా తనను కలిసేందుకు హైదరాబాద్ వచ్చిన దీప్తి కుటుంబానికి కేటీఆర్ ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీప్తి నాలుగేండ్ల కోర్సు పూర్తి చేయడానికి కావాల్సిన మొత్తం ఖర్చు భరిస్తానని చెప్పారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా దీప్తికి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు.



రామగుండం టౌన్‌షిప్‌లోని జ్యోతిభ వీవీఐపీ గెస్ట్‌హౌస్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, తదితరులు

'ఖని'లో బీఆర్‌ఎస్ బృందం బస

గోదావరిఖని/ పాలకుర్తి, జూలై 25: కాళేశ్వరం ప్రాజెక్టుల సందర్శనకు బయలుదేరిన కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం గురువారం రాత్రి 11 గంటలకు గోదావరిఖని పట్టణానికి చేరుకున్నది. అంతకుముందు కరీంనగర్ నుంచి బయలుదేరిన బృందానికి బసంత్‌నగర్‌లో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనస్వాగతం పలికారు. భారీగా వర్షం కురుస్తున్నప్పటికీ సుమారు 200 మంది కోరాం కార్మికులు, మహిళలు కేటీఆర్ కోసం రాజీవ్‌రహదారిపై ఓపికగా వేచి ఉన్నారు. తర్వాత అక్కడి నుంచి బీఆర్‌ఎస్ నాయకులు కాన్వాయ్‌లోని ఎన్‌టీపీసీకి రాగా, ఇక్కడి ఎన్‌టీపీసీ టౌన్‌షిప్‌లోని జ్యోతిభ వీవీఐపీ గెస్ట్‌హౌస్ వద్ద మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడే బస చేశారు.

రైతుల జీవితాలతో ఆటలా?

నీళ్లు అందుబాటులో ఉన్నప్పుడే పంపింగ్ చేయాలి

- పది లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకుని కాళేశ్వరం నిలబడింది
- కక్ష సాధింపులు మంచిది కాదు
- పంపింగ్ చేసి రిజర్వాయర్లు నింపాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ఎల్‌ఎండీ సందర్శన



ఎండిపోయిన ఎల్‌ఎండీని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు

కరీంనగర్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కార్‌ను సూచించారు. రాజకీయాలు, కక్షసాధింపు చర్యలకు పోతే రైతులు, ప్రజలు నష్టపోతారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం కాళేశ్వరం నుంచి నీటిని పంపింగ్ చేసి రాష్ట్రంలోని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందంతో కలిసి కేటీఆర్ ఎల్‌ఎండీ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో గతేడాది ఇదే సమయానికి ఎంత నీరు ఉన్నది? ఇప్పుడు ఎంత ఉన్నదని తెలుసుకున్నారు. మొదట బ్రిడ్జి పైభాగాన్ని తిలకిస్తున్న రిజర్వాయర్‌ను, కాకతీయ దిగువ కాలువ వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టాన్ని, గేట్ల వద్దకు వెళ్లి అక్కడి నీటి మట్టాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కొద్దిసేపు అక్కడి కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర సాగునీటి రంగంలో విప్లవాన్ని సృష్టించారని తెలిపారు. ముఖ్యంగా గోదావరి నదిలో వృథాగా పోతున్న వందల టీఎంసీల నీటిని ఒడిసిపట్టి తెలంగాణలోని బీడు భూములను మాగాణులుగా మార్చాలని అద్భుతమైన ఆలోచన చేసి ఆచరణలో చూపారని అన్నారు. మేడిగడ్డ నుంచి మొదలు పెడితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతో సహా 19 బరాజ్‌లు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, వందల కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, వేల కిలోమీటర్ల పిల్ల కాలువలు తవ్వించారని, మొత్తంగా చూస్తే ప్రపంచంలోనే అతి పెద్దదైన మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూపంలో కాళేశ్వరాన్ని నిర్మించారని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు మేడిగడ్డలో జరిగిన ఒక చిన్న ఘటనను పట్టుకొని, దానిని భూతద్దంలో చూపించి మొత్తం కాళేశ్వరాన్ని ఒక విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని, గత 8 నెలలుగా లక్షలాది మంది రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. గతేడాది సరిగ్గా ఇదే రోజు ఎల్‌ఎండీ రిజర్వాయర్‌లో 12 టీఎంసీలకుపైగా నీరు ఉండేదని, ఇదే సమయంలో కాళేశ్వరం నుంచి సమయానికి పంపింగ్ చేయడం వల్ల పూర్తిస్థాయి నీటిని నిల్వ చేసి రైతుల గుండెల్లో భరోసా ఇవ్వగలిగామని చెప్పారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి గురించి అధికారులతో మాట్లాడితే.. ఇప్పటివరకు 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నా గ్యారంటీ లేకుండా పోయిందని చెప్పినట్టు తెలిపారు. ఇప్పుడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరిలో వరద ఉన్నప్పుడు నీటిని పంపింగ్ చేయాల్సి ఉన్నదని, అయితే పంపింగ్‌పై నీటి పారుదల శాఖకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అన్నారు. ఒక పక్క గోదావరిలో లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నాయని, మరో పక్క ప్రభుత్వం పంపింగ్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా దోబూచులాడుతున్నదని మండిపడ్డారు. అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరిందని తెలిపారు. ఒక పక్క అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ ఎండిపోతున్న ఎల్‌ఎండీ, దానిపైన ఉన్న మిడ్‌మానేరు, ఆ పైన ఉన్న ఎస్సారెస్పీ, వరద కాలువపై ఉన్న వేలాది మోటర్లను పరిశీలించేందుకు, వాస్తవాలను వివరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే తాము ప్రాజెక్టుల సందర్శనకు వచ్చినట్టు తెలిపారు. రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్ నింపితే రైతులకు ఒక భరోసా ఇచ్చినట్టవుతుందని అన్నారు. సాగునీటి విషయంలో రైతులకు పూర్తి స్థాయి స్పష్టత వస్తుందని ఉద్దేశంతో తాము కాళేశ్వరం సిస్టంలోని రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల సందర్శనకు బయలు దేరామని, ఇక్కడి వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు చెప్పారు. కన్నెపల్లి వద్ద పంపింగ్ ప్రారంభిస్తే కాళేశ్వరం పరిధిలోకి వచ్చే అన్ని రిజర్వాయర్లు నిండే అవకాశం ఉన్నదన్నారు. మల్లన్నసాగర్‌లో 50 టీఎంసీలు, కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీల నిండితే కేవలం రైతులకే కాకుండా హైదరాబాద్ మహానగరానికి మంచినీటి అవసరాలు కూడా తీరుతాయని, మార్గమధ్యంలో ఉండే వేలాది గ్రామాలకు ఇతర జిల్లాలు, నియోజకవర్గాలకు కూడా మంచినీటికి ఇబ్బందులు లేకుండా సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని కేటీఆర్ సూచించారు.

మేడిగడ్డ మేడిపండు కాదు..

మేడిగడ్డ మేడిపండు అయిపోయిందని, అది గోదావరి నీటిలో కొట్టుకుపోతుందని, లక్షల కోట్లు వృథా అయ్యాయని కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రచారమంతా ఉత్తదేనని తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. దాదాపు 10 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని మేడిగడ్డ కీడిగా నిలబడి ఉన్నదని అన్నారు. గురువారం ఎల్‌ఎండీకి వచ్చినట్టుగానే ఆ సమీపమైన అన్ని రిజర్వాయర్లకు వెళ్లి వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తామని అన్నారు. శుక్రవారం ఉదయం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను పరిశీలిస్తామని, అదే విధంగా మేడిగడ్డ బరాజ్, కాళేశ్వరం ఆలయాన్ని కూడా సందర్శిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేల బృందంలో గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, విజయుడు, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, తాతా మధు, శంభీపూర్ రాజు, శేరి సుభాష్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎల్‌ఎండీ వద్ద మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాల్క సుమన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పొన్నం వెంకటేశ్వర్‌రావు, మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్యే నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, పొన్నం అనిల్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు కేటీఆర్ బృందానికి స్వాగతం పలికారు.



కరీంనగర్ శివారులోని డ్యాం కట్టపై నీటిలో నుంచి నడుచుకుంటూ వస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	32.0°c	25.0°c
నల్లగొండ	29.5°c	23.0°c
ఆదిలాబాద్	29.2°c	23.9°c
మహబూబ్‌నగర్	28.2°c	22.4°c
వరంగల్	27.0°c	23.0°c
నిజామాబాద్	26.7°c	22.9°c
రంగారెడ్డి	26.7°c	21.7°c
మెదక్	26.5°c	22.0°c
కరీంనగర్	26.0°c	24.0°c
హైదరాబాద్	26.0°c	23.0°c



మరో రెండు రోజులు వానలు

- పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్: వాతావరణశాఖ

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో వాగులు పొంగి పొర్లుతుండగా, జలాశయాలు నిండుకుండలా మారాయి. ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద అల్పపీడనం ఏర్పడి, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రభావం ఉత్తర తెలంగాణ జిల్లాలపై ఉంటుందని తెలిపారు. ఆసిఫాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాలో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఎల్లో అలర్ట్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి గురువారం వరకు సాధారణం కంటే 30 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం వరకు 312.2 మి.మీ సాధారణ వర్షపాతం కురియాల్సి ఉండగా, ఇప్పటి వరకు 407.3 మి.మీ వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కెరమెరి మండలంలో అత్యధికంగా 4.34 సెం.మీ వర్షపాతం నమోదైంది.

గోదావరి వెలవెల..



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వద్ద నీరులేక వెలవెలబోతున్న గోదావరి

మిడ్‌మానేరు మౌనరోదన



ఎండిపోయిన మధ్యమానేరు జలాశయం

మైదానంలా లోయర్ మానేరు



మైదానాన్ని తలపిస్తున్న కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం లోపలి ప్రాంతం

కాళేశ్వరమే కల్పతరువు

> మొదటిపేజీ తరువాయి...

కృష్ణా నదుల్లోని నికర, మిగులు జలాలను సమర్థంగా వినియోగించుకొని, కోటి ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకోసమే నూతన జల విధానం (రీడిజైనింగ్)కు శ్రీకారం చుట్టింది. ఈ స్వప్నంలో మొదటి భాగం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జిల్లాలో ఉమ్మడి రాష్ట్రానికి 75 శాతం విశ్వసనీయత కలిగిన నికర జలాల కేటాయింపులు 1,489 టీఎంసీలు ఉంటాయని లెక్క తేల్చారు. అందులో 954 టీఎంసీలను తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రానికి ఈ కేటాయింపులు చేసినప్పటికీ.. ప్రాజెక్టులు పూర్తికాక పోవడంతో అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. వాస్తవ వినియోగం ఏనాడు 400 టీఎంసీలకు మించి లేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాలను అధ్యయనం చేసి.. గోదావరి జలాల గరిష్ఠ వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే సాధ్యమవుతుందని భావించింది.. రూపకల్పన చేసింది. దీని ద్వారా పక్షిలోపలి శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, ఎగువమానేరు, దిగువమానేరు, మధ్యమానేరు తదితర జలాశయాలు జీవం పోసుకునేలా ప్రణాళిక రూపొందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు, 1.80 కోట్ల ప్రజానీకానికి తాగునీటితోపాటు పరిశ్రమల అవసరాలకు నీరు ఉపయోగపడుతుందని నిర్ణయించింది. ఎల్లంపల్లి-శ్రీపాద సుందిళ్ల బరాజ్ మధ్య దాదాపు 170 కిలోమీటర్ల పరిధిలో సర్కారు రిజర్వాయర్‌గా విస్తరించింది. అదనపు సాధ్యాలు ఉండి చెందుతున్నారు. తొలితెలంగాణ ముఖ్యమంత్రి సుశిక్షణ చేసి చూపించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ఉధృతి

ప్రాణహిత, ఇంద్రావతే ప్రాణాధారం

సమైక్య ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో కుట్ర దాగి ఉన్నదని ఉద్యమ నేతగా ఉన్న సమయం నుంచి చెప్పుకు వచ్చిన కేసీఆర్, స్వరాష్ట్రం వచ్చాక అందులోని లోపాలపట్టిపై ఆరా తీశారు. లోపాలను ఐసిగెత్తిన చేశారు. అంతకుముందు ఈ ప్రాజెక్టు వెనుక దాగి ఉన్న కుట్రలను అసెంబ్లీ సాక్షిగా కళ్లకు కట్టినట్టుగా చూపించారు. తెలంగాణ వచ్చాక సహ కేసీఆర్.. మేడిగడ్డ, తమ్మిడిహట్టి వద్ద 47 ఏండ్ల నీటి లెక్కల ఆధారంగా తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వాస్తవాలను శాసనసభ ముందు పెట్టిన విషయం తెలిసిందే. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత తక్కువగా ఉన్నదని చెప్పడంతోపాటు ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద 1,651 టీఎంసీల లభ్యత ఉన్నదని తన ప్రసంగంలోనే అసెంబ్లీలో వివరించారు. గోదావరిలో ఇంద్రావతి కలిసే పేరూర్ వద్ద సరాసరి 2,430 టీఎంసీల లభ్యత ఉన్నదని వివరాన్ని వెల్లడించారు.

ఎత్తిపోతలెందుకు ఎందుకు వివక్ష?

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసే అవకాశం ఉన్నా రేవంత్ సర్కార్ వివక్ష చూపుతున్నది. ప్రస్తుతం మేడిగడ్డ (లక్ష్మీ బరాజ్) వద్ద 7,71,580 క్యూసెక్కుల వరద ఉన్నది. దాదాపు 390 టీఎంసీల ప్రవాహం నీటి మట్టం 70 టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నది. నిజానికి ఈ సీజన్‌లో ఇప్పటికే దాదాపు 390 టీఎంసీల నీరు సముద్రం పాలు కాగా, శుక్రవారం ఉదయం వరకు 440 టీఎంసీలు దాటనుండగా అదికారులు అంచనా వేస్తున్నారు. దిగువన వందల టీఎంసీలు సముద్రం పాలవుతుండగా.. ఎగువన ఉన్న ప్రాజెక్టులు మాత్రం వెలవెలబోతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.263 టీఎంసీల నీరు వచ్చి చేరింది. 17,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పక్కన పెడితే మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.82 టీఎంసీల నీరు ఉన్నది. ఇన్‌ఫ్లో అంతంత మాత్రమే. లోయర్ మానేరు డ్యాం సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5,296 టీఎంసీల నీరు ఉన్నది. అప్పర్ మానేరు జలాశయం పూర్తి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.45 టీఎంసీలు, అన్నపూర్ణ జలాశయం సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా, 0.75 టీఎంసీలు, రంగనాయక జలాశయం సామర్థ్యం 0.135 టీఎంసీలు కాగా 0.747 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ప్రాజెక్టుల పరిస్థితి ఇలాఉంటే.. రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉన్నదో చెప్పనక్కరలేదు. నిజానికి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో ప్రవాహం నీటిని పైప్రాజెక్టులకు ఎత్తిపోయవచ్చు. ఎల్లంపల్లి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.04 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో 23,072 క్యూసెక్కులుగా వస్తున్నది. కడెం ప్రాజెక్టు నిండింది. ఇన్‌ఫ్లో ఇంకా ఏటికి ఉన్న కాలువన్నాయని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ ఇన్‌ఫ్లో తగ్గినా కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లికి నీరు తీసుకోవడానికి వీలున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నందిమేడారం రిజర్వాయర్ ద్వారా లక్ష్మీ పంప్‌హౌస్‌కు పంపింది. అక్కడి నుంచి మధ్యమానేరు, అలాగే లోయర్‌మానేరు డ్యాంలకు నీరు ఇవ్వొచ్చు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను బట్టి చూస్తే.. మూడు టీఎంసీలను ఎత్తిపోసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. నందిమేడారం జలాశయం వద్ద మూడు పంపులు ఆఫ్‌చేసి ఆ నీటిని పైకి ఎత్తిపోయవచ్చు కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో శ్రద్ధ చూపడం లేదు. మేడిగడ్డ తోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మాణం చేపట్టి నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) పరిధిలోకి వెళ్లిపోయాయి. వాళ్లు నీటిని స్టోరేజ్ చేయవద్దని సూచించారు. నిజానికి దిన్న లోపాలను సవరించి పంపింగ్‌ను లేకుండా మేడిగడ్డ.. ఎల్లంపల్లి ప్రాజెక్టుల వద్ద.. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం సమయాన్ని వృథా చేసింది. సీజన్ ప్రారంభంలోనే సర్వే చేయడం వల్ల ప్రస్తుతం నీరు తీసుకునే సౌలభ్యం లేకుండాపోయింది. అంతేకాదు, ఇక్కడి ఇంజినీర్లు ప్రత్యామ్నాయంగా పనిచేస్తున్నారని నేషనల్, ఇంటర్‌నేషనల్ ఇంజినీర్లు ప్రశంసిస్తుంటే.. ఇక్కడి ప్రభుత్వం వారిని పక్కన పెట్టి.. ఏజెన్సీలు ఇతర పేర్లతో ప్రాజెక్టుల స్వల్ప రిపేర్ల విషయంలో ఇబ్బందులు పెడుతున్నది. ఈ సీజన్‌లో నీటిని వచ్చినట్టుగా ఎత్తిపోసుకునేందుకు ఒక్క ఒక్క అవకాశం ఎల్లంపల్లి ప్రాజెక్టు. పక్కన నీటిని పట్టుకోవడం నీటికి వదులుకుంటే ఎక్కడా ప్రాజెక్టులను నీరు వచ్చే అవకాశమున్నది. ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. కాగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో గురువారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డను సందర్శించనున్నది.

44 ఏండ్లలో సముద్రం పాలైన గోదావరి జలాల వివరాలు (1970-71నుంచి 2014 వరకు)

సంవత్సరం	నీళ్లు (టీఎంసీలలో)	సంవత్సరం	నీళ్లు (టీఎంసీలలో)
2013-2014	3364.5	1992-1993	1558.2
2012-2013	1446.7	1991-1992	994.9
2011-2012	1146.8	1990-1991	3271.7
2010-2011	1965.1	1989-1990	1859.6
2009-2010	541.3	1988-1989	3272.8
2008-2009	766.0	1987-1988	633.4
2007-2008	1419.5	1986-1987	1894.8
2006-2007	2200.5	1985-1986	999.0
2005-2006	1875.8	1984-1985	923.8
2004-2005	464.7	1983-1984	3810.0
2003-2004	1230.1	1982-1983	1132.7
2002-2003	991.5	1981-1982	2232.4
2001-2002	1104.3	1980-1981	2067.3
2000-2001	1545.2	1979-1980	1597.7
1999-2000	1782.8	1978-1979	2408.8
1998-1999	1739.1	1977-1978	1780.7
1997-1998	921.1	1976-1977	2105.3
1996-1997	776.9	1975-1976	3130.5
1995-1996	1509.4	1974-1975	1072.8
1994-1995	2984.7	1973-1974	2822.1
1993-1994	931.1	1972-1973	784.1
		1971-1972	1132.4
		1970-1971	3001.9

44 ఏండ్ల సగటు చూస్తే ఏటా 1709.0 టీఎంసీల నీరు సముద్రం పాలైంది.

కాంగ్రెస్ కళ్లు తెరవాలి..

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నిలువెల్లా కరువు ఎదుర్కొన్న వేళ మంది అప్పుడు తల అత్మహత్యలు చేసుకున్నా ఆనాటి పాలకులు స్పందించలేదు. సాగునీరు ఇచ్చే ఆస్త దాతలు ఆదుకునేందుకు చర్యలు తీసుకోలేదు. నిజానికి 1970-71 నుంచి 2014 వరకు అంటే 44 ఏళ్ల లెక్కలు తీసుకుంటే.. ఏటా 1,709 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలైన ఆనాటి పాలకుల ప్రాజెక్టులు కట్టాలన్న ఆలోచన చేయలేదు. స్వరాష్ట్రం కోసం ఉద్యమం తీవ్రమవుతున్న సమయంలో కంటితుడుపు చర్యగా సమైక్య ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని 2008లో తెరపైకి తెచ్చి ప్రారంభించింది. ప్రాణహిత నదిపై ఆదిలాబాద్ జిల్లాలో తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల పూర్తిస్థాయి మట్టంతో బరాజ్ నిర్మించి 160 టీఎంసీల ప్రాణహిత నీటిని ఎల్లంపల్లికి తరలించి ఆ తర్వాత నుంచి మిడ్‌మానేరు ద్వారా చేవెళ్ల వరకు వేర్వేరు జిల్లాల మీదుగా నీటిని పంపిస్తామని అదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టినట్టు చెప్పింది. నాటి ఏపీ ప్రభుత్వం పంపిన డీపీఆర్‌ను కేంద్ర జల సంఘంలో ని హైడ్రాలజీ డైరెక్టరేట్ వారు పరిశీలించి.. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యతపై పలు అనుమానాలు లేవనెత్తారు. 2015 మార్చి 4న స్పష్టమైన లేఖ రాశారు. చివరకు ఏపీ ప్రభుత్వం తమ్మిడిహట్టికి సంబంధించిన ఎటువంటి అనుమతి రాకముందే.. నాటి ప్రభుత్వం 7 లింకులు 28 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. తమ్మిడిహట్టి వద్ద బరాజ్ పనులు తప్ప అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించింది. ఇలా ఏపీ ప్రభుత్వం 2014 జూన్ వరకు ఈ ప్రాజెక్టులపై దాదాపు 7 వేల కోట్లు ఖర్చు చేసింది. అంతేకాదు, బరాజ్‌కు అనుమతి రాకుండా ప్యాకేజీ పనులు చేపట్టి ఆత్మద్రోహానికి మూలకారకులైనారు.



పింఛన్ కోసం క్యూలో పాస్‌బుక్కులు

నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పాత బీహెచ్‌ఈ క్వార్టర్స్‌లో గురువారం పింఛన్ డబ్బులను పంపిణీ చేశారు. ఉదయం నుంచి వర్షం కురుస్తున్నా.. వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు పింఛన్ కోసం పాసుబుక్కులు పెట్టుకుని క్యూలో నిలబడ్డారు. -కుభీర్

• పింఛన్ల కోసం రోడ్డెక్కిన వృద్ధులు



పింఛన్ల కోసం వృద్ధులు, ఒంటరి మహిళలు రోడ్డెక్కారు. ప్రతినెలా పింఛన్ డబ్బులను ఆలస్యంగా ఇస్తున్నారని, రెండు నెలలుగా వాటిని కూడా ఇవ్వడం లేదని ఆరోపిస్తూ వనపర్తి జిల్లా ఆత్మకూరులోని వృద్ధులు గురువారం గాంధీచౌక్‌లో రోడ్డుపై ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తామంటూ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. -ఆత్మకూరు

• దవాఖానకు దారేది?



నిర్మల్ జిల్లా కుభీర్‌లోని పీహెచ్‌సీ ఎదుట వర్షాలకు వరద చేరింది. గురువారం సంత కావడంతో గిరిజన గ్రామాల నుంచి దవాఖానకు భారీ సంఖ్యలో రోగులు వచ్చారు. మోకాళ్ల లోతు నీళ్లు ఉండటంతో లోపలికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. దీంతో కుభీర్ యువకులు వరద నీటిలో నాట్లు వేసి నిరసన తెలిపారు. సమస్యను పరిష్కరించాలని వైద్యాధికారికి వినతిపత్రం సమర్పించారు. -కుభీర్

• బదిలీలపై ఉపాధ్యాయుల నిరసన



డిమాండ్లను పరిష్కరించాలని కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు గురువారం నిరసన తెలిపారు. భోజన సమయంలో ప్లకార్డులు ప్రదర్శించి నినాదాలు చేశారు. ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులను ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని, పదేండ్లు దాటినా బదిలీలు చేపట్టలేదని విమర్శించారు. 317 జీవోను తమకు అమలు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తంచేశారు. -నాగిరెడ్డిపేట



భూదాన్ పోచంపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం, చేనేత సంఘాల నాయకులు, కార్మికులు



సిరిసిల్ల పట్టణంలో నేతన్నల దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న సీపీఎం నేత చాడ వెంకటరెడ్డి

చేనేత రంగ పరిరక్షణకు ఉద్యమించాలి

- ఇక్కత్ డూప్లికేట్ వస్త్రాలను అడ్డుకోవాలి
- పద్మశ్రీ అవార్డు గ్రహీతల పిలుపు
- పోచంపల్లిలో నేతన్నల భారీ ర్యాలీ

భూదాన్‌పోచంపల్లి, జూలై 25 : చేనేత పరిశ్రమ పరిరక్షణ కోసం చేనేత సంఘాల నాయకులు, కార్మికులు సంఘటితంగా ప్రభుత్వాలపై ఉద్యమించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీతలు గజం గోవర్ధన్, గజం అంజయ్య, చింతకింది మల్లేశం పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లిలో గురువారం చేనేత పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో చేనేత సంఘాల నాయకులు, కార్మికులు నేతన్న విగ్రహం నుంచి ఆచార్య కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహం వరకు భారీ ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ అవార్డు గ్రహీతలు మాట్లాడుతూ.. మిల్లుల్లో చేనేత ఇక్కత్ డిజైన్లతో డూప్లికేట్ వస్త్రాలు తయారుచేసి షాపింగ్ మాల్స్, దుకాణాల్లో తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత కార్మికులు వీధిన పడే పరిస్థితి నెలకొన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కంపెనీల్లో ప్రింట్ అయ్యే ఇక్కత్ డిజైన్ వస్త్రాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఇక్కత్ డూప్లికేట్‌ను అరికట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చట్టాలు తీసుకురావాలని చేనేత, జౌళి శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్, రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ మునాసు వెంకటేశం మాట్లాడుతూ.. హైదరాబాద్ మార్కెట్లోకి గుజరాత్, సూరత్, ముంబై నుంచి పెద్దఎత్తున వస్త్రాలు దిగుమతి అవుతున్నాయని, షాపింగ్ మాల్స్‌లో ఇక్కత్ వస్త్రాలని చెప్పి ప్రింటింగ్ వస్త్రాలు తక్కువ ధరకు విక్రయిస్తుండటంతో చేనేత మార్కెట్ దెబ్బతింటున్నదని తెలిపారు.

సిరిసిల్ల బంద్ సక్సెస్

రాజన్న సిరిసిల్ల, జూలై 25 (నమస్తే తెలంగాణ): వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సంక్షోభాన్ని పరిష్కరించి, ఆత్మహత్యలను నివారించాలని డిమాండ్ చేస్తూ నేతన్నలు ఇచ్చిన సిరిసిల్ల బంద్ గురువారం విజయవంతమైంది. వస్త్ర పరిశ్రమ అనుబంధ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బంద్ సంపూర్ణమైంది. వాణిజ్య, వ్యాపార వర్గాలు మద్దతు తెలిపాయి. అన్ని పార్టీలు సంఘీభావం ప్రకటించాయి. ఆర్టీసీ బస్సులు కూడా సరిగా నడవలేదు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. బంద్‌లో భాగంగా నేతన్నలు సిరిసిల్ల నేతన్న చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. వందలాది మంది తరలి వచ్చి మానవ హారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలతో సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభంలోకి కూరుకు పోయిందని, కార్మికుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని నేతన్నలు డిమాండ్ చేశారు. నిరసనలో జేఏసీ నాయకులు ఆడెపు రవీందర్, మూషం రమేశ్, పంతం రవి, ఏనుగుల ఎల్లయ్య, సైర్లాబ్ బాబు, కోడం రమణ, రవి, దూడం శంకర్, సామల శ్రీనివాస్, పిసగాని రాజేశం, గుంటి వేణు, మండల సత్యం పాల్గొన్నారు.

దీక్షకు సీపీఎం నేత చాడ సంఘీభావం

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చాడ వెంకటరెడ్డి విమర్శించారు. నేతన్నలు చేపట్టిన రిలేదీక్షా శిబిరాన్ని గురువారం ఆయన సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా మరమగ్గాలు బంద్ పడి వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత బకాయిలు వెంటనే విడుదల చేయాలని, పవర్‌లూం సమస్యలు పరిష్కరించి కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నేతన్నల బతుకులు రోడ్డున పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నదని అన్నారు.

'మలక్‌పేట' ఘటనలో వార్డెన్ సస్పెండ్

పూర్తిస్థాయి విచారణకు త్రిసభ్య కమిటీ

హైదరాబాద్, జూలై25 (నమస్తే తెలంగాణ): మలక్‌పేట ప్రభుత్వ అంధ బాలికల వసతి గృహంలో ఎనిమిదేండ్ల బాలికపై జరిగిన లైంగికదాడి ఘటనపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఘటన తన దృష్టికి వచ్చిన వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడారు. దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్స్ సాధికారతశాఖ డైరెక్టర్ శైలజ వసతి గృహాన్ని సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ రిపోర్ట్ ఆధారంగా ఉన్నతాధికారులు వార్డెన్‌ను సస్పెండ్ చేశారు. డైరెక్టర్ శైలజ చైర్మన్‌గా, వికలాంగుల సాధికారతశాఖ ఏడీ రాజేందర్, హైదరాబాద్ డీసీ వెల్ఫేర్ ఆఫీసర్ అక్కమ్మ సభ్యులుగా త్రిసభ్య కమిటీని ప్రభుత్వం నియమించింది. పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి నివేదికను అందించాలని కమిటీకి ఆదేశాలు జారీ చేసింది.

ఎమ్మెల్యేల ఫిరాయింపుపై విచారణ నేటికి వాయిదా

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ తరఫున గెలిచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేలు దానంనాగేందర్, కడియం శ్రీహరి, తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని కోరుతూ హైకోర్టులో ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద వేర్వేరుగా దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డి గురువారం విచారణ జరిపారు. తదుపరి విచారణను శుక్రవారం కొనసాగిస్తామని ప్రకటించారు.

ఫార్మా విలేజ్ భూసర్వేను అడ్డుకున్న రైతులు

- సీఎం ఇలాకాలో అన్నదాతల నిరసన
- గ్రామసభల ద్వారా సర్వే చేయాలని వినతి

బొంరాస్‌పేట, జూలై 25 : సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రైతుల నుంచి నిరసనలు వ్యక్తమవుతున్నాయి. దుద్యాల మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ఫార్మా విలేజ్ కోసం గురువారం చేపట్టిన భూ సర్వేను రైతులు అడ్డుకున్నారు. మండలంలోని పోలేపల్లి, హకీంపేట, లగచర్ల, పులిచెర్ల కుంట తండాల్లోని ప్రభుత్వ భూమిని రైతులకు పంపిణీ చేయగా, సాగు చేసుకుంటున్నారు. ఇప్పుడు ఈ భూములను ప్రభుత్వం ఫార్మా విలేజ్ కోసం సేకరించడానికి పూనుకున్నది. గురువారం పోలేపల్లిలోని సర్వే నంబరు 67 లోని 130.21 ఎకరాల ప్రభుత్వ భూమిని సర్వే చేయడానికి ఆర్‌ఐ రవినాథ్, సర్వేయర్ల బృందం హకీంపేటకు చేరుకుని సర్వే చేయడానికి యత్నించగా రైతులు వచ్చి అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం రైతులు తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేశారు. గ్రామ సభలు పెట్టి భూసర్వే నిర్వహించాలని రైతులు కోరారు.



దుద్యాల తహసీల్దార్ దానయ్యకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

• 'విద్య'కు నిధుల కోతపై విద్యార్థి సంఘాల నిరసన



తెలంగాణ బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడంపై విద్యార్థి సంఘాల నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా వేర్వేరు ప్రాంతాల్లో గురువారం బడ్జెట్ ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఖమ్మం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద బడ్జెట్ ప్రతులను తగులబెట్టారు. -ఖమ్మం ఎడ్యుకేషన్

ఏసీబీకి చిక్కిన ముగ్గురు అధికారులు

- మధ్యవర్తి ద్వారా రూ.80 వేలు తీసుకున్న పరకాల సబ్ రిజిస్ట్రార్
- రూ.20 వేలు తీసుకుంటూ పట్టుబడిన పాల్వంచ పట్టణ ఎస్సై
- మక్తల్‌లో రూ.9 వేలు తీసుకుంటూ దొరికిన ప్రభుత్వ సర్వేయర్
- కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఏసీబీ అధికారులు



లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఎస్సై రాము

పరకాల/పాల్వంచ/మక్తల్, జూలై 25: వేర్వేరు జిల్లాల్లో వివిధ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ప్రభుత్వ అధికారులు గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అందులో ఒకరు హనుమకొండ జిల్లా పరకాల సబ్ రిజిస్ట్రార్, మరొకరు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ ఎస్సై, ఇంకొకరు నారాయణపేట జిల్లా మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న సర్వేయర్ ఉన్నారు. ఏసీబీ డీఎస్పీలు మీడియాకు వివరాలు వెల్లడించారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రామమైన సీతారాంపురానికి చెందిన అన్నదమ్ము లు లడే శ్రీనివాస్, శ్రీకాంత్.. తల్లిదండ్రుల పేరుతో 481/సీ సర్వేనంబర్‌లో ఉన్న నాలు గు గుంటల భూమిని తమ పేరుమీద రెండు సమభాగాలుగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేయడానికి ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌ను సంప్రదించారు. విషయాన్ని సబ్ రిజిస్ట్రార్ సునీత దృష్టికి తీసుకెళ్లగా.. ఆమె రూ.80 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. ప్లాన్ ప్రకారం.. వారు గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్‌కు రూ.80 వేలు నగదు ఇచ్చారు. ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శ్యాం, రాజా ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ నరేశ్ నుంచి రూ.80 వేలు స్వాధీనం చేసుకున్నారు. 2 గంటల పాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి సబ్ రిజిస్ట్రార్ సునీత, ప్రైవేట్ డాక్యుమెంట్‌రైటర్ బొట్ల నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో ఓ కేసు విషయమై న్యాయవాది నుంచి ఎస్సై రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ రమేశ్ తెలిపారు. పాల్వంచకు చెందిన సీరపు శ్రావణి కొత్తగూడెంకు చెందిన బాలసాని గణేశ్‌గౌడ్‌కు రూ.20 వేలు అప్పుగా ఇచ్చింది. అనంతరం గణేశ్‌గౌడ్ మరణించగా.. డబ్బులు ఇవ్వాలని అతడి కుటుంబ సభ్యులపై కొత్తగూడెం కోర్టులో శ్రావణి కేసు వేసింది. కోర్టులో డాక్యుమెంట్ దాఖలు చేయడానికి ఎఫ్‌ఐఆర్ కాపీ కావాలని శ్రావణి తరఫు న్యాయవాది ఎస్సైని సంప్రదించగా.. డబ్బులు డిమాండ్ చేశారు. ఏసీబీ అధికారుల ప్లాన్ ప్రకారం.. న్యాయవాది లక్ష్మారెడ్డి పాల్వంచలోని ఎస్సై రాము ఇంటికి వచ్చి రూ.20 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. మరో ఘటనలో.. నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన రైతు గానం వెంకటేశ్.. మంతన్‌గోడ్ గ్రామ సమీపంలో సర్వేనంబర్ 107, 121లో 17 ఎకరాల భూమి సర్వే చేయాలని ఈ ఏడాది ఏప్రిల్ 22న మీ సేవలో డబ్బులు చెల్లించారు. సర్వేయర్ బాలరాజు జూన్ 26న పొలం వద్ద సర్వేకు వెళ్లారు. హద్దులు నిర్ణయించేందుకు మ్యాప్ తీసుకొస్తానని చెప్పి రైతు వద్ద రూ.3 వేలు తీసుకున్నారు. తర్వాత రూ.12 వేలు ఖర్చు అవుతుందని, ఇప్పటికి రూ.3 వేలు ఇచ్చావు.. మరో రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో రైతు ఏసీబీ అధికారుల సాయంతో గురువారం సాయంత్రం సర్వేయర్‌కు రూ.9 వేలు ఇస్తుండగా పట్టుకున్నారు. ఇప్పటి వరకు సర్వేయర్ బాలరాజు మూడుసార్లు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. డీఎస్పీ శ్రావణ కృష్ణగౌడ్, ఎస్సైలు ఖాదర్ జిలానీ, లింగయ్య, పాల్గొన్నారు.



పట్టుబడిన బాలరాజు



ఏసీబీ అదుపులోకి పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ నరేశ్

శ్రీశైలానికి 2.5 లక్షల క్యూసెక్కుల వరద

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ)/న్యూస్‌నెట్‌వర్క్: కర్ణాటక, మహారాష్ట్రతోపాటు, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో కృష్ణమ్మ ఉప్పొంగి ప్రవహిస్తున్నది. ఆల్మట్టి, నారాయణపూర్, తుంగభద్ర ప్రాజెక్టులు ఇప్పటికే నిండిపోగా, దిగువకు వరదను విడుదల చేస్తున్నారు. దీంతో జూరాల, అక్కడి నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద వచ్చి చేరుతున్నది. గురువారం సాయంత్రానికి జూరాల ప్రాజెక్టుకు 2.27 లక్షల క్యూసెక్కులు, శ్రీశైలం ప్రాజెక్టుకు 2.50 లక్షల క్యూసెక్కులకు ప్రవాహం వచ్చి చేరుతున్నది. మరోవైపు తుంగభద్ర నుంచి సైతం దాదాపు 98 వేల క్యూసెక్కుల మేరకు వరద కొనసాగుతున్నది. ఇక గోదావరిలో వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. ఎస్సారెస్పీ, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్వల్పంగా వరద ప్రవాహం పెరిగింది. ఎస్సారెస్పీకి 21,650, నిజాంసాగర్‌కు 960 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. కడెం పూర్తిగా నిండిపోగా 10,536 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. 18 గేట్లలో రెండు గేట్లు ఎత్తి 13,567 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 20,998 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. గురువారం రాత్రి 9 గంటల వరకు లక్ష్మీ బరాజ్ వద్ద 7.71 లక్షల క్యూసెక్కుల వరద వస్తున్నది.

పిడుగుపాటు మరణాలే అధికం

- ప్రకృతి వైపరీత్యాలతో దేశంలో ఏటా 8వేల మందికిపైగా మృత్యువాత
- పిడుగులతో 2,500 మృతి
- 2022 ప్రకృతి వైపరీత్యాల నివేదికను వెల్లడించిన నేషనల్ క్రైమ్ రికార్డ్స్‌బ్యూరో
- 'దామిని' ద్వారా వాతావరణ శాఖ అలర్ట్

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ) : సహజంగా తుఫాన్లు, భూకంపాలు, భారీ వర్షాలు, వరదలు, గాలిదుమారాలు, వడగాలులను ప్రకృతి విపత్తులుగా పరిగణిస్తుంటాం. పిడుగును ప్రకృతి విపత్తుగా ఎవరూ భావించరు. కానీ, అన్నింటికంటే పిడుగే అత్యంత ప్రమాదకారిగా ఎన్నోసార్లు నిరూపితమైంది. ప్రకృతి వైపరీత్యాల ద్వారా దేశంలో సంభవించే అత్యధిక మరణాలకు పిడుగులే కారణం! భారత వాతావరణ శాఖ (ఐఎండీ) గణాంకాల ప్రకారం పిడుగులతో ఏటా దేశంలో 2,500కు పైగా మరణాలు సంభవిస్తున్నాయి. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్సీఆర్బీ) నివేదిక మేరకు 2022లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా దేశంలో 8,060 మరణాలు సంభవించగా వాటిలో 2,887 మరణాలకు పిడుగుపాటే కారణమని తేలింది. అంటే ప్రకృతి వైపరీత్య మరణాల్లో 35.8 శాతం మరణాలకు పిడుగులే కారణమవుతున్నాయి. భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడిన ఘటనల్లో 358 మంది మృతిచెందగా దీనికి నాలారెట్లు ఎక్కువగా పిడుగులకు మృత్యువాతపడ్డారు. ఆ ఏడాది అత్యధికంగా మధ్యప్రదేశ్ (496), బీహార్ (329), మహారాష్ట్ర (239) లో సంభవించాయి. ప్రకృతి విపత్తులతో తమిళనాడులో 93 మరణాలు సంభవించగా వాటి లో పిడుగుపాటు మరణాలు 89 ఉన్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో 248కి 210, పశ్చిమ బెంగాల్‌లో 195కి 161 పిడుగులతో సంభవించినవే కావ డం గమనార్హం. కర్ణాటకలో 140, ఆంధ్రప్రదేశ్‌లో 140, తెలంగాణలో 40 మంది ప్రకృతి విపత్తుల కారణంగా చనిపోగా, 96 మంది పిడుగుపాటుతో కన్నుమూశారు. 2019 నుం చి దేశంలో పిడుగుపాటు మరణాలు 20 నుం చి 35 శాతం మేర పెరిగినట్టు ఐఎండీ గణాంకాలు తేటతెల్లం చేస్తున్నాయి. కానీ వీటిని ప్రమాదవశాత్తు సంభవించిన మరణాలుగానే కేంద్ర ప్రభుత్వం పరిగణిస్తున్నది.

ముందుగానే గుర్తించే 'దామిని'యాప్..

పిడుగులను ముందుగానే గుర్తించి హెచ్చరించేందుకు కేంద్ర ప్రభుత్వం 'దామిని' యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దామిని లైటింగ్ అలర్ట్ అనే ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. జీపీఎస్ లొకేషన్ తెలుసుకునేందుకు యాప్‌కు అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. 15 నిమిషాల్లో మనం ఉన్న ప్రాంతంలో పిడుగులు పడే అవకాశముందో? లేదో? ఈ యాప్ ద్వారా తెలుసుకునే వీలుంది. 2020 లో యాప్‌ను ఐఐటీఎం రూపొందించింది. జీపీఎస్ లొకేషన్ ఆధారంగా 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగుల గురించి ఈ యాప్ ముందుగానే హెచ్చరిస్తుంది. పిడుగులు పడే ప్రాంతంలో ఉన్నప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కూడా చెబుతుంది. పిడుగుపాటును ముందుగానే గుర్తించి ప్రజలను అప్రమత్తం చేసే పరిజ్ఞానం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విపత్తు నిర్వహణ శాఖ దగ్గర ఉంది. ఎర్త్ నెట్‌వర్క్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సెన్సార్లు ఏర్పాటు చేసి, ఎక్కడ పిడుగులు పడతాయో ఓ అంచనాకు వస్తారు. ఫోన్లకు ఎస్సెమ్మెస్‌ల ద్వారా సమాచారాన్ని పంపి జనాన్ని అప్రమత్తం చేస్తారు.

గ్రామాల్లోనే మరణాలు ఎక్కువ

పిడుగుల కారణంగా దేశవ్యాప్తంగా 2020లో 2,862 మంది, 2021లో 2,880 మంది మరణించారు. గ్రామాల్లోనే 95-96 శాతం పిడుగుపాటు మరణాలు సంభవిస్తున్నాయి. అమెరికా వంటి దేశాలతో పోల్చితే మన దేశంలో పిడుగుపాటు మరణాలు చాలా ఎక్కువ. అమెరికాలో ఏటా సగటున 20 మరణాలు సంభవిస్తున్నాయి. 2006 నుంచి 2021 వరకు ఆ దేశంలో 444 మంది పిడుగులతో చనిపోయారు. మన దేశంలో 1967 నుంచి 2019 వరకు లక్ష మంది పిడుగుపాటుకు గురై మరణించారు. ఇది 52 ఏళ్లలో ప్రకృతి వైపరీత్యాలతో సంభవించిన మరణాల్లో దాదాపు 33 శాతం! అలాగే వరదల కారణంగా సంభవించిన మరణాలకంటే రెండింతలు ఎక్కువ! ఐఎండీ గణాంకాల మేరకు ఈశాన్య రాష్ట్రాల్లో అత్యధికంగా పిడుగులు పడుతున్నాయి. కానీ, మధ్యభారతంలోనే పిడుగుపాటు మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. జూలైలో ఉత్తరప్రదేశ్ పిడుగులతో దద్దరిల్లిపోయింది. జూన్, జూలైలో బీహార్‌లో ఏకంగా 50 మంది దాకా మృత్యువాతపడ్డారు. ఆ రెండు రాష్ట్రాల్లో నెల వ్యవధిలోనే పిడుగుల కారణంగా సంభవించిన మరణాలు వందకు పైనే ఉన్నాయి.

కౌలు రైతు ఆత్మహత్య



అశోక్ (ఫైల్)

అన్నపురెడ్డిపల్లి, జూలై 25 : సాగులో దిగుబడి రాక.. చేసిన అప్పులు తీర్చలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం కట్టుగూడెంలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన రైతు మునగాల అశోక్(33) 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని మూడేండ్లుగా వ్యవసాయం చేస్తున్నాడు. సాగులో దిగుబడి రాకపోవడం.. సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించగా.. ఖమ్మం దవాఖానలో చేర్పించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయపడిన విహాన్‌రెడ్డి

అయిజ, జూలై 25: ఆడుకుంటున్న రెండేండ్ల బాలుడిపై కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. ఈ ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో గురువారం చోటుచేసుకున్నది. పట్టణంలోని కర్నూల్ రహదారిలో మాధవి, భీమేశ్వర్‌రెడ్డి దంపతుల కుమారుడు విహాన్‌రెడ్డి హోటల్ ఎదుట ఆడుకుంటుండగా.. కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. బాలుడి అరుపులు విన్న తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు కుక్కలను తరిమి కొట్టారు. బాలుడిని కర్నూల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. మున్సిపాలిటీలో కుక్కలు అధికంగా ఉన్నాయని, వాటిని పట్టుకొని తరలించాలని స్థానికులు కోరుతున్నారు.

రహదారిపై చెట్టు కూలి యువకుడి మృతి



జహంగీర్ (ఫైల్)

ఏటూరునాగారం, జూలై 25: ములుగు జిల్లా ఏటూరునాగారం-చిన్నబోయినపల్లి మధ్యలో జాతీయ రహదారిపై చెట్టు బైక్‌పై వస్తున్న యువకుడిపై కూలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. చిన్నబోయినపల్లికి చెందిన జహంగీర్ (30) గ్రామంలో మెడికల్ షాపు నడుపుతున్నాడు. మందులను తీసుకొచ్చేందుకు ఏటూరునాగారానికి వస్తున్న క్రమంలో రోడ్డుపై అకస్మాత్తుగా చెట్టు కూలింది. దీంతో జహంగీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. జహంగీర్‌కు ఏప్రిల్‌లో వివాహం నిశ్చయం కాగా, సెప్టెంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉన్నది.



సత్తి ముత్తయ్య, యశోదమ్మ (ఫైల్)

భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి

దోర్నకల్, జూలై 25: భర్త మరణం తట్టుకోలేక భార్య గుండెపోటుతో మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా దోర్నకల్ మండలం ముల్కలపల్లిలో గురువారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన సత్తి ముత్తయ్య (80) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం ఉదయం ముత్తయ్య మృతదేహం వద్ద ఆయన భార్య యశోదమ్మ (70) రోదిస్తూ గుండెపోటు వచ్చి ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబసభ్యులు ఖమ్మం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం

- స్పాట్‌లోనే ముగ్గురు యువకుల దుర్మరణం
- కంది అక్షయ పాత్రలో విధులు నిర్వహిస్తున్న మృతులు

కంది, జూలై 25: సంగారెడ్డి జిల్లా కంది మండలం తునికిల తండా సమీపంలో నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతులు పుల్కల్ మండలం గంగోజిపేట్ గ్రామానికి చెందిన కాశపాగ సందీప్‌కుమార్ (22), కాశపాగ నవీన్‌కుమార్ (22), గొంగ్లూర్ గ్రామానికి చెందిన సంటెపల్లి అభిషేక్ (23)గా పోలీసులు గుర్తించారు. మృతులు మండల కేంద్రం కందిలోని అక్షయపాత్ర ఫౌండేషన్ కిచెన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. రోజూలాగే విధులకు హాజరయ్యేందుకు గురువారం తెల్లవారుజామున ముగ్గురూ ఒకే బైక్‌పై బయలుదేరారు. సుమారు 15-20 కిలోమీటర్లు ప్రయాణించిన వీరి బైక్ తునికిల తండా వద్దకు చేరుకోగానే ముందుగా వెళ్తున్న టాటా డీసీఎం వ్యాన్‌ను వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సంగారెడ్డి రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. వర్షానికి తోడు అతివేగం ప్రమాదానికి కారణమై ఉంటుందని భావిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.



ప్రమాద స్థలంలో యువకుల మృతదేహాలు

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు హతం

గుండాల/గుమ్మూరు, జూలై 25: స్పెషల్ పార్టీ పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఓ మావోయిస్టు హతమయ్యాడు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం-ములుగు జిల్లా సరిహద్దు గుండాల మండలం దామరతోగు అడవుల్లో గురువారం చోటుచేసుకున్నది. దామరతోగు అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు స్పెషల్ పార్టీ పోలీసులు సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించారు. గమనించిన మావోయిస్టులు కాల్పులు ప్రారంభించారు. అప్రమత్తమైన స్పెషల్ పార్టీ పోలీసులు కాల్పులకు దిగారు. దీంతో ఒక మావోయిస్టు మృతిచెందాడు. అతడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా గుమ్మూరు మండలం బుద్ధారం గ్రామానికి చెందిన నల్లమారి అశోక్ అలియాస్ విజేందర్‌గా గుర్తించారు.